# భారత శక్తి
VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 20 | సంచిక : 309 | సోమవారం,జూన్ 1 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00


## జెన్ జీ ఆశయాలకు అనుగుణంగా 'సేనా గళం' ఏర్పాటు... పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం



**అమరావతి (భారత శక్తి):** జనసేన పార్టీలో సరికొత్త అధ్యాయానికి ఉప ముఖ్యమంత్రి, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారు. సామాజిక సామరస్యం, బాధ్యతాయుత రాజకీయాలు, రాజ్యాంగ విలువల పరిరక్షణ... ముఖ్యంగా జెన్ జీ యువత ఆశయాలకు అనుగుణంగా గళం వినిపించడమే లక్ష్యంగా 'సేనా గళం' అనే కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. కుల, మత రాజకీయాలతో సమాజాన్ని విభజించే

2లో..


# తెలంగాణలో ఎడ్యుకేషన్ మాఫియా బరితెగింపు




- నిలువునా మునుగుతున్న తల్లిదండ్రులు..
- 'కార్పొరేట్' మాయాజాలంలో బాల్యం బలి
- రూ. వేల కోట్ల విద్యా వ్యాపారం..
- నిబంధనలు ఇంటర్ బోర్డు 'కాగితాల'కే పరిమితం
- ఉత్తరాది మాఫియా చేతిలో తెలంగాణ విద్యా వ్యవస్థ..
- కోట సంస్కృతితో ప్రాణాలు కోల్పోతున్న విద్యార్థులు..

"భాగ్యనగర వీధుల సాక్షిగా అక్షరాలు అంగడి సరుకై, బాల్యం కార్పొరేట్ చెరసాలలో బందీ అవుతోంది. దేశాన్ని కుదిపేసిన 'నీట్' పేపర్ లీకేజీల ఉత్తరాది మాఫియా మూలాలు, నేడు స్థానిక రాబందులతో జతకట్టి తెలంగాణ విద్యా వ్యవస్థపై నిశ్శబ్ద పంజా విసిరాయి. ర్యాంకుల వేట, నకిలీ మెరుపులతో రూ. వేల కోట్ల దోపిడీకి 'నో-కాస్ట్ ఈఎంఐ'ల ఉచ్చు బిగుస్తోంది. ఇంటర్ బోర్డు నిస్సహాయత, డమ్మీ నెట్‌వర్క్‌ల అండతో సాగుతున్న ఈ అక్రమ విద్యావ్యాపార సామ్రాజ్యాన్ని ఎండగడుతూ, విద్యార్థుల ఆత్మఘోషపై 'భారత శక్తి' అందిస్తున్న ప్రత్యేక పక్షపాత రహిత దర్యాప్తు కథనం.

**(పరిశోధనాత్మక పాత్రికేయులు: ఎం.వేణుగోపాల్ రెడ్డి)**




**హైదరాబాద్, మే 31 (భారత శక్తి):** తెలంగాణలో ఇంటర్మీడియట్ విద్య అంటే ఒకప్పుడు అదొక పవిత్రమైన విద్యాదశ. కానీ నేడు అదొక మైండ్ గేమ్.. కొన్ని కోట్ల రూపాయల కార్పొరేట్ వ్యాపార సామ్రాజ్యం! భాగ్యనగరాన్ని హబ్‌గా చేసుకుని విస్తరించిన స్థానిక కార్పొరేట్ దిగ్గజాలు శ్రీ చైతన్య, నారాయణ కాలేజీలతో పాటు, ఉత్తరాది నుంచి ఇక్కడికి అడుగుపెట్టిన అలెన్ (Allen), రెజోనెన్స్ (=వంశీఋఅఎవ), ఫిట్‌జీ (FIITJEE), ఆకాష్ (Aakash) వంటి జాతీయ విద్యాసంస్థలు పోటీపడి మరీ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. నూతన విద్యా సంవత్సరం 2026--27 ప్రారంభాన్ని ఆసరాగా చేసుకుని విద్యా మాఫియా రూ. వేల కోట్లు దండుకునేందుకు పక్కాగా స్కెచ్ వేసి అమలు చేస్తోంది. ఈ మెరిసే ర్యాంకుల వెనుక ఉన్న చీకటి కోణాలు, విద్యా చట్టాల ఉల్లంఘనలు, ఫీజుల దోపిడీలు, విద్యార్థుల ఆత్మఘోషపై 'ఈనాడు' ప్రత్యేక క్షేత్రస్థాయి విశ్లేషణ.

### పక్కా స్కెచ్.. ఫలితాలు రాకముందే వేట!

అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. టెన్త్, సీబీఎస్ఈ ఫలితాలు పూర్తిగా వెలువడక ముందే జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల దందా మొదలైంది. టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థుల జాబితాలను అక్రమ మార్గాల్లో సేకరిస్తున్న ఈ సంస్థలు, ప్రత్యేక టెలికాలర్స్‌తో రాత్రింబవళ్లు ఫోన్లు చేయిస్తున్నాయి. తమ కాలేజీల్లో ప్రవేశాలు పొందేందుకు ఇప్పుడే 'అడ్వాన్స్ బుకింగ్' చేసుకోవాలంటూ తల్లిదండ్రులను తీవ్ర మానసిక వేధింపులకు గురిచేస్తున్నాయి.

### అనుమతి ఒకదానికి.. వ్యాపారం మరొకదానికి!

తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ (టి.జి.బి.ఐ.టి) నిబంధనల ప్రకారం, కేవలం ఇంటర్మీడియట్ రెగ్యులర్ కోర్సులను నిర్వహించడానికి మాత్రమే కాలేజీలకు అనుబంధ గుర్తింపు (అఫిలేషన్) ఇస్తారు. ఎటువంటి కోచింగ్ సెంటర్లను కాలేజీ ప్రాంగణాల్లో నడపడానికి వీలులేదు. కానీ వాస్తవ పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నంగా ఉంది.

### సమగ్ర కోర్సుల (ఇంటిగ్రేటెడ్) పేరిట మోసం:

శ్రీ చైతన్య, నారాయణలతో పాటు ఉత్తరాది బ్రాండ్లు అలెన్, రెజోనెన్స్ వంటి సంస్థలు 'ఇంటిగ్రేటెడ్ ఐఐటీ/నీట్' బ్యాచ్‌ల పేరుతో చట్టవిరుద్ధంగా క్లాసులు నిర్వహిస్తున్నాయి. కళాశాలల గుర్తింపు లేకపోయినా అడ్మిషన్లు: తెలంగాణలో వందలాది ప్రైవేట్ జూనియర్ కాలేజీలు బోర్డు నుంచి ఎలాంటి అనుబంధ గుర్తింపు లేకుండానే అడ్మిషన్లు పూర్తి చేస్తున్నాయి. వీటికి కనీస ఫైర్ సేఫ్టీ ఎన్ఓసీ (ఖీఱతీవ ఝఱవ్ఎ చీూజ) కూడా లేదు. కమర్షియల్ కాంప్లెక్స్‌లలో, ఇరుకు గదులలో విద్యార్థుల ప్రాణాలను పణంగా

2లో..

## వియత్నాం చేతికి 'బ్రహ్మోస్' అస్త్రం.. డీల్ ఖరారు చేసిన భారత్

- వియత్నాంకు బ్రహ్మోస్ క్షిపణుల అమ్మకంపై భారత్ ఒప్పందం పూర్తి
- ఇండోనేషియాతోనూ ఇదే తరహా ఒప్పందం తుది దశలో ఉందని వెల్లడి
- సింగపూర్‌లో రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ కీలక ప్రకటన
- దక్షిణ చైనా సముద్ర ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఒప్పందాలకు ప్రాధాన్యం
- రక్షణ ఎగుమతులను భారీగా పెంచుకోవడంపై భారత్ దృష్టి




**న్యూఢిల్లీ (భారత శక్తి):** రక్షణ రంగ ఎగుమతుల్లో భారత్ మరో కీలక మైలురాయిని దాటింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి 'బ్రహ్మోస్'ను వియత్నాంకు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇదే తరహా ఒప్పందం ఇండోనేషియాతో కూడా తుది దశలో ఉందని భారత రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ వెల్లడించారు. సింగపూర్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక షాంగ్రీ-లా డైలాగ్ భద్రతా సదస్సులో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. "వియత్నాంతో

2లో..

## ఆ విషయం చిట్‌చాట్‌లో చెప్పడం కాదు

- అధికారికంగా ప్రకటించాలి: కవిత డిమాండ్



**హైదరాబాద్ (భారత శక్తి)** రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అంశంపై మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడటం కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రకటించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయానికి మీటర్లు బిగించేది లేదని కూడా ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని కోరారు.

2లో..

## జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి


**- గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా**



**హైదరాబాద్, మే 31: భారత శక్తి,** విద్యాసంస్థలు విద్యార్థులను కేవలం పరీక్షలకే కాకుండా జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా తీర్చిదిద్దాలని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా అన్నారు.మొకిలాలోని 'ది క్వాంటియం స్కూల్'ను ఆదివారం రాష్ట్ర గవర్నర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, నాణ్యమైన విద్యతో పాటు ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మక ఆలోచన, సామాజిక బాధ్యత వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నేటి కాలంలో విద్య పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా మానసిక, సామాజిక, శారీరక వికాసానికి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ఆర్ట్ ఆఫ్ లివింగ్‌తో కలిసి పాఠశాల చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు కేవలం బోధకులు మాత్రమే కాకుండా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శకులని చెప్పారు.క్వాంటియం స్కూల్ భవిష్యత్తులో

2లో..

## విశాఖ రైల్వే జోన్ రేపటి నుంచే... సీఎం చంద్రబాబు ఏమన్నారంటే!



**అమరావతి భారత శక్తి:** విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ రేపు (జూన్ 1న) అధికారికంగా ప్రారంభం కానుండటంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక మైలురాయి అని, దశాబ్దాల కల నెరవేరుతోందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.నూతన రైల్వే జోన్‌తో ఉత్తరాంధ్ర రవాణా ముఖచిత్రం సమూలంగా మారిపోతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. దీనివల్ల కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించబడటంతో పాటు పారిశ్రామిక వృద్ధికి కూడా బాటలు పడతాయని తెలిపారు. రాష్ట్రాన్ని ఒక లాజిస్టిక్స్ హబ్‌గా మార్చే ప్రభుత్వ లక్ష్యానికి ఈ పరిణామం ఎంతో దోహదపడుతుందని వివరించారు. ఏపీ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు రాష్ట్ర ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చంద్రబాబు తన ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త రైల్వే జోన్ ఏర్పాటుతో ఈ ప్రాంత అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు

# దేశానికే రోల్ మోడల్ 'ఇందిరమ్మ ఇళ్లు'

- స్వతంత్ర భారత చరిత్రలోనే అతిపెద్ద గృహ విప్లవం: మంత్రి పొంగులేటి
- 13 నెలల్లోనే లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి.. మరో రెండు నెలల్లో 2 లక్షల ఇళ్లు సిద్ధం
- నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రెండో విడతకు శ్రీకారం.
- కొత్తగూడలో సామూహిక గృహప్రవేశాలు.. ఈ ఏడాది 3.50 లక్షల ఇళ్ల మంజూరు.

**హైదరాబాద్: మే 31, భారత శక్తి:** ఏడు దశాబ్దాల స్వతంత్ర భారత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేదలకు ఉచితంగా రూ. 5 లక్షల ఆర్థిక సహాయంతో భారీ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని అమలు చేస్తూ తెలంగాణ రాష్ట్రం దేశానికే మార్గదర్శకంగా నిలుస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఒక సామాజిక ఉద్యమమని ఆయన అభివర్ణించారు. ఆదివారం ఆయన ఒక



ప్రకటన విడుదల చేస్తూ.. ముఖ్యమంత్రి ఆలోచనలు, సూచనల మేరకు మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షలకు పైగా ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు.

### నేడే రెండో విడత ప్రారంభం

జూన్ 1వ తేదీన ఆసిఫాబాద్

2లో..

# తెలంగాణలో ఎడ్యుకేషన్ మాఫియా బరితెగింపు

## తెలంగాణలో ఎడ్యుకేషన్ మాఫియా బరితెగింపు





గంటల క్లాసులు, వీక్లీ టెస్టులు, మార్కుల ఆధారంగా సెక్షన్లు మార్చడం (స్టార్ బ్యాచ్, చైనా బ్యాచ్, నియాన్ బ్యాచ్) వంటి చర్యలు విద్యార్థులను తీవ్ర మానసిక కుంగుబాటుకు గురిచేస్తున్నాయి.

ఆత్మహత్యల శరణాలయం: ఇంటర్ బోర్డు విచారణల్లో అత్యధిక శాతం విద్యార్థుల ఆత్మహత్యలు ఈ కార్పొరేట్ సంస్థల రెసిడెన్షియల్ (హాస్టల్) క్యాంపస్‌లలోనే జరుగుతున్నట్లు తేలింది. వీరికి కనీస శారీరక శ్రమ, ఆటలు, వినోదం అనేవి ఉండవు.లాసెట్ (రాయిఔజజు/జూరూ) లోనూ దోపిడీ:లి కేవలం సైన్స్ గ్రూపులే కాకుండా గ్యాన్‌విల్లే అకాడమీ, గాతిక్ జూనియర్ కాలేజ్, పేజ్, అభ్యాస్ వంటి సంస్థలు హ్యూమానిటీస్, లాసెట్ శిక్షణ పేరిట సామాన్య, మధ్యతరగతి తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పెడుతున్నాయి.

### ఇంటర్ బోర్డు నిస్సహాయత లేదా మిలాఖత్?






పెట్టి ఈ క్యాంపస్‌లు నడుస్తున్నాయి.వేసవి నిబంధనల ఉల్లంఘన: మే నెల ఆఖరి దాకా వేసవి సెలవులు ఇవ్వాలని బోర్డు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ఏప్రిల్ మొదటి వారం నుంచే సెకండ్ ఇయర్ క్లాసులు ప్రారంభించి విద్యార్థులను భానుడి భగభగలకు గురిచేశారు.

### లోసుగుల 'ఈఎంఐ'లు -- సమాంతర ఫైనాన్స్ మాఫియా

హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఇంటర్ కాలేజీలలో ఫీజులు రూ. 1,00,000 నుండి ప్రారంభమై రూ. 3.50 లక్షల వరకు పలుకుతున్నాయి. ఇంటర్మీడియట్ విద్యకు పటిష్టమైన ఫీజు నియంత్రణ కమిటీ (ఫ్రీ రెగ్యులరిటీ బాడీ) లేకపోవడాన్ని ఈ విద్యాసంస్థలు పెట్టుబడిగా మార్చుకున్నాయి.

### ఈ.ఎం.ఐ లోసుగుల సరికొత్త దోపిడీ:

ఇటీవలి కాలంలో విద్యాసంస్థలు సరికొత్త ఆర్థిక దోపిడీకి తెరలేపాయి. ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలతో చేతులు కలిపి, తల్లిదండ్రులకు 'నో-కాస్ట్ ఈఎంఐ' అప్పన్లు ఇస్తున్నట్లు నమ్మిస్తున్నారు. తీరా చూస్తే అవి భారీ వడ్డీలతో కూడిన పర్సనల్ లోన్లుగా మారుతున్నాయి. ఫీజులు సకాలంలో కట్టకపోతే విద్యార్థులను క్లాసుల నుండి బయటకు పంపడం, హాల్ టికెట్లు ఆపేస్తామని బెదిరించడం వంటి బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నారు.

### క్లాసుల నిండా గొర్రెల మందలా విద్యార్థులు..

### కోట్లల్లో సంపాదన!

సాధారణంగా క్లాసులో 40 నుండి 45 మంది విద్యార్థులు మాత్రమే ఉండాలి. కానీ బోర్డు నిబంధనలను పక్కనబెట్టి ఒక్కో క్లాసులో 60 నుండి 80 మంది విద్యార్థులతో క్లాసులు నిర్వహిస్తున్నారు.ఒక్కో కాలేజీ ఐదు, ఆరు, ఏడు సెక్షన్లు ఏర్పాటు చేస్తూ ఒక్కో విద్యార్థి నుంచి సగటున రూ. లక్షకు తగ్గకుండా ఫీజు వసూలు చేస్తోంది.ఈ లెక్కన ఒక కాలేజీ ఏడు గ్రూపుల్లో మొత్తం కలిపితే 420 మంది విద్యార్థుల నుంచి సగటున ఏడాదికి ఫీజు రూపేణా రూ. 4.20 కోట్లు దండుకుంటోంది.గ్రేటర్ పరిధిలోనే దాదాపు 700 కాలేజీల ద్వారా ఈ విద్యా మాఫియా రూ. వేల కోట్ల దోపిడీకి పాల్పడుతోంది.

### ఉత్తరాది మాఫియా -- కోట సంస్కృతి తెచ్చిన ముప్పు

రాజస్థాన్‌లోని 'కోటా' కేంద్రంగా పనిచేసే అలెన్, రెజోనెన్స్ వంటి సంస్థలు ఇప్పుడు హైదరాబాద్‌లో తిష్ట వేశాయి. అక్కడ విద్యార్థులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేసే 'కోటా సంస్కృతి'ని ఇక్కడికి కూడా దిగుమతి చేశాయి. రోజుకు 12 నుండి 14

ప్రతి సంవత్సరం ఇంటర్ బోర్డు టాస్క్ ఫోర్స్ బృందాలు తనిఖీలు చేయడం, నోటీసులు జారీ చేయడం ఒక ప్రహసనంగా మారింది.

### డమ్మీ అడ్మిషన్ల నెట్‌వర్క్:

హైదరాబాద్‌లోని కొన్ని ప్రధాన బ్రాంచ్‌లలో వేల సంఖ్యలో అడ్మిషన్లు తీసుకుంటారు. కానీ బోర్డు నిబంధనల ప్రకారం ఒక సెక్షన్‌కు 88 మంది కంటే ఎక్కువ ఉండకూడదు. దీనికోసం వీరు జిల్లాల్లో ఉన్న తమ ఇతర అనుబంధ (గుర్తింపు ఉన్న) డమ్మీ కాలేజీల పేరుతో విద్యార్థులను పరీక్షలకు ఎన్‌రోల్ చేస్తారు. ఈ భారీ అక్రమం ఇంటర్ బోర్డు అధికారుల కళ్లముందే జరుగుతున్నా.. రాజకీయ, ఆర్థిక పలుకుబడి కారణంగా అధికారులు కంటితుడుపు చర్యలకే పరిమితమవుతున్నారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రైవేట్ జూనియర్ కాలేజీల ఫీజులను నియంత్రించడానికి, ఈ విద్యా మాఫియాకు అడ్డుకట్ట వేయడానికి ఒక పటిష్టమైన చట్టాన్ని తీసుకురావాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

## జెన్ జీ ఆశయాలకు అనుగుణంగా

# 'సేనా గళం' ఏర్పాటు...

ధోరణులకు వ్యతిరేకంగా ఈ కమిటీ పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. 'ముల్లును ముల్లుతోనే తీయాలి' అనే పాతకాలపు, బూర్జువా రాజకీయ ధోరణులకు జనసేన చరమగీతం పాడుతుందని తేల్చిచెప్పారు. ఒక కులం వారు విమర్శిస్తే, అదే కులం వారితో బదులిప్పించే పద్ధతిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి బూజుపట్టిన విధానాలకు తిలోదకాలిచ్చి, అభ్యుదయ భావాలతో ముందుకు సాగాలన్నదే జనసేన ఉద్దేశమని వివరించారు. సమకాలీన రాజకీయాల్లో కొందరు వ్యక్తులు తాము చేసే తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కులం, మతం, ప్రాంతం వంటి సున్నితమైన అంశాల ముసుగు వేసుకుంటున్నారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిగత తప్పిదాలకు సామాజిక వర్గాలను బాధ్యుల్ని చేస్తూ సమాజంలో విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, ఈ తరహా రాజకీయాలను నేటి యువత (జెన్-జీ) తీవ్రంగా వ్యతిరేకిస్తోందని అన్నారు. 'సేనా గళం' కమిటీ.. రాజ్యాంగ విలువలకు కట్టుబడి, దేశ సమగ్రతకు భంగం కలగకుండా పనిచేస్తుందని తెలిపారు. ముఖ్యంగా యువత ఆశయాలకు అనుగుణంగా గళం వినిపిస్తుందని దిశానిర్దేశం చేశారు. వ్యక్తిగత తప్పులను వ్యక్తిగత స్థాయిలోనే ప్రశ్నించాలి తప్ప, ఆ వ్యవహారంలోకి కులాలను, మతాలను లాగకూడదనేది జనసేన పార్టీ స్పష్టమైన విధానమని పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు.

# వియత్నాం చేతికి 'బ్రహ్మోస్' అస్త్రం.. డీల్ ఖరారు చేసిన భారత్

బ్రహ్మోస్ ఒప్పందం ఇప్పటికే పూర్తయింది. బహుశా బహిరంగంగా ప్రకటించనప్పటికీ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఇండోనేషియాతో చర్చలు కూడా తుది దశకు చేరుకున్నాయి. త్వరలోనే ఒప్పందం ఖరారు కావచ్చు" అని రాజేష్ కుమార్ సింగ్ తెలిపారు.నివేదికల ప్రకారం వియత్నాంతో కుదిరిన ఒప్పందం విలువ సుమారు రూ. 5,800 కోట్లు. ఇందులో భాగంగా తీరప్రాంత రక్షణ క్షిపణి వ్యవస్థలు, తొలి విడత క్షిపణులు, శిక్షణ, ఇతర సాంకేతిక సహకారం అందించనున్నారు. భవిష్యత్తులో వియత్నాం గగనతలం నుంచి ప్రయోగించే బ్రహ్మోస్ క్షిపణులను కూడా కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఇప్పటికే 2022లో ఫిలిప్పీన్స్ సుమారు 375 మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందంతో బ్రహ్మోస్‌ను కొనుగోలు చేసిన తొలి విదేశీ దేశంగా నిలిచింది. ఇప్పుడు వియత్నాం, త్వరలో ఇండోనేషియా కూడా ఈ జాబితాలో చేరనున్నాయి.దక్షిణ చైనా సముద్రంలో చైనాతో తీవ్రమైన ప్రాదేశిక వివాదాలు ఎదుర్కొంటున్న వియత్నాం, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాలు తమ రక్షణ సామర్థ్యాన్ని పెంచుకుంటున్న తరుణంలో ఈ ఒప్పందాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ధ్వని కన్నా మూడు రెట్ల వేగంతో (మాక్ 3) ప్రయాణించే బ్రహ్మోస్ క్షిపణిని భూమి, గాలి, సముద్రం నుంచి ప్రయోగించవచ్చు. దీని వేగం, కచ్చితత్వం కారణంగా శత్రువుల యుద్ధ నౌకలను, కీలక సైనిక స్థావరాలను వేగంగా ఛేదించగలదు.2020 గల్వాన్ ఘర్షణల తర్వాత చైనాతో సంబంధాలు ఉద్రిక్తంగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో తన వ్యూహాత్మక ప్రభావాన్ని పెంచుకోవాలని భారత్ భావిస్తోంది. రక్షణ ఎగుమతులను 2030 నాటికి రూ. 50,000 కోట్లకు చేర్చాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. మలేషియా, థాయ్‌లాండ్ వంటి ఇతర ఆగ్నేయాసియా దేశాలు కూడా బ్రహ్మోస్ కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.

# ఆ విషయం చిట్‌చాట్‌లో చెప్పడం కాదు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలతో ముందుకెళుతున్నాయని ఆమె మండిపడ్డారు. రాష్ట్రంలో కొత్తగా రైతు డిస్కం ఏర్పాటు చేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కవిత ఆరోపించారు. ఈ పేరుతో మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు.

ఈ కుట్రను అడ్డుకోవడానికి అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళతామని హెచ్చరించారు. అదేవిధంగా, కేంద్రం తీసుకొచ్చిన కొత్త సోలార్ జీవో కేవలం బడా కార్పొరేట్ సంస్థలకే మేలు చేస్తుందని ఆమె విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును దసరా నాటికి ప్రతిపాదించకపోతే, తాను పాదయాత్ర చేపడతానని కవిత హెచ్చరించారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో 18 రోజుల పసికందు చేయి కోల్పోయిన ఘటనపై కవిత తీవ్రంగా స్పందించారు. ఇది చాలా దారుణమని, దీనికి ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులే బాధ్యత వహించాలన్నారు. ఆ చిన్నారి పేరిట ప్రభుత్వం రూ.25 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు.

# దేశానికే రోల్ మోడల్ 'ఇందిరమ్మ ఇళ్లు'

జిల్లా కెరమెరి మండలం కొరారి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. అలాగే కొత్తగూడలో జరిగే సామూహిక గృహప్రవేశాల కార్యక్రమంలో కూడా ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు.

రెండో విడతలో 2.5 లక్షల ఇళ్ల మంజూరుతో కలుపుకొని, రెండు విడతల్లో కలిపి ప్రతి నియోజకవర్గానికి 5,500 నుంచి 6,500 ఇళ్లను కేటాయించినట్లు అవుతుందని వివరించారు. ఐటీడీఏ (ITDA) పరిధిలోని గిరిజన నియోజకవర్గాలకు అదనంగా మరో 500 నుంచి 1,500 ఇళ్లను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

### రికార్డు సమయంలో లక్ష ఇళ్లు పూర్తి

గత ఏడాది ఫిబ్రవరి మూడో వారంలో నారాయణపేట జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారని.. కేవలం ఈ 13 నెలల కాలంలోనే లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నామని మంత్రి వెల్లడించారు.

మరో ఒకటి రెండు నెలల్లో ఇంకో 2 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాబోతున్నాయని, గృహ నిర్మాణ రంగంలో ఇదొక జాతీయ రికార్డు అని కొనియాడారు.

### ఈ ఏడాది 3.50 లక్షల ఇళ్లకు పరిపాలనా అనుమతులు

ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను పట్టణ పేదల (క్యూర్) పరిధిలో ఒక లక్ష ఇళ్లకు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లకు.. మొత్తంగా 3.50 లక్షల ఇళ్ల మంజూరుకు పరిపాలనా అనుమతులు ఇచ్చినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. మొదటి విడతలో ఎదురైన అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, మరింత పటిష్టమైన ప్రణాళికతో రెండో విడత కార్యక్రమాన్ని అమలు చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించామన్నారు.

### కేంద్రం ఇచ్చేది గోరంత.. రాష్ట్రం ఇచ్చేది కొండంత!

దేశంలోని చాలా రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పరిమిత నిధులతోనే గృహ నిర్మాణాలను సాగదీస్తున్నాయని మంత్రి విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం 'పేదవాడి ఇల్లు - ప్రభుత్వ బాధ్యత' అనే లక్ష్యంతో స్వంత నిధులతో ముందుకు సాగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు మాత్రమే ఇస్తుంటే.. తెలంగాణ ప్రభుత్వం మాత్రం ప్రతి లబ్ధిదారునికి ఏకంగా రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తూ పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు.

### అసంపూర్తి ఇళ్లకు కాంగ్రెస్ సర్కార్ ఆసరా

గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి 2013 వరకు అమలైన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మంజూరై ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న ఇళ్లను, అలాగే 2023లో 'గృహలక్ష్మి' పథకంలో ఇళ్లు మంజూరై మధ్యలోనే నిలిచిపోయిన వాటిని పూర్తి చేయడానికి ఈ రెండో విడతలో అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ పథకం ద్వారా కేవలం రూ.20 వేల వరకు మాత్రమే ఆర్థిక సహాయం పొంది, ఇళ్లు పూర్తి చేసుకోలేని వారికి కూడా ఈ విడతలో ఇళ్లను మంజూరు చేయాలని చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు.

# జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి

నాణ్యమైన విద్యకు ఆదర్శంగా నిలుస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేసిన గవర్నర్, విద్యార్థులు పెద్ద లక్ష్యాలు నిర్దేశించుకుని నిరంతరం నేర్చుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.కార్యక్రమంలో ఎంపీ లు శ్రీమతి డీకే అరుణ, శ్రీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే రాకేష్ , స్కూల్ డైరెక్టర్ శ్రీ వెంకట్ మురికి, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ప్రతిపక్షాలు

# తప్పుదోవ పట్టిస్తున్నాయి

- వరి కొనుగోల్లపై బీఆర్ఎస్, బీజేపీలు రాజకీయం చేస్తున్నాయి
- రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు
- వరి ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది
- రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి



**నిజామాబాద్,మే 31, (భారత శక్తి ):** రాష్ట్రంలోని రైతులను ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి ఆరోపించారు. కమ్మర్పల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పంట కొనుగోళ్లపై గత కొన్ని రోజుల నుంచి బీఆర్ఎస్, బీజేపీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. రైతుల దగ్గరకు వెళ్లి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైతుల పంట కొనుగోల విషయంలో ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 1,50,000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరిస్తే.. కేంద్ర ప్రభుత్వం కేవలం 30 వేల టన్నుల వారి ధాన్యాన్ని మాత్రమే తీసుకుంటామని చెబుతోందని అన్నారు. ఈ విషయంపై బీజేపీ నాయకులు స్పందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వరి కొనుగోళ్ళు ఇప్పటివరకు 95 శాతం పూర్తయిందని... మిగిలింది కూడా కొనుగోలు చేస్తామని చెప్పారు. వరి కొనుగోళ్లపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. చివరి గింజ వరకు పంటను కొనుగోలు చేస్తామని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్మర్ పల్లి అధ్యక్షులు బోనగిరి భాస్కర్, మాజీ అధ్యక్షులు సుంకేట రవి, మాజీ డీసీసీ తిప్పిరెడ్డి శ్రీనివాస్, కమ్మరపల్లి టౌన్ అధ్యక్షులు సాల్లూరి గణేష్, కుకునూరు గ్రామ సర్పంచ్ భూమారెడ్డి పడగల గ్రామ సర్పంచ్ రాజు, అక్లూర్ గ్రామ సర్పంచ్ జనార్ధన్, అంక్సపూర్ గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, నరేష్ గోపాల్, అరవింద్, బైండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఐకేపీ ఉద్యోగుల సమ్మెకు మద్దతు



**నిజామాబాద్, మే 31(భారత శక్తి ):** బాల్కొండ మండల కేంద్రంలో ఐకెపి ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఇత్వర్ పేట్ లింగన్న మద్దతు తెలిపారు. గత కొన్ని రోజుల నుంచి న్యాయబద్ధంగా ఐకేపీ ఉద్యోగులు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే వీరి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేదంటే ఐకేపీ ఉద్యోగుల తరపున తాము కూడా నిరసనలో పాల్గొని సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# నీలోఫర్, ఎంఎన్‌జే ఆసుపత్రుల వద్ద'రెడీ టు సర్వ్' ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం.



**(హైదరాబాద్), మే 31: భారత శక్తి** నగరంలోని నీలోఫర్, ఎంఎన్‌జే ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 'రెడీ టు సర్వ్ ఫౌండేషన్', 'అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్' సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగుల సహాయకులు, నిరుపేదలకు ఈ సందర్భంగా భోజన వసతి కల్పించారు.

### నిరంతరం సేవా కార్యక్రమాలు

సమాజంలో ఆకలితో అలమటించే వారికి అండగా నిలిచేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తామని పేర్కొన్నారు. ఫౌండేషన్ సభ్యులు, వాలంటీర్లు పాల్గొని వందలాది మందికి ఆహారాన్ని పంపిణీ చేశారు. ఆసుపత్రుల వద్ద గంటల తరబడి వేచి ఉండే తమకు ఈ భోజన సదుపాయం ఎంతో ఊరటనిచ్చిందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సేవా వితరణలో భాగస్వాములు కావాలనుకునే వారు తమను సంప్రదించవచ్చని ఫౌండేషన్ ప్రతినిధి పెద్దిశంకర్ ఒక ప్రకటనలో కోరారు.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## ఆర్థిక స్థిరత్వం లేకపోతే
## అభివృద్ధి నీటి మీద బుడగ

ఎంత అభివృద్ధి చెందిన దేశం అయిన 'వనరుల స్వావలంబన', 'ఆర్థిక స్థిరత్వం' లేకపోతే ఆ దేశం అభివృద్ధి కేవలం నీటి మీద బుడగలాంటిదే. ఇప్పుడు ఇదే సూత్రం మన దేశానికీ కూడా వర్తిస్తుంది. ఇటీవల మన దేశ ప్రధాని 9 రకాల అంశాల పొదుపుపై చేసిన ప్రసంగంతో దేశం యావత్ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డది. గత ఆదివారం సాయంత్రం ప్రధాని హైదరాబాద్‌లో ఈ ప్రకటన చేయగానే సోమవారం ఉదయం స్టాక్ మార్కెట్ సూచీలు బెంబేలెత్తాయి. ఇప్పటికీ స్టాక్ మార్కెట్‌ల ఒడిదుడుకులు కొనసాగుతున్నాయి. స్వయాన ప్రధానమంత్రి దేశ ప్రజలకు పొదుపు పాఠాలు చెప్పడం, దేశ ప్రజలను అప్రమత్తం చేయడం చూస్తే 'వనరుల స్వావలంబన' 'ఆర్థిక క్రమశిక్షణ' లేకపోతే మునుముందు ఆర్థిక సంక్షోభం తప్పదా? అనే అనుమానాలు కలుగక మానదు. అయితే, ప్రధాని ప్రకటనలను కొంతమంది వ్యతిరేక దృక్పథంతో చూస్తే, మరికొందరు సానుకూల దృక్పథంతో చూస్తున్నారు. వాస్తవానికి ప్రధాని చేసిన ప్రకటనలను పాజిటివ్ దృక్పథంతో చూడాలి. ఎందుకంటే, ప్రధాని పేర్కొన్న 9 అంశాలు మామూలు అంశాలు కాదు. దేశ గమనం వీటిమీదనే ఆధారపడి ఉన్నది. వాటిలో బంగారం కొనుగోలు, పెట్రోల్ వాడకం తగ్గించుకోవడం, సేంద్రియ ఎరువులు వాడడం, వంట నూనెల వాడకం తగ్గించుకోవడం చాలా కీలకమైనవి. దాదాపు ప్రతీ సగటు జీవిపై వీటి ప్రభావం ఉంటది. అసలు ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంలో పెట్రోల్, బంగారం, నూనెలు, ఇతర విదేశీ ఉత్పత్తుల వాడకం గురించి దేశ ప్రధాని పొదుపు ప్రకటనలు చేయడం వెనుక ఆంతర్యం ఏమిటి? ఎక్కువ శాతం దిగుమతుల మీద ఆధారపడ్డ మనదేశంలో వనరుల స్వావలంబన, ఆర్థిక క్రమశిక్షణ అవసరమా? అనేవి ప్రస్తుత పరిస్థితులలో అందరూ ఆలోచించాల్సిన తరుణం. దేశ జనాభాకి తగినట్టుగా భారతదేశంలో వనరులు లేవు. అందుకే, కొన్ని కీలక వస్తువుల వినియోగంలో దేశం దిగుమతుల మీద ఆధారపడి ఉన్నది. వాటిలో ముఖ్యమైనది ముడిచమురు కాగా, రెండవది బంగారం. మొదటిగా ముడి చమురు పరిశీలిస్తే, 2025 -26 వాణిజ్య డేటా ప్రకారం, మొత్తం దేశ దిగుమతుల విలువ సుమారు 775 బిలియన్ డాలర్లు కాగా, వాటిలో సుమారు 135 బిలియన్ డాలర్ల విలువ గలిగిన చమురు దిగుమతులు కూడా ఉన్నాయి. ముడిచమురు, ఖనిజ ఇంధనం కలుపుకొని భారతదేశం మొత్తం దిగుమతులలో దాదాపు 30% పైననే ఉంటాయి. మొత్తం ముడి చమురు అవసరాలలో సుమారు 87.8% మనం ఇతర దేశాల నుండి దిగుమతి చేశామంటున్నాం. దేశ చమురు అవసరాలలో కేవలం 15% కంటే తక్కువ మాత్రమే దేశీయ ఉత్పత్తి సామర్థ్యం ఉన్నది. మరోవైపు, మొత్తం ముడి చమురు దిగుమతిలో సుమారు 45-50 శాతం కేవలం పశ్చిమాసియా దేశాల నుండి దిగుమతి అవుతుంది. ఇటీవల అమెరికా, ఇజ్రాయల్ ఇరాన్ మధ్య తలెత్తిన యుద్ధం ప్రభావంతో ముడి చమురు దిగుమతి తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్ లో దాని ధరలు కూడా పెరిగాయి. యుద్ధానికి ముందు (జనవరి నెలలో) బ్యారెల్ ముడి చమురు విలువ సుమారు 61.41 డాలర్ కాగా, ప్రస్తుతం దాని విలువ సుమారు 100 డాలర్ పై నే ఉన్నది. యుద్ధం తరువాత, దాదాపు అన్ని దేశాలలో పెట్రోల్, డీజిల్ ధరలు సగటున 25 నుండి 50 శాతం వరకు పెరిగాయి.

కానీ మన దేశంలో మాత్రం ధరలు పెరగలేదు. ఆయా ధరల భారం సామాన్య ప్రజలపై పడకుండా కేంద్ర ప్రభుత్వం జాగ్రత్త పడుతున్నది. కానీ రానున్న రోజుల్లో ఆ భారం మరింతగా పెరిగే అవకాశం లేకపోలేదు.ఇకపోతే, బంగారం కూడా సుమారు ఒక ఏడాదిపాటు కొనుగోలు చేయవద్దని ప్రధాని చేసిన సూచన కొన్నివర్గాలకు రుచించడం లేదు. బంగారం మన దేశంలో ఒక సెంటిమెంట్ సాధనం. ప్రొడక్టీవ్ పర్పస్ కోసం కాకుండా కేవలం సెంటిమెంట్, అలంకరణ కోసం మాత్రమే బంగారం కొనుగోలు చేస్తున్నాము. ప్రపంచంలో ఉన్న మొత్తం బంగారం నిల్వలో, సుమారు 35 శాతం బంగారం మన దేశంలోనే ఉన్నది. 2024- 25లో 58 బిలియన్ డాలర్ విలువ గలిగిన 757.09 టన్నుల బంగారం దిగుమతి చేసుకోగా, 2025-26 లో 78.98 బిలియన్ డాలర్ల విలువ గలిగిన 721.03 టన్నుల బంగారం దిగుమతి చేసుకున్నాం. గత సంవత్సరంతో పోల్చితే, బంగారం దిగుమతి పరిమాణం తగ్గినప్పటికీ సుమారు 24% వరకు బంగారం ధర మాత్రం పెరిగింది. దిగుమతి టారిఫ్ పెంచడం, యుద్ధం చేయడం వంటి అనవసర నిర్ణయాలతో ట్రంప్ ప్రపంచాన్ని భయాందోళనకు గురిచేస్తున్నాడు. అందుకే పెట్టుబడి దారులు, స్టాక్ మార్కెట్‌లలో సంపదను సురక్షితమైన బంగారం వైపు తరలిస్తున్నారు. ఫలితంగా బంగారం ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో ఆకాశాన్ని అంటాయి. కానీ బంగారం కొనుగోలు మాత్రం భారత్‌లో తగ్గలేదు. వినియోగదారు కొనుగోలు చేసిన బంగారం తిరిగి వారి లాకర్‌లోకి చేరుకుంటుంది. కానీ దాని ద్వారా ఎటువంటి ఉత్పాదకత జరుగదు.

బంగారం దిగుమతి రాను రాను దేశానికీ భారం అవుతుంది. భవిష్యత్‌లో బంగారం దిగుమతులు పెరిగితే, అది దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర ఆటంకం చేస్తుంది. ఒకవైపు ప్రపంచ వ్యాప్తంగా బంగారం, ముడిచమురు ధరలు పెరుగుతున్నాయి. వాటిని దిగుమతి చేసుకోవడానికి అయ్యే ఖర్చును డాలర్ రూపంలో చెల్లించాలి. మన దేశానికి వచ్చే రేమిటన్స్ తగ్గిపోవడం, ట్రంప్ నిర్ణయాలతో మన ఎగుమతులు తగ్గి దేశానికి డాలరు రాక తగ్గిపోయింది. కానీ బంగారం, ముడి చమురు వంటి ఇతర వస్తువుల దిగుమతి ఖర్చును డాలర్ రూపంలో చెల్లించాల్సి వస్తుంది. మన దగ్గర తగిన విదేశీ నిల్వలు (డాలర్) లేకపోవడం వలన అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌ను కొనుగోలు చేయవలసి రావడం వలన రూపాయి విలువ తగ్గి డాలర్ విలువ పెరుగుతుంది. ట్రంప్ అధికారంలోకి రాక ముందు అంటే 2024 డిసెంబర్‌లో 1 డాలర్ విలువ 83 రూపాయలు కాగా, ఇప్పడు అది సుమారు 95 రూపాయలకు చేరుకుంది. ఏప్రిల్ 17, 2026 నాటికి భారతదేశ విదేశీ మారక ద్రవ్యనిల్వలు 703.308 బిలియన్ డాలర్లు. పరిస్థితి ఇలాగే కొనసాగితే డాలర్ 100 రూపాయలకు చేరుతుంది. అప్పడు దిగుమతులు మరింత భారం అవుతాయి.

ఆ భారం దేశ ప్రజలపై పడుతుంది. ముఖ్యంగా చమురు ధరలు పెరిగితే సరుకు రవాణా పెరిగి అన్ని రకాల వస్తువుల ధరలు పెరుగుతాయి. ఇప్పటికే టోకు ద్రవ్యోల్బణం 3.88% కి చేరింది. రిటైల్ ద్రవ్యోల్బణం 3.40% గా ఉంది. ప్రస్తుత పరిస్థితి కొనసాగితే, మరి కొద్ది రోజుల్లోనే ద్రవ్యోల్బణం 4-4.5%కి చేరే ప్రమాదం ఉంది. ఇది సామాన్యుల బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపడమే కాకుండా బ్యాంకింగ్, ఇన్సూరెన్సు, పారిశ్రామిక రంగాలు భారీగా నష్టపోతాయి. అందుకే, దిగుమతులు తగ్గించుకోవాలి. అంటే, ప్రజలు బంగారు, పెట్రోల్, డీజిల్, వంటనూనెలు, ఇతర దిగుమతుల పై ఆధారపడ్డ వస్తువుల వినియోగం తగ్గించుకుంటే, అంతమేర దిగుమతులు తగ్గి ఈ కష్టకాలం నుండి బయట పడవచ్చును.

## త్యాగాల పునాదులు మావి..
# అబద్ధాల చరిత్ర మీది..

- నమ్మి ఓట్లు వేస్తే నట్టేట ముంచారు.. - ఆరు గ్యారెంటీ ల పేరుతో అరచేతిలో స్వర్గం చూపించారు..
- సిఎస్ఆర్ నిధులు స్థానికంగా ఖర్చు పెట్టకపోతే ప్రజా ఉద్యమం..
- రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో పటాన్‌చెరులో బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు చేస్తాము..
- రాబోయే బల్దియా ఎన్నికల్లో గులాబీ జెండా రెపరెపలు..
- 9 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేస్తాము.. - ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా చూసుకుంటున్నాం..
- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎగిరేది గులాబీ జెండానే..
- పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి..
- కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ఫైర్.. - ప్రజా పాలన గాలికి పర్సంటేజిల పాలన చేతికి..
- డిజిటల్ సభ్యత్వ నమోదులో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలి..
- ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్..
- పటాన్‌చెరులో ఘనంగా బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గస్థాయి సభ్యత్వ నమోదు అవగాహన కార్యక్రమం.. - గులాబీమయమైన జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్..





పటాన్‌చెరు మే 31 భారత శక్తి ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ అబద్ధాల పునాదులపై పాలన కొనసాగిస్తోందని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి..సంక్షేమంలో దేశంలో అగ్రగామిగా తీర్చిదిద్దితే నేడు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇండ్ల కూల్చివేతలు.. రైతుల రోదనలు.. నిరుద్యోగుల ఆక్రందనలు.. హామీల ఎగవేతలతో పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు.
రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది డివిజన్లలో బిఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేసి కేసిఆర్ కు గిఫ్ట్ గా అందిస్తామని ఆయన తెలిపారు.
బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పండగ వాతావరణం లో నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధ్యక్షతన బిఆర్ఎస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గస్థాయి సభ్యత్వ నమోదు అంశంపై బూత్ లెవెల్ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

**ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్, సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇన్చార్జ్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు పటాన్‌చెరు నియోజకవర్గంలో గులాబీ జెండాను ప్రజలు తమ గుండెల్లో పెట్టుకొని చూసుకుంటున్నారని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో దశాబ్ద కాలం పాటు నియోజకవర్గాన్ని అభివృద్ధి.. సంక్షేమంలో రాష్ట్రంలోనే నెంబర్ వన్ గా తీర్చిదిద్దడం జరిగిందని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అందరూ గర్వపడేలా పార్టీని పటిష్టం చేయడంతో పాటు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య కార్యకర్తలు సమన్వయకర్తలుగా పనిచేశారని తెలిపారు. ఎప్పుడు ఏ కష్టం వచ్చినా కార్యకర్తలకు అండగా నిలుస్తూ వారిని తమ కుటుంబ సభ్యులుగా చూసుకోవడం జరిగిందని గుర్తు చేశారు. మూడుసార్లు పటాన్‌చెరు నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేయడంతో పాటు ప్రతి ఎన్నికల్లోను గులాబీ జెండా ను రెపరెపలాడించడామని అన్నారు. ప్రతి గెలుపులో కార్యకర్తల కష్టం మరువలేనిదని అన్నారు. వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. ప్రతి ఐదు సంవత్సరాలు ఒకసారి నిర్వహించుకునే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పండగ వాతావరణం లో ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. పార్టీ నిర్దేశించిన లక్ష్యానికి మించి సభ్యత్వ నమోదు చేయబోతున్నట్లు తెలిపారు. త్వరలో జరగనున్న బల్దియా ఎన్నికలకు కార్యకర్తల సిద్ధం కావాలని సూచించారు. ఇటీవల జరిగిన ఐదు మున్సిపాలిటీలో క్లీన్ స్వీప్ చేసిన విధంగానే.. 9 డివిజన్లలోనూ బిఆర్ఎస్ అభ్యర్థులే ఘన విజయం సాధించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు.

**ఇండ్ల కూల్చివేతలు.. రైతుల రోదనలు..**
**నిరుద్యోగుల ఆక్రందనలు..**
**ఇదా మీ ఇందిరమ్మ పాలన..**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పటాన్‌చెరు నియోజకవర్గంలోని నిరుపేదలకు కాలరాత్రులు ప్రారంభమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో పేదోడి గుడిసెల పైకి బుల్డోజర్ ను పంపిస్తూ వారి జీవితాలను ఆగమాగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీ ల పేరుతో ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చి నేడు వాటిని అమలు చేయకుండా అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. కేవలం రెండు సంవత్సరాల పాలనలోనే ప్రజలు విసిగిపోయారని.. ఎన్నికలు ఎప్పుడు జరిగినా తిరిగి కెసిఆర్ నాయకత్వాన్ని బలపరిచేందుకు ప్రజలు సిద్ధమయ్యారని తెలిపారు. ఇందిరమ్మ పాలన పేరుతో ప్రజలను అష్ట కష్టాలకు గురి చేస్తున్నారని దుయ్యబట్టారు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ పరిశ్రమల ద్వారా అందిస్తున్న సి ఎస్ ఆర్ నిధులను స్థానిక అభివృద్ధి పనులకు కేటాయించాలని.. లేనిపక్షంలో వేలాది మందితో కలిసి జిల్లా కలెక్టరేట్ ను ముట్టడించడం జరుగుతుందని హెచ్చరించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులోనూ స్థానికులకు 10 శాతం కోట ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు.బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇన్చార్జ్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గం అంటేనే బిఆర్ఎస్ పార్టీకి కంచుకోట అని.. ఎమ్మెల్యే జిఎంఆర్ నాయకత్వంలో రాష్ట్రంలోని రికార్డు స్థాయిలో పటాన్‌చెరు నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ.. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అతి త్వరలో మరోసారి డిజిటల్ సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో ప్రతి కార్యకర్త ఉత్సాహంతో పనిచేయాలని సూచించారు. బూత్ స్థాయి నుండి సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని కోరారు.

## విజయవంతంగా తెలంగాణ వ్యవసాయ
# కార్మిక సంఘం 3వ మహాసభలు

### ప్రజా సమస్యలపై పోరాటమే వ్యవసాయ కార్మిక సంఘం లక్ష్యం






వికారాబాద్ మే 31 భారత శక్తి వ్యవసాయ కార్మిక సంఘం ఎల్లప్పుడూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందని, సమాజంలో ఎక్కడైనా అసమానతలు, అన్యాయాలు చోటుచేసుకుంటే అక్కడికి వెళ్లి ప్రజల పక్షాన నిలుస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం వికారాబాద్ జిల్లా యాలాల మండల కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం 3వ మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాలు, ఎన్నికల విజయాలకే పరిమితమవుతున్నాయని, ప్రజా సమస్యలను పట్టించుకోవడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో రైతుల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకుంటూ, పోలీసు బలగాలను ప్రయోగించి భూములను లాక్కుంటోందని ఆరోపించారు.ప్రజల హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం ప్రాణత్యాగాలు చేసిన చరిత్ర ఎర్రజెండాకే ఉందని నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని, లేకపోతే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మిలిటెంట్ ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. మహాసభల సందర్భంగా వికారాబాద్ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా బుగ్గప్పను మరోసారి ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. తనపై విశ్వాసం ఉంచి మరోసారి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి బుగ్గప్ప కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యాలాల మండల వీఓఏలు తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్రాములకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ, జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, జిల్లా కార్యదర్శి వెంకటయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మల్కయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మహిపాల్, జిల్లా నాయకులు గోపాల్ రెడ్డి, వివిధ మండలాల నాయకులు, కార్మికులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బలమైన గాలులకు కూలిన హోర్డింగ్ ఫ్రేమ్.. తృటిలో తప్పించుకున్న బైకర్, స్కూటీ రైడర్



అహ్మదాబాద్: బలమైన గాలులకు హోర్డింగ్ ఫ్రేమ్ కూలిపోయింది. ఆ సమయంలో రోడ్డుపై వెళు తున్న బైకర్, స్కూటీ రైడర్ ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. (ఎశ్ఖుతీఎఱఅస్త్ర ఖీఱఖుఎవ ఖీఱశ్రీశ్రీం) గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఈ సంఘటన జరిగింది. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు రద్దీగా ఉండే రంజిత్‌సాగర్ రోడ్డుపై ఉన్న హోర్డింగ్ ఫ్రేమ్ బలమైన గాలికి కూలిపోయింది. కాగా, రోడ్డుపై వెళ్తున్న ఒక బైకర్ కూలుతున్న హోర్డింగ్ ఫ్రేమ్ కింద నుంచి తల ఒంచి తృటిలో వేగంగా వెళ్లిపోయాడు. ఇంతలో ముగ్గురు ప్రయాణిస్తున్న స్కూటీ అక్కడకు చేరుకున్నది. ప్రమాదాన్ని పసిగట్టిన స్కూటీ రైడర్ అకస్మాత్తుగా బ్రేకులు వేశాడు. దీంతో దానిపై ఉన్న ముగ్గురు వ్యక్తులు తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మిగతా వాహనదారులు రోడ్డుకు ఇరువైపులా ఆగిపోయారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురడం ఖాయం.. నివేదిత సాయన్న ధీమా




కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ బలంగా ఉందని దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె, బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత సాయన్న తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో కంటోన్మెంట్‌లో ఎంతో అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. పేదల కోసం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నివేదిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో కంటోన్మెంట్ అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. కంటోన్మెంట్‌లో మళ్లీ బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## ముగ్గురు భక్తుల మృతి.. ఒకరు తెలంగాణ వాసి.. కేదార్‌నాథ్ యాత్ర తాత్కాలికంగా నిలిపివేత



ఉత్తరాఖండ్‌లో సాగుతున్న కేదార్‌నాథ్ యాత్ర సందర్భంగా విషాదం చోటు చేసుకుంది. వాతావరణం సరిగ్గా లేకపోవడం, అనారోగ్యం కారణంగా ముగ్గురు భక్తులు మరణించారు. వారిలో ఒకరు తెలంగాణకు చెందిన భక్తుడు ఉన్నాడు. భారీ వర్షాలు, కొండ చరియలు విరిగిపడటం వంటి కారణాలతో కేదార్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొండ చరియలు విరిగిపడటం వంటి కారణాలతో యాత్ర సాగడం లేదు. దీంతో ఎక్కడికక్కడ యాత్రను తాత్కాలికంగా నిలిపివేసినట్లు స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్ (ఎస్ఈఓసీ) వెల్లడించింది. మృతులు ముగ్గురు రుద్రప్రయాగ్ ప్రాంతంలోనే ప్రాణాలు కోల్పోయారు. బాధితుల్లో గోపాల్ మిశ్రా (76) యాత్రకు వెళ్లి తిరిగి వస్తుండగా అనారోగ్యం కారణంగా మరణించారు. నవగంజి లక్ష్మన్‌జీ ఠాకూర్ (52) అనే వ్యక్తి యాత్రకు వెళ్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. తెలంగాణలోని హైదరాబాద్‌కు చెందిన బలగాని బలరాజ్ (49) కూడా అనారోగ్యం కారణంగా మరణించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అక్కడ వాతావరణ సరిగ్గా లేకపోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. భక్తులు వెళ్లే రూట్లను మూసివేసి, వారికోసం వసతులు ఏర్పాటు చేశారు. శనివారం నుంచి రుద్రప్రయాగ్ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనివల్ల భక్తులు వెళ్లే మార్గంలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉంది. అందుకే తాత్కాలికంగా యాత్రను నిలిపివేశారు. మళ్లీ వాతావరణం సాధారణ స్తితికి వచ్చిన తర్వాతే యాత్రను తిరిగి ప్రారంభిస్తారు. ఈ మేరకు జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాలు జారీచేశారు. ఈ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భక్తులు అధికారులు సూచించిన చోట మాత్రమే ఉండాలని కోరారు.

## పర్యాటక ప్రాంతంలో కాల్పుల కలకలం.. స్థానిక వ్యక్తికి గాయాలు



సిమ్లా: ప్రముఖ పర్యాటక ప్రాంతంలో తుపాకీ కాల్పులు కలకలం రేపాయి. రెండు వర్గాల మధ్య జరిగిన వివాదం ఘర్షణకు దారి తీసింది. ఈ నేపథ్యంలో పంజాబ్‌కు చెందిన ఒక పర్యాటకుడు గన్‌తో కాల్పులు జరిపాడు. స్థానికుడైన వ్యక్తి కాలికి బుల్లెట్ తగడంతో గాయమైంది. (Kasol Firing) హిమాచల్ ప్రదేశ్‌లోని కుల్లు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పర్యాటక ప్రాంతమైన కసోల్ పర్యాటకులతో సందడిగా మారింది.కాగా, శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో ప్రసిద్ధ గ్రీన్ వ్యాలీ హోటల్‌లో ఒక విషయంపై రెండు వర్గాల మధ్య వాగ్వాదం చెలరేగింది. అది ఘర్షణగా మారడంతో పంజాబ్‌కు చెందిన ఒక పర్యాటకుడు పిస్టల్ తీసి కాల్పులు జరిపాడు. అయితే స్థానికుడైన వ్యక్తి కాలికి తగలడంతో గాయమైంది. దీంతో బాధతో అతడు కుప్పకూలిపోయాడు.ఆ తర్వాత హోటల్ పార్కింగ్ ప్రాంతం నుంచి ఆ వ్యక్తి బయటకు వెళ్తుండగా కాల్పులు జరిపిన పర్యాటకుడు చేతిలోని గన్‌తో అనుసరించాడు. అతడు మరోసారి పిస్టల్ గురిపెట్టగా పంజాబ్‌కు చెందిన ఇతర పర్యాటకులు అడ్డుకున్నారు. ఇంతలో గాయపడిన వ్యక్తిని మరో స్థానికుడు వీపుపై మోసుకుని అక్కడి నుంచి తీసుకెళ్లాడు. ఆ తర్వాత అతడ్ని ఆసుపత్రికి తరలించారు.మరోవైపు కాల్పుల సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. పంజాబ్‌కు చెందిన నలుగురు పర్యాటకులను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం పోలీసులు వెతుకుతున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. కాల్పులకు కారణం ఏమిటన్నది దర్యాప్తు చేస్తున్నారు.

# నిబంధనలు 'అటకెక్కించారు'..

## అక్రమ కట్టడాలకు 'అక్యుపెన్సీ' కట్టబెట్టారు!

- ఎల్బీనగర్ జోన్‌లో పట్టణ ప్రణాళికా విభాగం లీలలు - పారదర్శకత లోపం బిల్డ్ నౌ: అవినీతి అక్రమాల ప్రోత్సాహం..
- కనీస సెట్‌బ్యాక్‌లు లేవు.. జీఓ 168 నిబంధనలు గాల్లోకి! - సర్టిఫికేట్ రాగానే రోడ్డును ఆక్రమించి రెండు షట్టర్ల నిర్మాణం,
- పూర్తి ఆధారాలతో వ్రాతపూర్వక ఫిర్యాదు చేస్తే భారీ ముడుపులు తీసుకుని అక్రమార్కులకే సపోర్ట్..!
- ఫిర్యాదు అంది ఏడాది గడిచినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న యంత్రాంగం
- బాధ్యులపై విజిలెన్స్ విచారణకు స్థానికుల డిమాండ్.. - ఎం.ఎం.సి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, మున్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్, మున్సిపల్ శాఖ మాత్యులు సీ.ఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించాలి..!






**ఎల్బీనగర్, మే 31: భారత శక్తి** బిల్డ్ నౌ పోర్టల్ పుణ్యమా అంటూ పారదర్శకత లోపం అక్రమాలకు ప్రోత్సాహం, మాకు అడ్డు అదుపు లేదన్నట్లుగా అధికారుల అవినీతి చేష్టలు, నగరంలో మున్సిపల్ నిబంధనలు, పట్టణ ప్రణాళికా చట్టాలు ఏ మేరకు అమలవుతున్నాయో చెప్పడానికి ఎల్బీనగర్ జోన్ పరిధిలో వెలుగుచూసిన ఈ ఘటనే ఒక నిదర్శనం. నిబంధనల ప్రకారం వదలాల్సిన కనీస ఖాళీ స్థలాన్ని (సెట్‌బ్యాక్‌లు) పూర్తిగా వదిలేసి, మంజూరైన ప్లాన్‌ను పూర్తిగా ఉల్లంఘిస్తూ నిర్మించిన ఒక భారీ అపార్ట్మెంట్ భవనానికి మున్సిపల్ అధికారులు దర్జాగా 'అక్యుపెన్సీ సర్టిఫికేట్' (రాజ) కట్టబెట్టడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. క్షేత్రస్థాయిలో అక్రమాలు కంటికి కనిపిస్తున్నా, వాటిని సరిచేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించి సర్టిఫికేట్ జారీ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ప్లాన్ ఒకచోట.. నిర్మాణం మరోచోట!

రంగారెడ్డి జిల్లా, సరూర్‌నగర్ మండల పరిధిలోని డాక్టర్స్ కాలనీ, రోడ్ నెంబర్ 1 లో ఉన్న ఒక నివాస/వాణిజ్య భవన నిర్మాణంలో ఈ అక్రమాలు చోటుచేసుకున్నాయి. సర్వే నెంబర్ 9/1 (పాత), 9/6 (కొత్త) పరిధిలోని ప్లాట్ నెంబర్ 10 (దక్షిణ భాగం) మరియు ప్లాట్ నెంబర్ 11 లలో ఈ భవన నిర్మాణానికి గతంలో అనుమతులు లభించాయి. సదరు నిర్మాణదారులు 20-12-2023 తేదీన 4867/GHMC/LBN/3023-BP (ఫైల్ నెంబర్: 011172/GHMC/5496/LBN2/2023-BP) నెంబరుతో బిల్డింగ్ పర్మిట్ పొందారు. అయితే, అనుమతి పత్రంలో చూపిన నిబంధనలను, క్షేత్రస్థాయి కట్టడాన్ని పరిశీలిస్తే ఎక్కడా పొంతన లేకపోవడం గమనార్హం. భవనానికి చుట్టూ వదలాల్సిన కనీస సెట్‌బ్యాక్‌లను పూర్తిగా బేఖాతరు చేస్తూ, రోడ్డును ఆనుకుని భారీ నిర్మాణాన్ని పూర్తి చేశారు.

### చట్టాలు గాల్లోకి.. క్షేత్రస్థాయి పరిశీలన శూన్యం!

రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ జారీ చేసిన జీఓ ఎంఎస్ నెం. 168 (MA), తేదీ: 07-04-2012 ప్రకారం.. నగరంలో నిర్మించే ప్రతి భవనానికి ప్రజా భద్రత, గాలి, వెలుతురు మరియు అత్యవసర సమయాల్లో (అగ్నిప్రమాదాలు వంటివి) రక్షణ చర్యల నిమిత్తం నిర్దేశిత చుట్టుకొలతల్లో ఖాళీ స్థలాన్ని వదలడం తప్పనిసరి. కానీ, ఈ భవన నిర్మాణంలో ఆ నిబంధనలన్నింటినీ తిదకాలిచ్చారు. ఇంతటి ఘోరమైన ఉల్లంఘనలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, మున్సిపల్ అధికారులు మాత్రం కళ్లు మూసుకున్నారు. భవన నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత క్షేత్రస్థాయి పరిశీలన (Physical Inspection) జరిపి, ప్లాన్ ప్రకారం ఉందో లేదో నిర్ధారించుకున్న తర్వాతే ఇవ్వాల్సిన అక్యుపెన్సీ సర్టిఫికేట్‌ను నిబంధనలకు విరుద్ధంగా జారీ చేశారు. 23-10-2025 తేదీన 007268/GHMC/03434/SWOC/LBN2/2025 నెంబరుతో ఈ భవనానికి అక్యుపెన్సీ సర్టిఫికేట్ జారీ కావడం, అధికారుల విధి నిర్వహణలోని అలసత్వాన్ని, అధికార దుర్వినియోగాన్ని స్పష్టం చేస్తోంది.

### సర్టిఫికేట్ రాగానే మరింత బరితెగింపు!

అక్రమ మార్గంలో అక్యుపెన్సీ సర్టిఫికేట్ సంపాదించిన సదరు నిర్మాణదారుడి ఆగడాలు అంతటితో ఆగలేదు. సర్టిఫికేట్ చేతికి రాగానే మున్సిపల్ నిబంధనలను, ఫైర్ సేఫ్టీ రూల్స్‌ను పూర్తిగా పక్కనబెట్టేశారు. ఏకంగా రోడ్డును ఆక్రమించి రెండు భారీ షట్టర్లను చట్టవిరుద్ధంగా నిర్మించారు. ఒకవైపు ప్లాన్ ఉల్లంఘించి ఓసి తీసుకోవడమే అక్రమమైతే.. ఆ తర్వాత ఏకంగా ప్రభుత్వ స్థలాన్ని, రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడం స్థానికులను విస్మయానికి గురిచేస్తోంది.

### అదనపు బాధ్యతల సాకు.. కిందిస్థాయి అధికారుల ఇష్టారాజ్యం!

సరూర్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న ఈ అక్రమాల వెనుక అధికారుల పర్యవేక్షణా లోపం ప్రధాన కారణమనే ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడి ఎ.సి.పి మధు ప్రస్తుతం మూడు చోట్ల (నాగోల్ సర్కిల్, పెద్ద అంబర్‌పేట్ మరియు ఇతర ప్రాంతాల్లో) అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల ఆయన సరూర్‌నగర్ సర్కిల్‌లో వారానికి కేవలం రెండు రోజులు మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. పనిభారం ఎక్కువ కావడంతో, సర్కిల్ పూర్తి బాధ్యతలను కిందిస్థాయి టౌన్ ప్లానింగ్ అధికారిణి (టి.పి.ఎస్) అర్చనకు అప్పగించారు. అయితే ఆమె కూడా ఎల్బీనగర్, సరూర్‌నగర్ రెండు చోట్లా విధులు నిర్వహిస్తున్నారు. ఈ అక్రమ ఓసి జారీ, రోడ్డుపై వెలిసిన అక్రమ షట్టర్ల వ్యవహారాన్ని సర్కిల్ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న టి.పి.ఎస్ అర్చన దృష్టికి బాధితులు, స్థానికులు దాదాపు 10 సార్లకు పైగా లిఖితపూర్వకంగా, మౌఖికంగా తీసుకెళ్లారు. అయినప్పటికీ క్షేత్రస్థాయి పరిశీలన జరిపి చర్యలు తీసుకోవడంలో ఆమె పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ఉల్లంఘనపై పదే పదే ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడం వెనుక అంతర్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### ఏడాది గడిచినా కదలని ఫైల్.. ఉన్నతాధికారుల స్పందన ఏది?

ఈ చట్టవిరుద్ధ అక్యుపెన్సీ సర్టిఫికేట్ జారీ వ్యవహారంపై మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్, ఎల్బీనగర్ జోన్ సరూర్‌నగర్ సర్కిల్-12 అధికారులకు గతేడాది "మే 5, 2025"నే మొదటిసారి వ్రాతపూర్వక ఫిర్యాదు అందింది. ఆ తర్వాత కూడా 19-12-2025 తేదీన ఉన్నతాధికారులతో పాటు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయం మరియు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయాల్లో రసీదు గుర్తింపుతో ఫిర్యాదు ప్రతులను సమర్పించారు. బాధ్యులు ఫిర్యాదు చేసి ఏడాది గడుస్తున్నా మున్సిపల్ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.



### స్థానిక ప్రజల ప్రధాన డిమాండ్లు:

**ఆక్రమణల తొలగింపు:**

ఓసి తక్షణ రద్దు: నిబంధనలను బేఖాతరు చేస్తూ, చట్టవిరుద్ధంగా జారీ చేసిన సదరు అక్యుపెన్సీ సర్టిఫికేట్‌ను (రాజ) వెంటనే రద్దు చేయాలి.

**ఆక్రమణల తొలగింపు:**

మున్సిపల్, ఫైర్ సేఫ్టీ రూల్స్‌కు విరుద్ధంగా రోడ్డును ఆక్రమించి వేసిన రెండు షట్టర్లను తక్షణమే కూల్చివేయాలి.

**విజిలెన్స్ విచారణ:**

క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా అక్యుపెన్సీ సర్టిఫికేట్ జారీకి సహకరించి, ఏడాది కాలంగా ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారిని టి.పి.ఎస్ అర్చన విధి నిర్వహణపై ఉన్నతాధికారులు విజిలెన్స్ విచారణకు ఆదేశించాలి. నగరంలో ఒకవైపు అక్రమ కట్టడాలపై కొరడా ఝులిపిస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తున్న ఉన్నతాధికారులు.. కళ్ల ముందే జరుగుతున్న ఇలాంటి మున్సిపల్ అక్రమాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. మల్కాజ్గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎల్బీనగర్ జోన్ ఎస్.టి.ఎఫ్ విభాగం ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించి, విచారణ జరిపించాలని స్థానిక ప్రజానీకం డిమాండ్ చేస్తోంది.

## రాజీవ్ గాంధీ విగ్రహం తొలగింపు.. వీ హనుమంతరావు ఆందోళన



ఖమ్మంలో అధికారులు దివంగత భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగించారు. ఖమ్మం నగరంలోని కాల్వ ఒడ్డున గల మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని అధికారులు తొలగించడంతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు నిరసన తెలిపారు. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగించడం దారుణమని, తొలగించిన విగ్రహాన్ని వెంటనే అదే స్థానంలో పునఃప్రతిష్ఠించాలని స్థానిక నేతలతో కలిసి వీహెచ్ హనుమంతరావు డిమాండ్ చేశారు. ముగ్గురు మంత్రులు నేతృత్వం వహిస్తున్న ఖమ్మంలో రాజీవ్ గాంధీ విగ్రహం తొలగించడం, ఆ విగ్రహాన్ని తొలగింపునకు వ్యతిరేకంగా సొంత పార్టీ సీనియర్ నేత వీ హనుమంతరావు ఆందోళన చేపట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## పశ్చిమబెంగాల్‌లో మరో టీఎంసీ ఎంపీపై దాడి..!



అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం పశ్చిమబెంగాల్ లో తృణమూల్ కాంగ్రెస్ నేతలపై దాడుల పరంపర కొనసాగుతున్నది. టీఎంసీ నేతలపై వరుస దాడులు జరుగుతుండటం కలకలం రేపుతోంది. పార్టీ అగ్ర నేత, మమతాబెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ పై దాడి జరిగిన మరుసటి రోజే.. అంటే ఆదివారం ఉదయం మరో టీఎంసీ ఎంపీపై దాడి జరిగింది. ఆయన సొంత నియోజకవర్గంలోనే కొందరు ఆయనపై దాడికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. హుగ్లీ జిల్లాలోని చండీతాలలో ఎంపీ కల్యాణ్ బెనర్జీ పర్యటిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. భద్రతా సిబ్బంది జనాన్ని అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే కొందరు ఆయన తలపై కొట్టారు. ఈ అనూహ్య పరిణామంతో ఆయన తల పట్టుకుని కిందపడిపోయారు. ఈ ఘటనతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దాడికి ముందు కొందరు వ్యక్తులు కల్యాణ్ బెనర్జీకి నల్ల జెండాలు చూపిస్తూ 'చోర్ చోర్' (దొంగ దొంగ) అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. శనివారం దక్షిణ 24 పరగణాల జిల్లా సోనార్‌పూర్‌లో అభిషేక్ బెనర్జీ పర్యటనలోనూ ఇలాంటి దృశ్యాలే కనిపించాయి. ఆయన పర్యటనలోనూ ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవగా 'చోర్ చోర్' అంటూ నినాదాలు చేశారు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు కీలక టీఎంసీ నేతలపై ఒకే తరహాలో దాడులు, నిరసనలు జరగడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశం అయ్యింది.

# ఓటు యంత్రాలుగా బడుగులు

## - శ్రమ దోపిడీ, రాజకీయ ప్రాతినిధ్యంపై నిలదీత

**-చారిత్రక రిజర్వేషన్ల నేపథ్యం ఉన్నా నేటికీ అందని సామాజిక న్యాయం**

**-రాజకీయ పెట్టుబడిదారీ వ్యవస్థలో బంధీ అయిన బహుజన ఓటు బ్యాంకు**

**- ఆర్థిక, రాజకీయ సమన్యాయం కోసమే సంకెళ్లను తెంచుకునే చైతన్య పోరాటం.**



హైదరాబాద్: మే 31 భారతశక్తి: భారతదేశంలో రాజ్యాంగం అమలులోకి రావడానికి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆధ్వర్యంలో సామాజిక హక్కుల రూపకల్పన జరగడానికి ముందే బడుగు, బలహీన వర్గాల ప్రాతినిధ్యం కోసం చారిత్రక పోరాటాలు జరిగాయి. కానీ, నేటికీ ఆయా వర్గాలకు ఆశించిన స్థాయిలో సామాజిక, రాజకీయ న్యాయం దక్కకపోవడం సమకాలీన ప్రజాస్వామ్య వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతోంది. దేశంలో, రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన వెనుకబడిన తరగతులు (బీసీలు) నేటికీ శ్రమ దోపిడీకి, రాజకీయ వివక్షకు గురవుతున్నారని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం స్పష్టం చేసింది. హైదరాబాద్‌లో జరిగిన ఒక ముఖ్య సభలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లంపల్లి రామకోటి బడుగుల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, ఈ వ్యవస్థాగత దోపిడీని నిలదీశారు.

### - రిజర్వేషన్ల చారిత్రక, శాస్త్రీయ నేపథ్యం

చారిత్రక ఆధారాలను పరిశీలిస్తే, వెనుకబడిన వర్గాల హక్కుల పోరాటం నిన్న మొన్నటిది కాదు:
– 1882 హంటర్ కమిషన్: మహాత్మా జ్యోతిరావు పూలే బ్రిటీష్ ప్రభుత్వం నియమించిన హంటర్ కమిషన్ ముందు హాజరై, వెనుకబడిన మరియు దళిత వర్గాలకు ఉచిత నిర్బంధ విద్యతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని తొలిసారి డిమాండ్ చేశారు.
– 1902 కొల్హాపూర్ సంస్థానం: ఛత్రపతి సాహూ మహారాజ్ తన సంస్థానంలో బడుగు, బలహీన వర్గాల విద్యా, ఉపాధి అవకాశాల కోసం 50 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేసి సామాజిక విప్లవానికి నాంది పలికారు.

### - మద్రాస్ ప్రెసిడెన్సీ & మిల్లర్ కమిటీ:

దక్షిణాదిలో జస్టిస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమాల ఫలితంగా మద్రాస్ ప్రెసిడెన్సీలో కమ్యూనల్ జీవో (1921) ద్వారా, మైసూర్ సంస్థానంలో మిల్లర్ కమిటీ సిఫార్సుల ద్వారా బీసీలకు విద్య, ఉద్యోగాల్లో చారిత్రక హక్కులు దక్కాయి.
ఇంతటి సుదీర్ఘ పోరాట చరిత్ర ఉన్నప్పటికీ, నేటికీ జనాభా నిష్పత్తికి తగినట్లుగా బీసీలకు అటు సంపదలోనూ, ఇటు అధికారంలోనూ సరైన వాటా దక్కకపోవడం గమనార్హం.

### -శ్రమ ఒకరిది... సంపద మరొకరిది:

"తరతరాలుగా బడుగు వర్గాల శ్రమపైనే సమాజం నడుస్తోంది. కానీ, ఉత్పత్తి రంగాల్లో నిరంతరం శ్రమిస్తున్న బీసీల శ్రమ దోపిడీకి గురవుతోంది. కష్టం బడుగులదైతే, ఆ శ్రమ ద్వారా సృష్టించబడిన సంపద మాత్రం అగ్రవర్ణాల, కార్పొరేట్ శక్తుల చేతుల్లో కేంద్రీకృతమవుతోంది" అని రామకోటి విమర్శించారు. శ్రమకు తగ్గ గుర్తింపు, సంపదలో సమాన వాటా లేనంత కాలం సామాజిక సమానత్వం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు.

### - రాజకీయ బానిసత్వం - ఓటు యంత్రాలు

ఎన్నికల రాజకీయాల్లో బడుగుల పాత్ర కేవలం ఓటర్లుగానే మిగిలిపోతుండటంపై సంక్షేమ సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది:

### - ఓటు వేసే యంత్రాలుగా మార్పు:

బహుజన వర్గాలను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా, రాజకీయ పార్టీల జెండాలు మోసే కూలీలుగానే చూస్తున్నారు తప్ప, వారికి శాసించే స్థాయిని కల్పించడం లేదు.

### - వ్యాపారీకరణ చెందిన రాజకీయం:

ప్రజాస్వామ్యంలో అత్యంత పవిత్రమైన ఓటు హక్కు నేడు వ్యాపారవేత్తల, పెట్టుబడిదారుల గుప్పెట్లోకి వెళ్లిపోయింది. రాజకీయాలు సంపూర్ణంగా వ్యాపారమయంగా మారిపోవడంతో, సామాన్య మరియు వెనుకబడిన వర్గాల అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి లేకుండా పోయింది.
– నేతలు – పెట్టుబడిదారుల లంకె: ప్రజాస్వామ్య వ్యవస్థను శాసించాల్సిన ఓటరును నిర్వీర్యం చేస్తూ, అటు రాజకీయ నాయకులు, ఇటు వ్యాపారవేత్తలు పరస్పర ప్రయోజనాల కోసం కుమ్మక్కై బడుగు వర్గాల గొంతు నొక్కుతున్నారు.

### - సంకెళ్లు తెంచుకుందాం... సమసమాజాన్ని స్థాపిద్దాం

ఈ సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ దోపిడీని అడ్డుకోవడానికి బడుగు, బలహీన వర్గాలంతా చైతన్యవంతులు కావాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం పిలుపునిచ్చింది. బీసీలు కేవలం పాలకులను ఎన్నుకునే వారు మాత్రమే కాదు, పాలకులను శాసించే శక్తులుగా ఎదగాల్సిన అవసరం ఉంది. తరతరాల బానిస సంకెళ్లను తెంచుకుని, రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన కోసం, ఆర్థిక మరియు రాజకీయ సమసమాజ స్థాపన కోసం బీసీలంతా ఐక్యంగా పోరాడాలని రామకోటి పిలుపునిచ్చారు.

# బొల్లారం చెక్‌పోస్ట్ వద్ద నూతన బస్ షెల్టర్, చలివేంద్రం ప్రారంభం

**- రద్దీ నియంత్రణే ధ్యేయం.. ప్రయాణికులకు తప్పిన తిప్పలు:**

**తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు.**




మల్కాజిగిరి, మే 31 భారతశక్తి: మల్కాజిగిరి ప్రయాణికుల వసతులు, రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు తిరుమలగిరి ట్రాఫిక్ విభాగ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) జి. శంకర్ రాజు తెలిపారు. తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొల్లారం తనిఖీ కేంద్రం (చెక్ పోస్ట్) వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బస్ నిరీక్షణ కేంద్రాన్ని (బస్ షెల్టర్) ఆదివారం ఆయన ప్రారంభించారు.

### - తీరిన నిరీక్షణ కష్టాలు.. సులువైన రాకపోకలు

గతంలో బస్సులు ప్రయాణికులను ఎక్కించడానికి, దించడానికి ప్రధాన రహదారిపైనే నిలిచేవి. దీనివల్ల తీవ్ర రద్దీ ఏర్పడి వాహనదారులకు, ప్రజలకు నిత్యం అంతరాయం కలిగేది. మరోవైపు బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు ఎండ తీవ్రతకు, వాతావరణ మార్పులకు గురవుతూ తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొనేవారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో.. ట్రాఫిక్ అధికారుల చొరవ, స్థానిక ప్రజల తోడ్పాటుతో ఇక్కడ నూతన నిరీక్షణ కేంద్రాన్ని నిర్మించారు. ఫలితంగా ఇప్పుడు బస్సులు రహదారికి పక్కగా, సురక్షితంగా నిలిచే వీలు కలగడంతో పాటు ప్రయాణికులకు సౌకర్యవంతమైన వసతి సమకూరింది.

### -దాహార్తిని తీర్చేలా చలివేంద్రం

ప్రస్తుత వేసవి కాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి ఈ నిరీక్షణ కేంద్రం పక్కనే ప్రత్యేకంగా ఒక చలివేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ ప్రజాహిత కార్యక్రమానికి బొల్లారం ప్రాంతానికి చెందిన మురళి యాదవ్, లాల్‌బజార్ ప్రాంతానికి చెందిన బాలరాజు నాయక్ తమ వంతు తోడ్పాటును అందించారు.

### - ప్రజా భాగస్వామ్యంతోనే రహదారి భద్రత

ఈ సందర్భంగా ఏసీపీ శంకర్ రాజు మాట్లాడుతూ.. ప్రజల వసతి, రహదారి భద్రతను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలలో చొరవ చూపిన ట్రాఫిక్ సిబ్బందిని, స్థానికులను అభినందించారు. ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే ఇలాంటి సేవా కార్యక్రమాలు వాహనాల రాకపోకల క్రమశిక్షణను, ప్రజా సంక్షేమాన్ని మరింత పటిష్టం చేస్తాయని ఆయన పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) ఉగేందర్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ) రెడ్డి నాయక్, పోలీస్ కానిస్టేబుల్ రవికాంత్, సంచార అధికారి సాయి, హోంగార్డులు శ్రీనివాస్ రెడ్డి, మహేష్ నాయక్ మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వేములవాడ మున్సిపల్ కౌన్సిల్ చారిత్రాత్మక నిర్ణయంపై కార్మిక లోకం హర్షం

**-203 మంది మున్సిపల్ కార్మికులకు రూ. 5 లక్షల ప్రమాద బీమా, ఈఎస్ఐ సౌకర్యం**

**-ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చైర్మన్ పుల్కం రాజులకు మున్సిపల్ కార్మికుల కృతజ్ఞతలు.. వారికి రుణపడి ఉంటామని భావోద్వేగం**

**-ముప్పై ఏళ్ల శ్రమకు దక్కిన సామాజిక భద్రత: వేములవాడ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్**



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, మే 31: వేములవాడ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల జీవితాల్లో మున్సిపల్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం సరికొత్త వెలుగులు నింపింది. శనివారం జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో 203 మంది మున్సిపల్ కార్మికులకు ఈఎస్ఐ కార్డులతో పాటు రూ. 5 లక్షల ప్రమాద బీమా కల్పించేందుకు పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. కార్మికుల చిరకాల డిమాండ్‌ను పరిష్కరిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు ఆదివారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఘనంగా కృతజ్ఞతా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లకు మరియు కోఆప్షన్ సభ్యులు యూనియన్ నాయకులు, కార్మికులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి గుర్రం అశోక్ మాట్లాడుతూ, నిత్యం ప్రాణాలను పణంగా పెట్టి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే కార్మికుల సామాజిక భద్రతను గుర్తించి, కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ప్రమాద బీమా తీర్మానం ఆమోదించడం అభినందనీయమన్నారు. కార్మికుల ఆవేదనను గుర్తించి ప్రత్యేక చొరవ తీసుకున్న స్థానిక శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజులకు కార్మిక లోకం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. గత ముప్పై ఏళ్లుగా ఎంతో మంది నాయకులను చూసినా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే తమ శ్రమకు అసలైన గుర్తింపు, భద్రత లభించాయని కార్మికులు భావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కార్మికులు భావోద్వేగంతో మాట్లాడుతూ, నిత్యం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే లేచి వేములవాడ పట్టణాన్ని, రాజరాజేశ్వర స్వామి ఆలయ పరిసరాలను తమ సొంత ఇల్లుగా భావించి శుభ్రం చేస్తున్నామని గుర్తుచేసుకున్నారు. మురికి కాలువల్లో చేతులు పెట్టి పనిచేసే తమకు రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు గానీ, అనారోగ్యం పాలైనప్పుడు గానీ కుటుంబాల పరిస్థితి ఏంటనే ఆందోళన నిత్యం వెంటాడేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిన్నటి రోజు కౌన్సిల్ ఏర్పాటు చేసిన రూ. 5 లక్షల ప్రమాద బీమా కేవలం కాగితం ముక్క కాదని, తమ పేద ఇళ్లల్లో వెలిగిన దీపమని కొనియాడారు. భవిష్యత్తులో తమకు ఏ ప్రమాదం జరిగినా తమ పిల్లలు అనాథలు కాకుండా, కుటుంబాలు రోడ్డున పడకుండా కాపాడే పెద్ద దిక్కును పాలకవర్గం ఏర్పాటు చేసిందని హర్షం వ్యక్తం చేశారు. తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, ఒంట్లో ప్రాణం ఉన్నంత వరకు వేములవాడ పట్టణాన్ని మరింత అద్భుతంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దుతామని కార్మికులు స్పష్టం చేశారు. ఈ కృతజ్ఞతా కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు సరిపెల్లి నరేష్, నాయకులు ముంజ రమేష్, బొట్టు శ్రీనివాసు, సావనపల్లి శ్రీనివాసు, పందుల మల్లేశం, డ్రైవర్ల యూనియన్ నాయకులు ముప్పిడి తిరుపతి, ఎడ్ల బాలు, బొడ్డు శ్రీనివాసు, చింతల అనిల్, మహిళా నాయకురాళు గాజుల వజ్రమ్మ, పుప్పాల మమత, పెంట గట్టవ్వ, వావిలాల రాధ, తోట శంకరవ్వ, వావిలాల లక్ష్మితో పాటు వందలాది మంది మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల జీతాల్లో హెల్త్ కార్డు ప్రీమియం కోతలు సమంజసం కావు: తపస్

**- విధివిధానాలు ప్రకటించకుండానే ప్రీమియం వసూలు చేయడం ఏమిటి?**

**- హెల్త్ కార్డులు జారీ చేసిన తర్వాతే ప్రీమియం కోతలు విధించాలి - తపస్ డిమాండ్**



వికారాబాద్ మే 31 భారత శక్తి ఉపాధ్యాయుల జీతభత్యాల నుండి హెల్త్ కార్డు ప్రీమియం పేరుతో కోతలు విధించడం సమంజసం కాదని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్షుడు సంగమేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల బసవరాజ్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో తపస్ సంఘం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల బసవరాజ్ పేర్కొంటూ హెల్త్ కార్డుల అమలుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టమైన విధివిధానాలు ప్రకటించలేదని అన్నారు. హాస్పిటళ్లతో సమావేశాలు నిర్వహించలేదని, ఉపాధ్యాయ సంఘాలకు పూర్తి వివరాలు తెలియజేయలేదని అన్నారు. అలాగే అధికారికంగా హెల్త్ కార్డులు జారీ చేయకుండానే ఉపాధ్యాయుల జీతాల నుంచి ప్రీమియం పేరుతో డబ్బులు కోత విధించడం ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేసే చర్య అన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు వసూలు చేసిన ప్రీమియం మొత్తాన్ని తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు అధికారికంగా జారీ చేసిన తర్వాత, వాటి వినియోగానికి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు విడుదల చేసిన అనంతరం మాత్రమే ప్రీమియం కోతలు విధించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఈ పథకం పట్ల ఆసక్తి లేని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు స్కీం నుంచి మినహాయింపు కల్పించాలని సూచించారు. భార్యాభర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్న సందర్భాల్లో ఒకరి నుంచే ప్రీమియం వసూలు చేసే విధానం అమలు చేయాలని కోరారు. యువతకు కూడా హెల్త్ కార్డు ప్రయోజనాలు అందేలా ప్రస్తుతం ఉన్న వయోపరిమితిని 25 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా అన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఒకే విధమైన ప్రీమియం చెల్లింపు విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం హెల్త్ కార్డు పథకంపై స్పష్టత ఇవ్వాలని, పారదర్శకంగా అమలు చేయాలని తపస్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

# శ్వాస ఆడక విలవిల్లాడిన మూడు రోజుల నవజాత శిశువు..


**- 108 సిబ్బంది సిపిఆర్‌తో ప్రాణరక్షణ**

**- మార్గమధ్యంలో అత్యవసర చికిత్స అందించిన ఈఎంటి శాంత్ కుమార్, పైలట్ అయుబ్ పాషా**

**- తాండూర్ నుంచి నీలోఫర్ ఆసుపత్రికి తరలిస్తుండగా చోటుచేసుకున్న ఘటన**

**- చిన్నారి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందిపై ప్రశంసల వెల్లువ**



వికారాబాద్ మే 31 భారత శక్తి వికారాబాద్ జిల్లా తాండూర్‌లో మానవత్వానికి నిదర్శనంగా నిలిచే ఘటన చోటుచేసుకుంది. శ్వాస సమస్యతో తీవ్ర అస్వస్థతకు గురైన మూడు రోజుల నవజాత శిశువుకు 108 అంబులెన్స్ సిబ్బంది సకాలంలో సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. వివరాలకెళితే..కొడంగల్ నియోజకవర్గంలోని తుంకిమెట్ల గ్రామానికి చెందిన భువనేశ్వరి మూడు రోజుల క్రితం తాండూర్ మాతా శిశు ఆసుపత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే శిశువుకు నిన్నటి నుంచి శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తడంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. దీంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో చిన్నారిని హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో బాబుకు ఒక్కసారిగా శ్వాస ఆడక పరిస్థితి విషమించింది. వెంటనే అప్రమత్తమైన 108 ఈఎంటి శాంత్ కుమార్, పైలట్ అయుబ్ పాషా సమయస్ఫూర్తితో స్పందించి చిన్నారికి సిపిఆర్ నిర్వహించారు. వారి తక్షణ చర్యలతో బాబు తిరిగి శ్వాస తీసుకోవడం ప్రారంభించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. అనంతరం బాబునీ సురక్షితంగా హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించి వైద్యుల పర్యవేక్షణలో చేర్పించారు. తమ బిడ్డ ప్రాణాలను కాపాడిన 108 సిబ్బందికి చిన్నారి తల్లిదండ్రులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో బాబునీ ప్రాణాలను కాపాడిన ఈఎంటి శాంత్ కుమార్, పైలట్ అయుబ్ పాషాలపై ప్రజలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108 సిబ్బంది చూపిన సేవాభావం, సమయస్ఫూర్తి మరోసారి ప్రాణరక్షకులుగా వారి పాత్రను చాటిచెప్పింది.

# శుక్రగ్రహంపై గ్రహాంతరవాసుల జీవం..?

సూర్యమండలంలో కేంద్రమైన భానుడికి దగ్గరగా ఉన్న రెండవ గ్రహం శుక్రుడు. చంద్రుడి తరువాత శుక్రగ్రహం కూడా రాత్రివేళ ఆకాశంలో ప్రకాశవంతంగా వెలుగులు పంచగలుగుతుంది. సూర్యుడి చుట్టు ఒకసారి తిరగడానికి శుక్రగ్రహానికి 224.7 రోజులు పడుతుంది. ఆకారం, ద్రవ్యరాశి, సూర్యుడి నుండి దూరం మరియు సంఘటనలలో శుక్రగ్రహం మరియు భూగ్రహం ఒకేలా ఉన్నందున శుక్రుడిని భూమి 'సోదర గ్రహం (సిస్టర్ ప్లానెట్)' అంటారు. భూగ్రహం కోట్ల జీవులకు నెలవుగా ఉంది. శుక్రగ్రహంపై కూడా జీవుల ఉనికి ఉందనే ఆధారాలను 14 సెప్టెంబర్ 2020 రోజున అంతర్జాతీయ ఖగోళ శాస్త్రవేత్తల జట్టు వ్యక్తం చేసింది. శుక్రగ్రహం వాతావరణంలో ఆసక్తికలించే అరుదైన రసాయన అణువు "ఫాస్ఫీన్" ఉందని గుర్తించారు. సాధారణంగా జీవులు మాత్రమే ఉత్పత్తి చేయగల ఫాస్ఫీన్ ఉండడంతో శుక్రుడిపై 'గ్రహాంతరవాసులు లేదా ఏలియన్స్ లేదా ఎక్స్ట్రా టెరెస్టియల్ జీవులు' ఉండవచ్చనే దిశలో పరిశోధనలు సాగుతున్నాయి. ప్రత్యక్షంగా శుక్రుడిపై జీవి ఉనికి గుర్తించినప్పటికీ, దాని వాతావరణంలోని ఆమ్ల మేఘాల సమీపాన రసాయన ఫాస్ఫీన్ ఉండడం ఆశ్చర్యాన్ని మరియు ఆసక్తిని రేకెత్తిస్తున్నదని పరిశోధకులు అంటున్నారు. భూమిపైన ఫాస్ఫీన్‌ను బ్యాక్టీరియా లేదా అసాధారణ పరిస్థితుల మధ్య పరిశ్రమలు మాత్రమే ఉత్పత్తి చేయగలవు. జీవులు మాత్రమే ఉత్పత్తి చేయగల ఇలాంటి రసాయన అణువులను శుక్రగ్రహ వాతావరణం కలిగి ఉండటమే ప్రాణుల ' జీవ-సంతకం (బయో-సిగ్నేచర్)' వైపుకు మన దృష్టిని ఆకర్షిస్తున్నాయి. శుక్రగ్రహ జీవుల ఉనికి పట్ల లోతైన అన్వేషణ చేస్తున్న అమెరికాలోని యంఐటి మాలిక్యులార్ ఆస్ట్రోఫిజిస్ట్ 'క్లార సౌసా-సిల్వా' అభిప్రాయం ప్రకారం ఫాస్ఫీన్ ఉనికి మరే ఇతర పద్దతిలో తయారుకాదని, ప్రాణులకు మాత్రమే దీనిని ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉంటుందనే వాదన వినిపిస్తున్నారు. శుక్రగ్రహ ఉపరిత వాతావరణంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయని, కాని గ్రహ ఉపరితలానికి 50 కిమీ ఎత్తున ఉన్న పొరలలో సాధారణ ఉష్ణోగ్రతాపీడనాలతో పాటు సల్ఫ్యూరిక్ ఆమ్లం, కార్బన్‌డైఆక్సైడ్ మరియు స్వల్ప నీటి ఆవిరి ఉండడంతో సహ సూర్యరశ్మి తీవ్రత తక్కువగా నమోదవుతుందని తెలుపుతున్నారు.

ఈ వాతావరణ పరిస్థితులలో ప్రాణులు ఉండే సంభావ్యతలను కొట్టిపారేయలేమని నిర్థారణకు వస్తున్నారు. ఇలాంటి పరిశోధనా ఫలితాలు అమెరికా 'నాసా' శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించి మరింత లోతైన పరిశోధనలను చేసే అవకాశం ఉంటుందని అంటున్నారు. రాబోయే రోజుల్లో శుక్రగ్రహం పైకి వెళ్ళగలిగే రోవర్ మిషన్లు కార్యరూపం దాల్చి, అక్కడి సాంపుల్స్ తేగలిగితే ఈ విషయంలో మరింత స్పష్టత రానుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఫాస్ఫీన్ వాయువు విషపూరితమైనదని, రసాయన ఆయుధాల తయారీలో వాడుతారని మనకు తెలుసు. అసాధారణ పరిస్థితులలో మాత్రమే పరిశ్రమలలో తయారు చేయగల దుర్వాసనగల ఫాస్ఫీన్ అణువులో ఫాస్పరస్ పరమాణువుతో మూడు హైడ్రోజన్ పరమాణువుల కలిసి బంధాలు ఏర్పరచుకొని పిరమిడ్ ఆకృతితో ఫాస్ఫీన్ (%ూం%3) ఏర్పడుతుంది. శుక్రుడిపై గ్రహాంతరవాసులు ఉన్నారనే రుజువులు ఖచ్చితంగా లేకపోయినా ఫాస్ఫీన్ వాయు ఉనికి ద్వారా జీవం ఉందనే వాదన బలపడుతోంది. ఈ ఆసక్తికర అంశాన్ని లోతైన పరిశోధనలతో సత్వరమే శుక్రగ్రహంపై జీవ-సంతకం నిర్థారించబడాలని అందరం ఆశిద్దాం.

# చాలా 'పెద్దమ్మ'





మొక్కితే కరుణిస్తుంది. కోరితే వరమిస్తుంది. ప్రదక్షిణ చేస్తే నీడ్కె నిలుస్తుంది. జూబ్లీహిల్స్ పెద్దమ్మ... మనసున్న తల్లి! ఆలయ ఆవరణలో కాలుపెట్టగానే అమ్మ ఒడికి చేరినంత నిశ్చింత! మహిషాసురుడనే రాక్షసుడు ముల్లోకాల్ని పీడించేవాడు. యజ్ఞయాగాదుల్ని నాశనం చేసేవాడు. రుషి పత్నుల్ని చెరబట్టేవాడు. ఇంద్రాదులను తరిమి కొట్టేవాడు. త్రిమూర్తులు కూడా ఆ ధాటికి తట్టుకోలేకపోయారు. 'పాహిమాం' అంటూ శక్తిస్వరూపిణి అయిన అమ్మవారిని ఆశ్రయించారు. మహిషుడేం సామాన్యుడు కాడు. మహా బలవంతుడు. అందులోనూ, వరగర్వంతో విర్రవీగుతున్నాడు. మహాశక్తి ముందు రాక్షసశక్తి చిన్నబోయింది. అంతిమ విజయం అమ్మవారిదే! ఆ సుదీర్ఘ పోరాటంలో అలసి సొలసిన మహాశక్తికి కాస్తంత విశ్రాంతి అవసరమనిపించింది. దుర్గమమైన అడవుల్లో...బండరాళ్ల మధ్య కొద్దిరోజులు సేదతీరింది. అదే...జూబ్లీహిల్స్‌లో ప్రస్తుతం పెద్దమ్మ దేవస్థానమున్న ప్రాంతమని స్థానిక ఐతిహ్యం. 'పెద్దమ్మ' అన్న మాట ఏ పురాణాల్లోనూ కనిపించదు. ఏ స్తోత్రాల్లోనూ వినిపించదు. ముగ్గురమ్మల మూలపుటమ్మే.. కడు పెద్దమ్మ! ఏడు ఎకరాల ఆవరణలో విస్తరించిన ఆధ్యాత్మిక క్షేత్రం...జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి గుడి! హైదరాబాద్ నాలుగు వందల సంవత్సరాల ప్రాచీన నగరం. భాగ్యనగర నిర్మాణానికి చాలా చాలా ముందే ...ఆమాటకొస్తే, వేల సంవత్సరాల క్రితమే జూబ్లీహిల్స్ ఆదిమతెగలకు ఆవాసంగా ఉండేదంటారు. వేటే జీవనంగా బతికే ఆ అమాయకులు తమ కులదేవత పెద్దమ్మ తల్లిని భక్తితో కొలిచేవారు.మంచి జరిగితే, నైవేద్యాలిచ్చి అమ్మ సమక్షంలో సంబరాలు జరుపుకునేవారు. చెడు జరిగితే, జంతు బలులతో తల్లికి శాంతులు జరిపించేవారు. కాలప్రవాహంలో ఆ తెగలు అంతరించిపోయాయి. జూబ్లీహిల్స్ అత్యంత ఖరీదైన ప్రాంతంగా మారింది. కానీ, అలనాటి అమ్మతల్లి ఆనవాళ్లు మాత్రం మిగిలాయి. రెండున్నర దశాబ్దాల క్రితం దాకా.. ఇక్కడో చిన్న ఆలయం ఉండేదట. ఎవరైనా వచ్చి వెలిగిస్తే దీపం వెలిగేది, లేదంటే లేదు. ఆ సమయంలో... రాత్రిళ్లు అమ్మ అడుగుల సవ్వడులు వినిపించేవని స్థానికులు చెబుతారు. భక్తులకు కల్లో కనిపించి ... తనకో ఆలయాన్ని నిర్మించమని ఆదేశించిందట.

**పీజేఆర్ చొరవతో...** కాంగ్రెస్ దివంగత నేత పి.జనార్దన్‌రెడ్డికి అమ్మవారంటే మహా భక్తి. తల్లి ప్రేరణతో ఆయన ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. 1993లో ప్రారంభమైన నిర్మాణం ఏడాదికల్లా పూర్తయింది. హంపీ విరూపాక్ష స్వామి చేతుల మీదుగా ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఐదు అంతస్తుల ఎత్తులో గర్భగుడి, ఏడంతస్తుల్లో రాజగోపురం, గణపతి - లక్ష్మీ - సరస్వతి ఆలయాలు ప్రాణంపోసుకున్నాయి. నిజానికి, ప్రభుత్వం అప్పట్లో ఇక్కడ ఉన్నతాధికారుల నివాస సముదాయాన్ని ఏర్పాటు చేయాలనుకుంది. పీజేఆర్ ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. పట్టుబట్టి .. అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. పెద్దమ్మ దేవస్థానంలో దసరా నవరాత్రులు, శాకంబరి ఉత్సవాలు, ఆషాఢ బోనాలు ఘనంగా నిర్వహిస్తారు. ప్రతి మంగళవారం నాగదోష పూజలు చేస్తారు. మాఘశుద్ధ పంచమి నుంచి సప్తమి వరకు వార్షిక రథోత్సవం కన్నులపండువగా జరుగుతుంది. మంగళ శుక్రవారాల్లో పదిహేనువేల మందీ, పర్వదినాల్లో లక్ష మందీ అమ్మవారిని దర్శించుకుంటారు.

# ధర్మ సూత్రధారీ హే మురారీ



'కృష్ణస్తు భగవాన్ స్వయమ్'... కృష్ణుడే పరమతత్త్వం... చరమ లక్ష్యం... ఆయన గురించి చదవడం, చెప్పడం, పాడడం, వినడం... అన్నీ అపురూపమైన అనుభవాలే. 'నీలో లేని చోద్యాలు ఈ ప్రపంచంలో ఏం ఉంటాయి?' అని అక్రూరుడన్నా... 'అటువైపు కృష్ణుడున్నాడు... ఇటువైపు ఎవరున్నారు' అని సంజయుడు హెచ్చరించినా... అవన్నీ పరమాత్మ విరాట్‌రూపాన్ని విశదీకరించే ఉదాహరణలే... క్రియ, బోధ కలగలిసిన అద్భుత తత్త్వం ఆయనది... యుగావసరాలకు అన్వయించుకోదగ్గ మహాగాథ శ్రీకృష్ణుడిది. భక్తుల కోర్కెలు తీర్చే క్రమంలో భగవంతుడు రెండు రకాల విధానాలను అనుసరిస్తాడు. సర్వం తానే స్వయంగా నిర్వహించి, తనపై మనకున్న నమ్మకాన్ని పెంచుకోవడం మొదటి పద్ధతి. మన ప్రయత్నంలో రహస్యంగా సహకరించి, మనపై మనకు నమ్మకాన్ని పెంచి విజేతలుగా తీర్చిదిద్దడం రెండో పద్ధతి. ఇందులో మొదటి దాన్ని దైవికం అని, రెండోదాన్ని పౌరుషం అని శాస్త్రం నిర్వచించింది. పరమాత్మ ప్రతి అవతారంలో ఏదో ఒకమార్గాన్నే ఎంచుకున్నాడు. కానీ కృష్ణావతారంలో మాత్రం రెండు విధాలుగానూ మనకు ఆయన దర్శనమిస్తాడు. దుష్టశిక్షణ, శిష్ట రక్షణల్లో భాగవతంలోని కృష్ణుడు ఎవరి సహాయాన్నీ కోరలేదు. స్వయంగా తానే అవతార లక్ష్యం దిశగా సాగిపోయాడు. భారతంలోని కృష్ణుడు మాత్రం రెండో పద్ధతి అనుసరించాడు. చేసిందంతా తానే అయినా ఘనతను మాత్రం పూర్తిగా పాండవుల పరం చేశాడు. వారిని విజేతలుగా నిలబెట్టాడు. భాగవత కృష్ణుడు విశేష రసజ్ఞ మనోజ్ఞ మూర్తి. భారత కృష్ణుడు అసాధారణ అలౌకిక ప్రజ్ఞానిధి. కృష్ణ కథలో ఈ రెండూ విభిన్న కోణాలు. ఈ రెండు రకాల పాత్రల స్వభావాలు విభిన్నమైనవి, అదే సయమంలో సర్వసమగ్రమైనవి.

**అదే కృష్ణమాయ!** భాగవత కృష్ణుడి బాల్యచేష్టలు ముగ్ధమోహనాలు. అదే సమయంలో లోకకల్యాణాలు. పసిబాలుడు భయంకర రాక్షస మూకలను మట్టుబెట్టినప్పుడు జనం నివ్వెరపోవడం సహజం. అవతార పురుషుడిగా అనుమానించడం సాధారణం. అలాంటి వారిని చిలిపి చేష్టల ముసుగులో ముంచేసేవాడు. ఇది లోకం దృష్టికి సమ్మోహనకరంగా, అదే సమయంలో లోచూపునకు సంక్లిష్టభరితంగా కనిపించేది. గోపబాలురకు చెలికాడిగా, గోపికలకు వెన్నెల వేలుపుగా ఆటపాటలతో అలరించిన అపూర్వ ఘట్టాలను అనుశీలించేటప్పుడు మనం కూడా వారిలా మారిపోవడాన్నే కృష్ణమాయ అంటారు. రమణీయ రసానుభూతులు పంచడంతో పాటు రాక్షస సంహారం కూడా ఆయన చేశాడు. ఒక పురాణ పురుషుడి సర్వసమగ్ర వ్యక్తిత్వానికి ఇది గొప్ప ఉదాహరణ.

**సుస్థిర పాలన కోసం...** భారత కృష్ణుడు ధీరోదాత్తుడు, రాజనీతిజ్ఞుడు, వ్యూహనిర్మాణ చతురుడు, స్ఫూర్తిప్రదాత, మహానేత. ఆయన అవతరించే సమయానికి లోకంలో పరిస్థితులు విషమంగా ఉన్నాయి. కంస, జరాసంధ, కాలయవన, నరక, శిశు పాల, దుర్యోధనాది స్వార్థ పరుల చేతుల్లో అధికారం, సంపద ఖైదీలయ్యాయి. ఇవన్నీ దుష్టుల చేతుల్లో ఉన్నప్పుడు సామాజిక పరిస్థితులు కూడా దయనీయంగా ఉంటాయి. ధర్మంలేని చోట భద్రత, నీతిలేని చోట మనశ్శాంతి ఉండవు. అలాంటి రాజుల చేతుల్లోనుంచి ప్రజలను రక్షించాలి. సువ్యవస్థను స్థాపించాలి. రాజ్యం చిన్నచిన్న ముక్కలుగా చీలిపోయి ఉంది. అరాచకం, అనైక్యత పెరిగిపోయాయి. ఆ దుస్థితిని, క్లిష్టతను పారదోలేందుకు కేంద్ర రాజ్య వ్యవస్థను ఊహించిన, నిర్దేశించిన అద్భుత రాజనీతిజ్ఞుడు శ్రీ కృష్ణుడు. ధర్మం తప్పిన రాజులందరినీ స్వయంగానో, పాండవుల చేతనో తుదముట్టించాడు. తాను రాజ్యాధికారం కోరుకోకుండా ధార్మిక చింతనాశీలురను పాలకులుగా ఎంచి, రూపొందించి సుపరిపాలనా కేంద్ర వ్యవస్థను నిర్మించాడు. ధర్మజుని నాయకునిగా తీర్చిదిద్దిన నాయక నిర్ణేత శ్రీకృష్ణుడు.

**యుద్ధం కూడా యజ్ఞమే!** భగవద్గీత ఆవిర్భావం కూడా ఈ యుగావసరమే. అడవిలో ముక్కు మూసుకుని కూర్చున్న సర్వసంగపరిత్యాగి తన శిష్యులకు ఏకాంతంగా నూరిపోసిన ధర్మోపదేశం కాదిది.. పద్దెనిమిది అక్షౌహిణల మహాసైన్యం యుద్ధరంగంలో మోహరించి, కయ్యానికి కాలుదువ్వుతున్న ఉత్కంఠ స్థితి. తాత్కాలిక నిర్వేదానికి గురై ధర్మసంకటంలో పడిన మహాయోధుణ్ణి కార్మోన్ముఖుణ్ణి చేసేందుకు ప్రవచించిన ఉపదేశం. ఈ లోకానికంతటికీ వర్తించే ధీరవచనం. గీతాచార్యుడిగా శ్రీకృష్ణుడి వ్యక్తిత్వం శిఖరసమానమైంది. ఆయుధాన్ని పట్టనని ప్రకటించిన శ్రీకృష్ణుడు, భీమార్జునులను ఆయుధాలుగా మలుచుకుని కురుక్షేత్ర మహాసంగ్రామాన్ని సాగించాడు. యుద్ధాన్ని క్రతువు అన్నాడు పరమాత్మ. క్రతువు అంటే యజ్ఞం. 'న మమ' అనుకోవడం యజ్ఞంలో ప్రధానాంశం. 'నాది కాదు' అని ఆ మాటకు అర్థం. ఏం చేసినా, ఏం పొందినా 'న మమ' అనే భావనతో ఉండడం యోగి లక్షణం. అహంకార, మమకారాలను ఆహుతి చేసే మహోన్నత పరిణిత త్యాగశీలతనే కృష్ణుడు కర్మయోగం పేరిట అర్జునుడికి బోధించాడు. అది ఎప్పటికీ, సర్వమానవాళికీ అనుసరణీయం. కృష్ణా! ఓ మాట అడుగుతాను. నిజం చెబుతావా...? మనం ఆపదలో ఉన్నప్పుడు అడగకపోయినా వచ్చి మనకు సాయం చేసేవాడే స్నేహితుడని నువ్వే చెప్పావు కదా. మరి పాండవులు అన్ని కష్టాల్లో కూరుకుపోయినప్పుడు నువ్వేం చేస్తున్నావు? నువ్వు చెబితే ధర్మరాజు జూదం ఆడేవాడు కాదు కదా? లేదా నువ్వే ధర్మరాజు పక్షాన ఆడి అతడిని గెలిపించవచ్చుకదా. మరి నువ్వెందుకు అలా చూస్తుండిపోయావు? అంటూ నేరుగా కృష్ణుడినే అడిగాడు ఉద్ధవుడు. మరొకరైతే కృష్ణుడిని ఈ ప్రశ్న అడగటానికి కూడా ధైర్యం చేసేవారు కాదు. కానీ, ఇక్కడ అడిగినవాడు ఉద్ధవుడు. కృష్ణుడికి పరమ ప్రాణమిత్రుడు. రూపంలో కూడా అచ్చం కృష్ణుడిలాగా ఉండేవాడు. ఎంతటి ప్రాణమిత్రుడంటే నిద్రలో కూడా కృష్ణుడి పేరునే కలవరించేవాడు. అంతటి మిత్రుడు అడిగేసరికి శ్రీకృష్ణుడు కూడా మొహమాటం లేకుండా సమాధానం చెప్పాడు. ఉద్ధవా! విజయం ఎప్పుడూ వివేకవంతుడినే వరిస్తుంది. దుర్యోధనుడు వివేకవంతుడు. అందుకు ఆటలో నైపుణ్యం ఉన్న శకునితో తన ఆట ఆడించాడు. ధర్మరాజు మాత్రం తానే ఆట ఆడాలని అనుకున్నాడు. పైగా నేను అటువైపు రాకూడదని కోరుకున్నాడు. అందుకే అతడు పిలిచేవరకు రాకూడదని నిశ్చయించుకున్నా. పిలిస్తే మాత్రం తప్పకుండా వెళ్లేవాడిని అన్నాడు. అంటే కృష్ణా! తీవ్రమైన ఆపదల్లో కూరుకుపోయి పిలిస్తే గానీ రావా అంటూ మరోప్రశ్న వేశాడు ఉద్ధవుడు. మిత్రమా! జీవితంలో ప్రతిదీ కర్మానుసారమే జరుగుతుంది. నేను పక్కన ఉండి చూస్తుంటాను కానీ కర్మను మార్చలేను అన్నాడు కృష్ణుడు. అదేంటి కృష్ణా! నీ భక్తుల పక్కనే ఉంటూ వారు ఆపదలో ఉంటే చూస్తూ ఊరుకుంటావా? అన్యాయం కదూ అన్నాడు ఉద్ధవుడు. కృష్ణుడు నవ్వుతూ... మిత్రమా! నేను పక్కన ఉన్నాననే భావన ఉంటే అసలు తప్పే చెయ్యరు కదా భక్తులు అన్నాడు. తత్త్వం బోధపడింది ఉద్ధవుడికి. ఇంకా ఎన్నో సందేహాలు అడిగాడు. అన్నిటికీ తృప్తిగా సమాధానాలు చెప్పాడు పరమాత్మ. అవతార పరిసమాప్తి కాలంలో ఉద్ధవుడి పేరు మీద లోకం తన మీద వేసే నిందలు, వేసే ప్రశ్నలన్నింటికీ పరమాత్మ సమాధానం చెప్పాడు. ఈ సమాధానాల సమాహారమే 'ఉద్ధవగీత'గా ప్రసిద్ధిపొందింది.

**ఆ అయిదు భావాలు...** శ్రీకృష్ణుడు లీలామానుష రూపుడు. మానవుడిగా, దైవంగా మార్చిమార్చి తన వైభవాన్ని ప్రదర్శించాడు. శాంత, దాస్య, వాత్సల్య, సఖ్య, మధుర భావాలను భక్తులు భగవంతుడిని చేరుకునే సులభ మార్గాలుగా భావించాలి. వాటిని స్వయంగా శ్రీకృష్ణుడి జీవితంలో కూడా మనం చూడొచ్చు.

**శాంతం:** ఎంత ఉద్రిక్త పరిస్థితుల్లోనైనా నందనందనుడు శాంతంగా వ్యవహరించాడు. శిశుపాలుడు నిండు సభలో అవమానపరిచి అనరాని మాటలు అంటున్నా ప్రతిఘటించలేదు. ఉద్రేకపడలేదు. భీష్మాదులు శిశుపాలుడిని హెచ్చరిస్తున్నా తాను మాత్రం పౌరుషానికి పోలేదు. ఇచ్చిన మాట ప్రకారం నూరు తప్పులను శాంతంగానే కాచాడు.

**దాస్యం:** పెద్దల వద్ద వినయ విధేయతలతో ఉండడమే దాస్యభావం. దేవాదిదేవుడైనా అగ్రజుల వద్ద అణకువగానే మెలిగాడు. గురువు సాందీపుని వద్ద బంటులా పనిచేశాడు. రేపల్లెలో గోవుల కాపరిగా ఆ మూగజీవాలనూ సేవించాడు. అందుకే దాస్యంలో ఆయనను మించిన దివ్యాంశుడు లేరంటారు.

వాత్సల్యం: చిన్న వాళ్లతో ప్రేమగా, ఆదరంగా ఉండడం వాత్సల్యం. ధీరగంభీరుడైన దేవకీపుత్రుడు వాత్సల్యానికి కూడా మారుపేరు. తనను ఆశ్రయించిన వారిని ఆదుకోవడంలో ఆయనను మించిన కరుణామూర్తి మరొకరు కానరారు. ద్రౌపది 'అన్నా! నీవే దిక్కు' అన్నందుకు నిండు సభలో ఆమె గౌరవాన్ని కాపాడాడు. సుయోధనుడు రాజభోగాలను సిద్ధంచేసినా, విదురుని ప్రేమపూర్వక ఆహ్వానాన్నే మన్నించాడు. **సఖ్యం:** సన్నిహితులతో, స్నేహితులతో ప్రేమగా ఉండడం సఖ్యం. సఖ్యభావంతో సన్నిహితుల హృదయాల్లో నిలిచిపోయాడు ఈ హృషీకేశుడు. చిన్ననాటి స్నేహితుడు కుచేలుడు నిరుపేదైనా, సతీ సమేతంగా అతని పాదాలు కడిగి ఆ జలాన్ని తన తలపై చల్లుకు న్నాడు.

ఆయన తెచ్చిన అటుకులనే మధురపదార్థాలుగా స్వీకరి ం చాడు. ఇకఅర్జునుడికిఇష్టసఖుడిగాతుదివరకువెన్నంటి కాపాడాడు.

**మధురభావం:** తనను ఆరాధించే వాళ్లతో అంతే ఆరాధనతో ఏకమైపోవడం మధురభావం. గోపికలను మధురభావంతో ముంచెత్తి వాళ్లను అనేక లీలల్లో ఓలలాడించాడు. వారికి అలౌకికమైన ఆనందాన్ని అందిస్తూనే అంతిమంగా వారికి మోక్షాన్ని ప్రసాదించాడు. మధురభావం పరమాత్మ ఏ ఇతర అవతారంలోనూ కనిపించదు.

# చందన రూపుడు.. సింహాచలేశుడు





దేశంలోని అన్ని నారసింహ క్షేత్రాల్లో విశాఖపట్నం జిల్లాలోని సింహాచలం క్షేత్రం అతి ప్రాచీనమైనది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ విశాఖపట్నం నగరానికి 11 కి.మీల దూరంలో తూర్పు కనుమల్లోని సింహగిరిపై సముద్రమట్టానికి 800 అడుగుల(244మీ)ఎత్తున ప్రశాంత వాతావరణంలో శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయం ఉంది. ఇక్కడ స్వామి స్వయంభువుగా వెలిశారు. సింహాచలం ప్రముఖ హిందూ పుణ్యక్షేత్రంగా ఉంది. విశాఖ పరిసర ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్ర, ఒడిశా ప్రాంత భక్తులంతా సింహాద్రి అప్పన్నగా పిలుచుకునే వరాహ లక్ష్మీనరసింహస్వామి ఇక్కడ కొలువ్కె ఉన్నాడు. నిత్యం చందనంతో కప్పబడి కనిపించే ఈ స్వామి నిజరూప దర్శన సమయాన్ని చందన యాత్ర లేదా చందనోత్సవం అని అంటారు. ఇది ప్రతి సంవత్సరం వ్కెశాఖ శుద్ధ తదియ (మే నెలలో) వస్తుంది.

**ఆలయ చరిత్ర-స్థల పురాణం :** స్వయంభూవ్కెన సింహాచల శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి ఇక్కడ 11వ శతాబ్దంలో ఆలయాన్ని నిర్మించినట్లు స్థలపురాణం బట్టి తెలుస్తోంది. కళింగ శైలిలో నిర్మించిన ఈ ఆలయం అద్భుతమైన శిల్ప కళ, అందమైన గోపురాలతో భక్తులకు కనువిందు చేస్తుంది. ఆలయంలో పలు చారిత్రక సందర్భాల్లో వేసిన శిలా శాసనాలు చారిత్రక పరిశోధకులను ఆకర్షిస్తాయి. సత్యకాలంలో వేదాలు అపహరించిన హిరణ్యాక్షుడిని సంహరించిన వరాహ అవతారం, ఆ తర్వాత యుగంలో హరి ద్వేషంతో.. భక్తులను హింసించిన హిరణ్యకశిపుని వధించిన నృసింహావతారాల కలయికగా.. స్వామి ఇక్కడ వరాహ నృసింహ స్వామిగా స్వయం వ్యక్తమయ్యారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ఇక్కడ రోజూ నాలుగువేదాలు, నాలాయిర దివ్య ప్రబంధాలు, పురాణాలు స్వామి వారి సన్నిధిలో పారాయణ చేస్తారు. ఇది దక్షిణ భారతదేశంలోని ముఖ్యమైన వ్కెష్ణవ పుణ్యక్షేత్రాల్లో ఒకటి. తిరుపతి తర్వాత అత్యధిక ఆదాయం (రూ.52 కోట్లు)కలిగిన దేవాలయమిదే. ఏడాది మొత్తంలో 12 గంటలు మాత్రమే దేవుడి నిజరూప దర్శనం భక్తులకు లభిస్తుంది. శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి వారు ఏడాదిలో 364 రోజులు సుగంధ భరిత చందనంతో కప్పబడి ఉంటారు. భక్తులకు నిత్యం దర్శనం ఇచ్చేది.. ఈ చందన అవతారంలో వుండే స్వామి వారే. ఏటా ఒక్క వ్కెశాఖ శుద్ధ తదియ నాడు మాత్రమే.. అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం వరకూ ఆ నిజరూప దర్శనం ఉంటుంది. స్వామి వారి నుంచి తొలగించిన గంధాన్ని చందన ప్రసాదంగా భక్తులకు అందజేస్తారు. అలాగే గిరి ప్రదక్షిణ కూడా ఇక్కడ ప్రత్యేకంగా జరిగే ఉత్సవం. మిగతా సమయాల్లోనూ ఎంతో రద్దీగా ఉండే సింహాచలం ఆలయం ఈ రెండు సందర్భాల్లో ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బంగా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి తరలివచ్చే లక్షల మంది భక్తులతో మరింత రద్దీగా మారుతుంది. ఈ సందర్భంగా ప్రత్యేక ఆర్జిత సేవలు ఉంటాయి. ఆలయంలో కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకొని కోరికలు కోరుకుంటే అవి తీరుతాయనేది భక్తుల విశ్వాసం.

**ప్రధాన పూజలు :** 1. స్వామి వారి నిత్యకల్యాణం: టిక్కెట్టు ధర రూ.1000, రోజూ జరిగే ఈ సేవలో స్వామివారి పట్టు శేష వస్త్రం, చీర, రవికె, 80 గ్రాముల బరువు ఉండే 6 లడ్డూలు, 2 పులిహోర ప్యాకెట్లు, ఆరుగురికి ఉచిత దర్శనం, అన్నదానంలో ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తారు.

2. స్వర్ణ పుష్పార్చన: టిక్కెట్టు ధర రూ.1116, ప్రతి గురువారం ఉదయం 7 గంటల నుంచి గంటపాటు జరుగుతుంది. పాల్గొన్న వారికి కండువా, రవికె, 2 లడ్డూలు, 2 పులిహోర ప్యాకెట్లు ఉచితంగా అందజేస్తారు.

**ఇతర సేవల ధరలు** సహస్రనామార్చన: రూ.200, అష్టోత్తర శతనామార్చన: రూ.100, లక్ష్మీ అష్టోత్తర శతనామార్చన: రూ.50, గరుడ సేవ: రూ.300, కప్పస్తంభ ఆలింగనం: రూ.25, లక్ష్మీనారాయణ వ్రతం: రూ.50, గోపూజ: రూ.50 గోసంరక్షణ పథకం విరాళం: రూ.1116, పశువుకట్టు: రూ.15, అన్నప్రాశన, అక్షరాభ్యాసం: రూ.50. ద్విచక్రవాహన పూజ: రూ.100, కారు పూజ: రూ.200

కేశఖండన: రూ.10

**టిక్కెట్లు దొరికే స్థలాలు:** అన్ని పూజా టిక్కెట్లు ఆలయంలోని కప్పస్తంభం వద్ద ఇస్తారు. రూ.100 దర్శనం టిక్కెట్లను గాలిగోపురం వద్ద ప్రత్యేక కౌంటర్లో ఇస్తారు. రూ.20 టిక్కెట్లు క్యూలైన్ల మధ్యలోనే ఇస్తారు.

**ప్రసాదాల ధరలు :** లడ్డూ(80గ్రాములు): రూ.5, పులిహోర : రూ.5, చక్కెర పొంగలి: రూ.3, రవ్వ లడ్డూ : రూ.2, దర్శన వేళలు , ఉదయం 6.30 నుంచి 11.30 వరకు సర్వదర్శనం, ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు రాజభోగం సందర్భంగా అరగంట పాటు దర్శనాలు నిలుపుదల చేస్తారు. మధ్యాహ్నం 12 నుంచి 2.30 వరకు సర్వదర్శనం. మధ్యాహ్నం 2.30 నుంచి 3 వరకు పవళింపు సేవ. దర్శనాలు ఉండవు . సాయంత్రం 3 నుంచి రాత్రి 7 వరకు సర్వదర్శనం. రాత్రి 7 నుంచి 8.30 వరకు ఆరాధన. దర్శనాలు లభించవు.

రాత్రి 8.30 నుంచి 9 వరకు సర్వదర్శనం. రాత్రి 9.00 పవళింపు సేవ జరిగి తలుపులు మూసివేస్తారు. మరలా ఉదయం 6.30కి యథావిధిగా దర్శనాలు లభిస్తాయి. దర్శనం టిక్కెట్ల ధరలు,రూ.100 గాలిగోపురం నుంచి అంతరాలయంలోకి ప్రవేశం. రూ.100 అష్టోత్తరం టిక్కెట్టు. అంతరాలయంలో గోత్రనామాలతో పూజ చేస్తారు. రూ.20 సాధారణ క్యూలైన్ల నుంచి ఆలయంలోకి ప్రవేశం.

**రవాణా సౌకర్యం :** సింహాచల క్షేత్రం విశాఖపట్నం ద్వారా నౌకా, రైలు, రోడ్డు, విమాన మార్గాల్లో అనుసంధానమై ఉంది. విశాఖపట్నం విమానాశ్రయం నుంచి కేవలం 11 కి.మీ, విశాఖ ప్రధాన రైల్వే స్టేషన్ నుంచి 11 కి.మీ, విశాఖపట్నం బస్ స్టేషన్ నుంచి 12 కి.మీ దూరంలో ఉంది. సింహాచలానికి 5 కి.మీల దూరంలో గోపాలపట్నం వద్ద సింహాచలం రైల్వే స్టేషన్ కూడా ఉంది. ఆయా ప్రాంతాల నుంచి సింహాచలానికి విస్తృత రవాణా సదుపాయం ఉంది. అన్ని చోట్ల నుంచి నిత్యం పదుల సంఖ్యలో ప్రైవేట్ క్యాబ్‌లు, ఆటోలతో పాటు ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా వుంది. సింహాచలం కొండ దిగువ నుంచి ఎగువకు మాత్రం సింహాచలం దేవస్థానమే ప్రత్యేక వాహనాలను నడుపుతోంది. సొంత వాహనాలు ఉంటే నామమాత్రపు (రూ.10) టోల్ రుసుము చెల్లించి ఆ వాహనాల్లోనే చేరుకోవచ్చు. కొండ పైకి చేరుకునేందుకు దేవస్థానం వారు నాలుగు, ఆర్టీసీ వారు 20 బస్సులు నడుపుతున్నారు. ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుంది. ఇక చందనోత్సవం, గిరి ప్రదక్షిణ, ముక్కోటి ఏకాదశి, బ్రహ్మోత్సవాలు వంటి ప్రత్యేక సందర్భాల్లో ఆర్టీసీ మరిన్ని ప్రత్యేక సర్వీసులు నడుపుతుంది. వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేకంగా స్వామివారి ఆలయ గాలిగోపురం పక్కన లిఫ్టు సౌకర్యం ఏర్పాటు చేశారు.

**వసతి వివరాలు :** కొండపై సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే పలు సత్రాలు ఉన్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చందన టూరిస్టు రెస్ట్ హౌస్, తితిదే సత్రాలు ఉన్నాయి. కొండ కింద పలు ప్రైవేటు వసతి గదులు అందుబాటులో వున్నాయి.

**ఇతర దర్శనీయ స్థలాలు :** ఆండాళ్ సన్నిధి(గోదాదేవి), సింహవల్లీ తాయారు సన్నిధి, లక్ష్మీ నారాయణ సన్నిధి, త్రిపురాంతక స్వామి ఆలయం, కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, శ్రీసీతారామస్వామి ఆలయం, గంగాధర, అడివివరం గ్రామం నుంచి 3 కి.మీల దూరంలో భ్కెరవస్వామి సన్నిధి, కొండ దిగువ న వరాహ పుష్కరిణి, కొండ మెట్ల మార్గంలో ఆంజనేయ స్వామి ఆలయం, కొండపై శ్రీకృష్ణదేవరాయలు వేయించిన విజయ స్థూపం, సింహాచలానికి 8 కి.మీ దూరంలో శ్రీమాధవ స్వామి, వేణుగోపాల స్వామి, మల్లికార్జున స్వామి ఆలయాలు ఇక్కడికొచ్చే పర్యాటకులు, భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి.

**పరిసరాల్లోని దర్శనీయ స్థలాలు :** ఇక ప్రముఖ పర్యాటక ప్రాంతంగా పేరున్న విశాఖపట్నం, భీమిలి బీచ్, తొట్లకొండ బౌద్ధారామం, తదితరాలు ఉన్నాయి. ఇవి కాక, ఆంధ్రా వూటీగా పేరున్న ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, బొర్రా గుహలు, అరకులోయ (సుమారు 100 కి.మీ) వెళ్లడమూ సౌలభ్యంగా ఉండటం సింహాచలం వచ్చే పర్యాటకులకు కలిసొచ్చే అంశాలుగా చెప్పుకోవచ్చు.

# ఖాళీ కడుపుతో

## ఈ రెండు కలిపి తీసుకుంటే..?



ఉదయాన్నే ఖాళీ కడుపుతో పాలలో నానబెట్టిన ఖర్జూరాలను తినడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది శక్తిని అందించడమే కాకుండా రక్తహీనత, జీర్ణ సమస్యలు, శారీరక బలహీనత వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఖర్జూరం, పాలు కలిపిన ఈ మిశ్రమం సహజ ఆరోగ్య డ్రింక్ గా నిలుస్తుంది. రోజును ఆరోగ్యంగా ప్రారంభించాలనుకునే వారు ఖర్జూరాలను పాలలో నానబెట్టి తీసుకోవడం ఒక మంచి పద్ధతి. ఇది శరీరానికి కావాల్సిన శక్తిని ఇవ్వడంతో పాటు.. అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలిగిస్తుంది. ఖర్జూరాలు సహజ చక్కెరలతో పాటు ముఖ్యమైన ఖనిజాలుగా ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, కాల్షియంలను కలిగి ఉండటం వల్ల ఇవి ఆరోగ్యాన్ని బలోపేతం చేయడంలో సహాయపడతాయి. ఐరన్ తక్కువగా ఉండే వారికి ఖర్జూరాలు మంచి సహాయకారి. ఖాళీ కడుపుతో ఖర్జూరాలను తీసుకోవడం వల్ల రక్తహీనతను తగ్గించడానికి ఇది సహాయపడుతుంది. ముఖ్యంగా రక్తహీనతతో బాధపడే మహిళలు దీని వల్ల మంచి ఫలితాలను పొందవచ్చు. పాలతో కలిపి తినడం వల్ల శక్తి మరింతగా పెరుగుతుంది. దీనిలోని ప్రొటీన్లు శరీర కండరాల ఆరోగ్యానికి తోడ్పడతాయి. నానబెట్టిన ఖర్జూరాలు తక్కువ గాఢత ఉన్న చక్కెరలతో పాటు మంచి ఫైబర్ ను కూడా అందిస్తాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో కీలకంగా ఉంటుంది. ఉదయం ఖాళీ కడుపుతో తినడం వల్ల అజీర్ణం, గ్యాస్ వంటి సమస్యలు తగ్గుతాయి. దీనిలో ఉండే కరిగే ఫైబర్ పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఖర్జూరాలలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరంలో హానికరమైన మూలకాలను తొలగించడంలో సహాయపడతాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో వ్యాధుల నుంచి రక్షణ కల్పించడంలో ముఖ్యమైనవి. పాలలో ఉండే ప్రొటీన్లు, కాల్షియం కూడా ఎముకల బలానికి తోడ్పడతాయి. ఈ రెండు కలిసినప్పుడు శక్తిని ఇచ్చే పవర్ కాంబినేషన్ గా మారుతాయి. ఖర్జూరాల్లో సహజ చక్కెరలు ఉన్నా.. మధుమేహం ఉన్నవారు ఎక్కువగా తీసుకోవడం మంచిది కాదు. వీరు తమ రోజువారీ షుగర్ లెవెల్స్ ను గమనిస్తూ పరిమిత మోతాదులో మాత్రమే తీసుకోవాలి. అలాగే పాలతో తీసుకునే ముందు లాక్టోస్ ఇంటోలరెన్స్ ఉన్నవారా అనే విషయం కూడా తెలుసుకోవాలి. ఎందుకంటే కొందరి వ్యక్తులకు పాలు జీర్ణ సమస్యలు కలిగించవచ్చు.

# నిద్రించేటప్పుడు మెడ కింద

## దిండ్లు పెట్టుకునే అలవాటు ఉందా?



శరీరానికి సరైన దిండును ఎంచుకోవడం ముఖ్యం. సరైన దిండు దొరకకపోతే తలకు మద్దతు లభించదు లేదా తల క్రిందికి వంగిపోవచ్చు. దీని వలన మెడ నొప్పి, తల తిరగడం, పై అవయవాలలో నొప్పి, తిమ్మిరి కూడా సంభవించవచ్చు. మంచి నిద్ర ఎవరికి ఉండదు? మనం పడుకోగానే మన శరీరానికి ఓదార్పునివ్వడానికి మెడ కింద ఒక దిండు పెట్టుకుంటాము. చాలా మంది తమ మెడ కింద ఒకటి కంటే ఎక్కువ దిండులు పెట్టుకుంటారు. కానీ ఇలా చేయడం ప్రమాదకరం. నిద్రపోయేటప్పుడు దిండు ఎంత ముఖ్యమో, దానిని ఎలా ఉపయోగించాలో తెలుసుకుందాం. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. శరీరానికి సరైన దిండును ఎంచుకోవడం ముఖ్యం. సరైన దిండు దొరకకపోతే తలకు మద్దతు లభించదు లేదా తల క్రిందికి వంగిపోవచ్చు. దీని వలన మెడ నొప్పి, తల తిరగడం, పై అవయవాలలో నొప్పి, తిమ్మిరి కూడా సంభవించవచ్చు. గర్భాశయ వెన్నెముకను నిటారుగా ఉంచడానికి దిండును ఉపయోగించడం ముఖ్యం. సరిగ్గా సరిపోని లేదా మందమైన దిండ్లు మెడ, వెన్నెముక సమస్యలను కలిగిస్తాయి. అలాగే, దుమ్ము కణాలు, అలెర్జీ కారకాలు లేదా ఫంగస్ కూడా వాటిలో పేరుకుపోవచ్చు. ఇది అలెర్జీలు, ఉబ్బసం లేదా శ్వాసకోశ సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. దీనిని నివారించడానికి శరీరం సహజ ఆకృతి ప్రకారం మెడ, వెన్నెముకకు సరైన మద్దతు ఇచ్చే దిండును ఎంచుకోవడం చాలా ముఖ్యం. మెమరీ ఫోమ్, లేటెక్స్, ఫెదర్ దిండ్లు ప్రసిద్ధ ఎంపికలు. ఇవి వివిధ రకాల శరీర సమస్యలను తీరుస్తాయి. దిండును కొనుగోలు చేసే ముందు దాని సౌకర్యాన్ని పరీక్షించడం చాలా ముఖ్యం తద్వారా అది శరీరానికి అనుకూలంగా ఉందో లేదో నిర్ధారించుకోవాలి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. దిండు లేకుండా నిద్రపోవడం వల్ల వెన్నెముక అమరిక సరిగ్గా ఉంటుంది. అంటే, వెన్నెముక సహజంగా నిటారుగా ఉంటుంది. ఇలా నిద్రపోవడం కడుపు మీద పడుకునే వారికి మంచిది. మెడ కింద మందపాటి దిండు ఉంచినప్పుడు వెన్నెముక ఒత్తిడికి గురవుతుంది. దీనివల్ల మెడ నొప్పితో పాటు ఇతర సమస్యలు కూడా వస్తాయి. అందుకే మీరు దిండు లేకుండా నిద్రపోతే మెడ, వెన్నునొప్పి తగ్గుతుంది. దిండును తొలగించడం వల్ల మెడపై ఒత్తిడి తగ్గుతుంది. ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుంది. దిండు లేకుండా నిద్రపోవడం వల్ల కొన్ని నష్టాలు కూడా ఉన్నాయంటున్నారు నిపుణులు. మీరు మీ శరీరాన్ని వంచి నిద్రపోయి, దిండును ఉపయోగించకపోతే అప్పుడు సమస్య ఉండవచ్చు. మీకు ఒత్తిడి అనిపించవచ్చు. తల వెన్నెముకకు అనుగుణంగా ఉంచడానికి మద్దతు అవసరం. మద్దతు లేకపోవడం వల్ల మెడ, భుజాలలో దృఢత్వం లేదా నొప్పి వస్తుంది. దీని కారణంగా, ఒక వ్యక్తి భుజాలు, మెడలో తీవ్రమైన నొప్పితో మేల్కొనవలసి రావచ్చు.

# హిమాలయాల్లో 18 ఏళ్లుగా అన్నదాన సేవలు


**- లక్షలాది మంది భక్తులకు వసతుల కల్పన**

**- ప్రశంసలు అందుకుంటున్న సిద్ధిపేట కేదార్‌నాథ్ అన్న సేవా సమితి**











**కేదార్‌నాథ్ సేవా సమితి ప్రధాన కార్యదర్శి - అయిత రత్నాకర్**



**కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షులు**



**గోపిశెట్టి శరభయ్య - కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి కోశాధికారి**

సిద్ధిపేట, మే 31( భారత శక్తి ) “అన్నదానం మహాదానం” అనే భావాన్ని ఆచరణలో చూపిస్తూ కేదార్‌నాథ్ యాత్రలో సిద్ధిపేట సేవా స్ఫూర్తి భక్తుల ప్రశంసలు అందుకుంటోంది. 2019లో కేవలం 50 మంది సభ్యులతో ప్రారంభమైన కేదార్‌నాథ్ అన్న సేవా సమితి, నేడు 150 మందికి పైగా సభ్యులతో విస్తరించింది. హిమాలయాల్లోని పరమశివుడి దర్శనం కోసం దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నపానీయాలు, తాగునీరు, విశ్రాంతి సదుపాయాలు కల్పిస్తూ నిరంతర సేవలు అందిస్తోంది. కఠినమైన వాతావరణ పరిస్థితుల్లోనూ సేవాభావంతో ముందుకు సాగుతున్న సమితి సభ్యులు, భక్తులకు అండగా నిలుస్తూ సిద్ధిపేట పేరు దేశవ్యాప్తంగా చాటుతున్నారు. 2019 నుండి నేటికీ విరమంగా సేవలు అందిస్తున్న సిద్ధిపేట అన్న సేవా సమితి కార్యక్రమాలపై భారత శక్తి ప్రత్యేక కథనం.. సిద్ధిపేట నుంచి కేదార్‌నాథ్ క్షేత్రం వరకు సుమారు 1,850 నుంచి 2,000 కిలోమీటర్ల దూరం ఉంటుంది. రైలు, రోడ్డు మార్గాల ద్వారా ముందుగా హరిద్వార్, ఋషికేశ్, రుద్రప్రయాగ్, సోన్‌ప్రయాగ్, గౌరికుండ్ చేరుకుని, అక్కడి నుంచి సుమారు 16 కిలోమీటర్ల కొండ మార్గం నడిచి లేదా గుర్రాలు, డోలీల ద్వారా భక్తులు కేదార్‌నాథ్ ఆలయానికి చేరుకుంటారు. కేదార్‌నాథ్ యాత్రకు దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, బీహార్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో యాత్రికులు తరలివస్తారు. అలాగే నేపాల్ సహా విదేశాల నుంచి కూడా భక్తులు దర్శనానికి వస్తుంటారు. హిమాలయ పర్వత శ్రేణుల్లోని పవిత్ర కేదార్‌నాథ్ ధామంలో తెలంగాణకు చెందిన సిద్ధిపేట వాసులు మరోసారి తమ సేవా స్ఫూర్తిని చాటుతున్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన కేదార్‌నాథ్ క్షేత్రానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఉచిత అన్నదానం, తాగునీరు, టీ, టిఫిన్స్ అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమం 2019 నుంచి నిరంతరంగా కొనసాగుతోంది. యాత్రికుల కోసం అవసరమైన సరుకులతో కూడిన లారీని ఏప్రిల్ 14న సిద్ధిపేట నుంచి పంపగా, మాజీ మంత్రి టి. హరీష్ రావు ప్రారంభించారు. యాత్ర కాలమంతా ఉదయం 4 గంటల నుంచి రాత్రి 1 గంట వరకు భక్తులకు ఉచిత భోజన సదుపాయాలు కల్పిస్తున్నారు. గౌరికుండ్ నుంచి కేదార్‌నాథ్ ఆలయం వరకు సాగే కఠినమైన పర్వత మార్గంలో యాత్రికులకు అండగా నిలుస్తూ సోన్‌ప్రయాగ్ పార్కింగ్ ప్రాంతంతో పాటు ఆలయ సమీపంలో కూడా అన్నదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 100 మందికి పైగా సభ్యులు, దాతల సహకారంతో ఈ సేవలు కొనసాగుతున్నాయి. ఆధ్యాత్మికతకు ప్రతీక కేదార్‌నాథ్ యాత్ర హిమాలయాల మధ్య కొలువై ఉన్న కేదార్‌నాథ్ క్షేత్రం చార్ ధామ్ యాత్రలో అత్యంత పవిత్రమైన స్థలంగా భావిస్తారు. గౌరికుండ్ నుంచి సుమారు 16 కిలోమీటర్ల పర్వత మార్గాన్ని అధిరోహించి భక్తులు ఆలయానికి చేరుకుంటారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు “ఓం నమః శివాయ” నినాదాలతో ఈ మహాయాత్రలో పాల్గొంటారు.

### దాతల సహకారంతో సేవలు

- కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు చికోటి మధుసూదన్

2019లో 50 మంది సభ్యులతో ప్రారంభమైన సేవా కార్యక్రమం ప్రస్తుతం 150 మందికి పైగా సభ్యులతో విస్తరించిందన్నారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులకు ఉచితంగా భోజనం, టిఫిన్స్, స్నాక్స్ అందిస్తున్నామని తెలిపారు.

### దేశవ్యాప్తంగా ఈ సేవాకు మంచి గుర్తింపు

- కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి ప్రధాన కార్యదర్శి అయిత రత్నాకర్

భక్తుల సౌకర్యార్థం సోన్‌ప్రయాగ్‌తో పాటు ఆలయం సమీపంలో కూడా అన్నదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా ఈ సేవా కార్యక్రమానికి మంచి గుర్తింపు లభిస్తోందన్నారు.

### భక్తులకు సేవ చేయడం మా అదృష్టం

- కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితికోశాధికారి గోపిశెట్టి

సిద్ధిపేట నుండి వచ్చి ఇక్కడ భక్తులకు సేవ చేయడం మా అదృష్టంగా భావిస్తున్నాం, కఠినమైన వాతావరణ పరిస్థితుల్లోనూ సభ్యులంతా అంకితభావంతో సేవలు కొనసాగిస్తున్నాం.

# మద్యం మత్తులో స్టీరింగ్ పడితే 10 ఏళ్ల జైలు!

**- మల్కాజ్‌గిరిలో ‘డ్రంక్ అండ్ డ్రైవ్’ తనిఖీలు ఉధృతం.. వారం రోజుల్లో 268 మందిపై కేసులు!**




| S.No | VIOLATION TYPE | No. of Challans Imposed |
|---|---|---|
| 1 | Cell Phone Driving | 1190 |
| 2 | Triple Riding | 2703 |
| 3 | Over Speed | 1696 |
| 4 | Signal Jump | 1781 |
| 5 | Wrong Side Driving | 6751 |
| 6 | Unauthorized Parking's / Obstruction of carriage way | 19246 |

DRUNK & DRIVE CASES

| S.No | Police Station | Booked Cases |
|---|---|---|
| 1 | Alwal Tr PS | 31 |
| 2 | Trimulgherry Tr PS | 33 |
| 3 | Begumpet Tr PS | 21 |
| 4 | Gopalapuram Tr PS | 26 |
| 5 | Malakjgiri Tr PS | 22 |
| 6 | Jawaharnagar Tr PS | 19 |
| 7 | LB Nagar Tr PS | 15 |
| 8 | Vanasthalipuram Tr PS | 46 |
| 9 | Uppal Tr PS | 10 |
| 10 | Kushaiguda Tr PS | 38 |
| 11 | Ghatkesar Tr PS | 7 |
| GRAND TOTAL | | 268 |

మల్కాజ్‌గిరి, మే 31: భారత శక్తి, మద్యం సేవించి వాహనాలు నడిపే బేఫికర్ బాబులపై మల్కాజ్‌గిరి ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. వీకెండ్ మత్తులో రోడ్లపైకి వస్తున్న వారిని ఏరిపారేసేందుకు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. గత వారం రోజుల్లో (మే 24 నుండి మే 30 వరకు) నిర్వహించిన ఈ ప్రత్యేక తనిఖీల్లో ఏకంగా 268 మంది వాహన చోదకులు మద్యం తాగి అడ్డంగా దొరికిపోయారు. పట్టుబడిన వారందరిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

### ద్విచక్ర వాహనదారులే ఎక్కువ!

మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో బైక్‌లు నడిపేవారే అత్యధికంగా ఉన్నారు. పోలీసులు వెల్లడించిన వాహనాల వారీగా కేసుల వివరాలు ఇలా ఉన్నాయి:

-ద్విచక్ర వాహనాలు:232,
-నాలుగు చక్రాల వాహనాలు (కార్లు): 29,
-మూడు చక్రాల వాహనాలు (ఆటోలు): 06,
-భారీ వాహనాలు:01,
- మొత్తం కేసులు: 268,

### రక్తంలో ఆల్కహాల్ మోతాదు.. నిందితుల వివరాలు:

పట్టుబడిన వారి రక్తంలో ఆల్కహాల్ శాతాన్ని (బి.ఎ.సి) పరీక్షించగా దిగ్భ్రాంతికర విషయాలు వెలుగుచూశాయి. కొందరైతే పరిమితికి మించి విపరీతంగా తాగి రోడ్లపైకి వచ్చినట్లు తేలింది.

- 36 మి.గ్రా నుంచి 200 మి.గ్రా లోపు ఆల్కహాల్ మోతాదు ఉన్నవారు: 250 మంది,
201 మి.గ్రా నుంచి 300 మి.గ్రా లోపు ఆల్కహాల్ మోతాదు ఉన్నవారు:12 మంది
- 300 మి.గ్రా కంటే ఎక్కువ ఆల్కహాల్ మోతాదు ఉన్న ప్రమాదకర చోదకులు:06 మంది.

### - ప్రమాదం జరిగితే ‘హత్య కాని నేరపూరిత నరహత్య’ కింద కేసు!

మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రాణాంతక ప్రమాదాలకు కారణమైతే ఇకపై సాధారణ కేసులు ఉండవని పోలీసులు హెచ్చరించారు. అటువంటి వారిపై “భారతీయ న్యాయ సంహిత (బి.ఎన్.ఎస్)-2023 లోని సెక్షన్ 105” ప్రకారం ‘హత్య కాని నేరపూరిత నరహత్య’ కింద నాన్-బైలబుల్ కేసు నమోదు చేయనున్నారు.

ఈ చట్టం కింద నేరం నిరూపితమైతే గరిష్టంగా 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు భారీ జరిమానా,కూడా విధిస్తారని మల్కాజ్‌గిరి ట్రాఫిక్ విభాగం స్పష్టం చేసింది.

### - కోర్టుకు నిందితులు.. గత వారం 142 మందికి జరిమానా

తాజాగా పట్టుబడిన 268 మంది నిందితులను త్వరలోనే న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. కాగా, గత వారం రోజుల్లో కోర్టులో 142 మద్యం తాగి నడిపిన కేసులు విచారణకు రాగా, ఆ 142 మంది నిందితులకు న్యాయస్థానం జరిమానా విధించిందని ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డిసిపి) ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాణాలతో చెలగాటమాడే ఇలాంటి డ్రైవింగ్ సంస్కృతిపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు.

# హిరోషిమా, నాగాసాకి అణుబాంబు నేలను తాకినప్పుడు ఏం జరిగింది.?

1945 సంవత్సరం వస్తూ వస్తూనే జపాన్‌లో సామాన్యుల జీవితాలను నరకప్రాయం చేసింది. షాపుల్లో గుడ్లు, పాలు, టీ, కాఫీలు పూర్తిగా మాయమయ్యాయి. పాఠశాలల మైదానాల్లో, ఇంటి ఆవరణల్లో కూరగాయలు పెంచుకుని వాటినే తినేవారు. పెట్రోల్ సామాన్యులకు అందనంత ఖరీదైన వస్తువుగా మారిపోయింది. రోడ్లపై ఎక్కడా సొంత కార్లు పరుగులు తీస్తూ కనిపించేవి కావు. హిరోషిమా రహదారుల్లో ఎక్కడచూసినా సైకిళ్లలో, కాలినడకన వెళ్లే జనం, సైనికుల వాహనాలే కనిపించేవి. 1945 ఆగస్ట్ 6.. ఉదయం 7 గంటలకు దక్షిణం వైపు నుంచి వస్తున్న అమెరికా విమానాలను రాడార్లు పసిగట్టాయి. చెవులు చిల్లులు పడేలా హెచ్చరిక సైరన్ మోగింది. జపాన్ అంతటా రేడియో కార్యక్రమాలను నిలిపివేశారు. జపాన్‌లో అప్పటికే పెట్రోల్ నిల్వలు నిండుకున్నాయి. దాంతో ఆ విమానాలను అడ్డుకోడానికి జపాన్ తమ విమానాలను పంపించలేకపోయింది. 8 గంటలకు హెచ్చరిక సైరన్ ఆగింది. రేడియో కార్యక్రమాలు మళ్లీ మొదలయ్యాయి. 8 గంటల 9 నిమిషాలకు అమెరికా వైమానిక దళం కల్నల్ పాల్ టిబెట్స్ తన బీ-29 విమానం 'ఎనోలా గే' ఇంటర్ కమ్‌లో ఒక ప్రకటన చేశారు. 'మీ గాగుల్స్ తీసుకోండి, వాటిని మీ నుదుటిపై పెట్టుకోండి' అన్నాడు.

## కౌంట్ డౌన్ మొదలవగానే




'కౌంట్ డౌన్ మొదలవగానే, వాటిని మీ కళ్లకు పెట్టుకోండి. మీకు కింద భారీ వెలుగు కనిపించకుండా పోయేవరకూ వాటిని అలాగే ఉంచుకోండి'. విమానం పొట్టలో 3.5 మీటర్ల పొడవు, 4 టన్నుల బరువుతో బ్లూ-వైట్ రంగులతో ఉన్న 'లిటిల్ బాయ్' బాంబు ఉంది. దానిని టాప్ సీక్రెట్ మన్‌హాటన్ ప్రాజెక్ట్ కింద లాస్ అలామోస్, న్యూ మెక్సికోలో ఉన్న ప్రయోగశాలల్లో తయారు చేశారు. దాని తయారీని చాలా రహస్యంగా ఉంచారు. ఎంత రహస్యంగా అంటే, అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ మరణించాక, ఉపాధ్యక్షుడు హారీ ట్రూమెన్ కొత్త అధ్యక్షుడి బాధ్యతలు తీసుకునే వరకూ ఆయనకు కూడా దాని గురించి తెలీదు. 'ఎనోలా గే' కుడి రెక్క నుంచి పది మీటర్ల దూరంలో ఒక కిలోమీటర్ వెనుక 'గెట్ ఆర్టిస్ట్' అనే ఇంకో బీ-29 విమానం ఎగురుతోంది. అక్కడ మూడో బాంబర్ కూడా వెళ్తోంది. దానిని జార్జ్ మార్క్‌వర్డ్ నడుపుతున్నారు. ఆయనకు ఫొటోలు తీసే బాధ్యత మాత్రమే అప్పగించారు. సరిగ్గా 8 గంటల 13 నిమిషాలకు 'ఎనోలా గే, బాంబార్డియర్ మేజర్ టామ్స్ ఫ్రేబీకి హెడ్ ఫోన్లో 'ఇటీజ్ ఆల్ యువర్స్' అని కల్నల్ పాల్ టిబెట్స్ సందేశం వినిపించింది.. తర్వాత ఆయన ఇంటర్‌కామ్‌లో 'మీ గాగుల్స్ పెట్టుకోండి' అన్నాడు. ఫ్రేబీకి తన గాగుల్స్ నుంచి టార్గెట్ ఏఓఐ బ్రిడ్జ్ కనిపించగానే, 'ఐ హావ్ గాటిట్' అని అరిచాడు.

## హిరోషిమాపై పడిన లిటిల్ బాయ్



సరిగ్గా 8 గంటల 15 నిమిషాలకు 'ఎనోలా గే' నుంచి బయటకు వచ్చిన లిటిల్ బాయ్ హిరోషిమా మీద పడడం మొదలైంది.. 'ఎనోలా గే' నుంచి లిటిల్ బాయ్ కిందకు రావడానికి 43 సెకన్లు పట్టింది. గాలులు వేగంగా వీస్తుండడంతో అది తన లక్ష్యం ఏఓఐ బ్రిడ్జికి 250 మీటర్ల దూరంలో ఉన్న షీమా సర్జికల్ క్లినిక్ పైన పడింది. అది పేలినపుడు ఆ శక్తి 12,500 టన్నుల టీఎంటీతో సమానంగా ఉంది. ఆ ఉష్ణోగ్రత హఠాత్తుగా 10 లక్షల సెంటీగ్రేడ్‌కు చేరింది. 'ద గ్రేట్ ఆర్టిస్ట్'లో ఉన్న పైలెట్ మేజర్ చార్లెస్ స్వీనీ పైనుంచి చూసినపుడు విశాలంగా ఉన్న ఒక అగ్నిగోళం ఏర్పడడం కనిపించింది. ఒకే ఒక్క క్షణంలో నగరంలోని కాంక్రీట్ భవనాలు తప్ప భూమిపై వస్తువులన్నీ మాయమైపోయాయి. విస్ఫోటనం తీవ్రతతో గ్రౌండ్ జీరో నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న అన్ని భవనాల కిటికీ అద్దాలూ ముక్కలైపోయాయి.

## ఆటం బాంబ్ వేసిన విమానం ఏమైంది?



హిరోషిమా నగరంలో రెండు వంతుల భవనాలు ఒక్క క్షణంలోనే ధ్వంసమయ్యాయి. కొన్ని కిలోమీటర్ల వరకూ మంటలు తుఫానులా వ్యాపించాయి. ఒక్క క్షణంలోనే నగరంలోని రెండున్నర లక్షల జనాభాలో 30 శాతం మంది అంటే 80 వేల మందిని మృత్యువు బలి తీసుకుంది. విస్ఫోటనం జరగగానే 'ఎనోలా గే' ముందు కేబిన్లోకి కూడా ఆ వెలుగు వ్యాపించింది. పైలెట్ పాల్ టిబెట్స్‌కు తన పళ్లు వణికినట్టు వింతగా అనిపించింది. విమానం వెనుక భాగంలో కూచున్న టెయిల్ గన్నర్ బాబ్ కేరన్, తన కొడాక్ కెమెరా తీశాడు. కింద కనిపిస్తున్న దృశ్యాలను ఫొటోలు తీయడం మొదలుపెట్టాడు. కింద ఎర్రటి మేఘాల మధ్య తెల్లటి పొగ 3 వేల అడుగుల వరకూ పైకి ఎగిసింది. అది ఒక పుట్టగొడుగు ఆకారంలో కనిపించింది. 'ఎనోలా గే' కో పైలెట్ కెప్టెన్ రాబర్ట్ లూయిస్ తన లాగ్ బుక్‌లో 'మై గాడ్ వాట్ హావ్ వియ్ డన్?' అని రాశాడు. 'ఎనోలా గే' వెపనియర్ విలియమ్ పార్సన్స్ 'ప్రయోగం విజయవంతమైంది, విమానంలో పరిస్థితి మామూలుగా ఉంది' అని ఒక కోడ్ సందేశం పంపించాడు.

## ఆటం బాంబ్ వేసిన విమానం ఏమైంది.?



హిరోషిమా నగరంలో రెండు వంతుల భవనాలు ఒక్క క్షణంలోనే ధ్వంసమయ్యాయి. కొన్ని కిలోమీటర్ల వరకూ మంటలు తుఫానులా వ్యాపించాయి. ఒక్క క్షణంలోనే నగరంలోని రెండున్నర లక్షల జనాభాలో 30 శాతం మంది అంటే 80 వేల మందిని మృత్యువు బలి తీసుకుంది. విస్ఫోటనం జరగగానే 'ఎనోలా గే' ముందు కేబిన్లోకి కూడా ఆ వెలుగు వ్యాపించింది. పైలెట్ పాల్ టిబెట్స్‌కు తన పళ్లు వణికినట్టు వింతగా అనిపించింది. విమానం వెనుక భాగంలో కూచున్న టెయిల్ గన్నర్



బాబ్ కేరన్, తన కొడాక్ కెమెరా తీశాడు. కింద కనిపిస్తున్న దృశ్యాలను ఫొటోలు తీయడం మొదలుపెట్టాడు. కింద ఎర్రటి మేఘాల మధ్య తెల్లటి పొగ 3 వేల అడుగుల వరకూ పైకి ఎగిసింది. అది ఒక పుట్టగొడుగు ఆకారంలో కనిపించింది. 'ఎనోలా గే' కో పైలెట్ కెప్టెన్ రాబర్ట్ లూయిస్ తన లాగ్ బుక్‌లో 'మై గాడ్ వాట్ హావ్ వియ్ డన్?' అని రాశాడు. 'ఎనోలా గే' వెపనియర్ విలియమ్ పార్సన్స్ 'ప్రయోగం విజయవంతమైంది, విమానంలో పరిస్థితి మామూలుగా ఉంది' అని ఒక కోడ్ సందేశం పంపించాడు.

## బాంబు నేలను తాకినప్పుడు ఏం జరిగింది.?


జపాన్ నౌకా దళం డ్రాఫ్ట్‌మెన్ సుతోమూ యామాగూచీ దృష్టి పైన ఎగిరే విమానంపై పడింది.




విమానం నుంచి ఒక చిన్న నల్లటి వస్తువు కింద పడుతుండడం కనిపించింది. తర్వాత క్షణంలోనే అతడికి కళ్ల ముందు చూపు పోయేంత వెలుగు వచ్చింది. అతడి అవయవాలన్నీ పనిచేయడం మానేశాయి. దాంతో చేతులతో కళ్లు మూసుకున్న అతడు నేలపై బోర్లా పడిపోయాడు. కింద భూమి కంపించడంతో యామాగూచీ సుమారు అర మీటరు ఎత్తుకు ఎగిరిపడ్డాడు. తను తిరిగి కళ్లు తెరిచినప్పుడు చుట్టూ అంధకారం అలుముకుని ఉంది. హఠాత్తుగా అతడికి తన ఎడమ వైపున, ఎడమ చేతి దగ్గర భరించలేనంత వేడిగా అనిపించింది. వాంతి చేసుకోవాలనిపిస్తోంది. కళ్లు తిరుగుతున్నాయి. స్పృహ తప్పుతోంది. అప్పుడే అతడికి కొంత దూరంలో ఒక చెట్టు కనిపించింది. దాని ఆకులన్నీ పూర్తిగా రాలిపోయి ఉన్నాయి. ఆ చెట్టు వరకూ వెళ్లడానికి అతడు తన బలమంతా ఉపయోగించాడు. ఎలాగోలా అక్కడికి చేరుకుని దాని మొదలు దగ్గర కూచున్నాడు. అప్పటికే అతడి గొంతు పూర్తిగా ఎండిపోయింది. దాహంతో తపించి పోతున్నాడు.

## బతికి బయటపడినా

హిరోషిమా తూర్పు ప్రాంతంలో ఒక రైలు నగరం వైపు వస్తోంది. సైనికులు హఠాత్తుగా వెళ్తున్న ఆ



రైలును ఆపేశారు. లోపల ఉన్న వాళ్లందర్నీ కిందకు దించేసి వెళ్లిపొమ్మన్నారు. డబ్బాలను ఇంజన్ నుంచి వేరు చేసి, అక్కడే ఆపేశారు. కానీ ఇంజన్ మాత్రం ముందుకెళ్లిపోయింది. కానీ అది ఎంతో దూరం వెళ్లలేకపోయింది. ఎందుకంటే కాలినడకన వెళ్లే వారితో ఆ రైల్వే లైన్ అంతా నిండిపోయి ఉంది. వారిలో కొంతమంది ముఖం నుంచి చర్మం ఊడిపోయింది. కొంతమంది చేతులు విరిగిపోయి శరీరానికి వేలాడుతున్నాయి. కొంతమంది చాలా నెమ్మదిగా నడుస్తున్నారు. వాళ్లందరి నోటి నుంచి ఒకే మాట వస్తోంది. 'నీళ్లు.. నీళ్లు కావాలి.'


## నేను చనిపోతానా.?

అణుబాంబు విస్ఫోటనంతో ఏర్పడిన మేఘాల వల్ల సుమారు 11 గంటలకు హిరోషిమాలో భారీ వర్షం కురవడం మొదలైంది. ఆ వర్షం నల్లగా పడుతోంది. దానిలో దుమ్ము, ధూళి, విస్ఫోటనంతో ఉత్పన్నమైన రేడియో ధార్మిక లక్షణాలు ఉన్నాయి. నిజానికి, ఆ వర్షం చిక్కగా ఉన్న నల్లటి రంగులా ఉంది. గ్రీజులా ఉన్న ఆ వర్షంతో గోడలపై, బట్టలపై మరకలు పడ్డాయి. అక్కడ ఆకులు లేని చెట్టు కింద కూచున్న యామాగూచీ మాత్రం రేడియో యాక్టివ్ వర్షంలో తడవకుండా ఉండగలిగాడు. కాస్త దూరంలోనే ఒక గుంత కనిపించిండంతో అక్కడికి పాక్కుంటూ వెళ్లాడు. అక్కడ ఒక మహిళ ఉంది. ఆమె బట్టలన్నీ కాలిపోయాయి. చర్మం కూడా కమిలి ఎర్రగా అయిపోయింది. ఆమె లేవాలని ప్రయత్నించింది. కానీ పడిపోయింది. లేవలేని స్థితిలో 'సాయం చేయండి, సాయం చేయండి' అంటోంది. యామాగూచీని చూడగానే గొంతు తెచ్చుకున్న ఆమె 'నేను చనిపోబోతున్నానా' అని అడిగింది. అప్పుడే అక్కడకు ఇద్దరు విద్యార్థులు వచ్చారు. వాళ్లకేం కాలేదు. వాళ్లు యామాగూచీతో 'మీరు బాగా కాలిపోయినట్టు కనిపిస్తున్నారు' అన్నారు. యామాగూచీ తన ముఖాన్ని మెల్లగా తడుముకున్నాడు. చర్మం ఊడి చేతికి వస్తున్నట్టు అనిపిస్తోంది. నల్లగా అయిపోయిన తన చేతులు అంతకంతకూ వాచిపోతున్నాయి. ఆ విద్యార్థులు యామాగూచీని తీసుకుని క్లినిక్ చేరారు. అక్కడ కాలిపోయిన శవాలు ఉన్నాయి. కొంతమంది చేతులు కాస్త కదులుతున్నాయి. కానీ ఎక్కువ మంది శరీరాలు ఎలాంటి చలనం లేకుండా ఉన్నాయి. అక్కడ ఒక కంపౌండర్ యామాగూచీ ముఖంపై తెల్లటి క్రీమ్ రాశాడు. చేతికి కట్టు కట్టాడు. అక్కడ రెండు బిస్కెట్లు, కొన్ని నీళ్లు ఇచ్చారు. బిస్కెట్ కొరకగానే అతడు వాంతి చేసుకున్నాడు.



## హిరోషిమా విధ్వంసం చూసిన మొదటి విలేఖరి

స్థానిక విలేకరి 37 ఏళ్ల సాతోషీ నాకామురా ఆరోజు హిరోషిమాకు కాస్త దూరంలో ఉన్న తన స్నేహితుడి ఇంటికి వెళ్లడం వల్ల ప్రమాదం తప్పించుకున్నారు. హిరోషిమాపై అణుబాంబు పడినప్పుడు, ఆ ప్రభావంతో ఆయన నేలమీద పడ్డారు. తన ముఖానికి పగిలిన అద్దాలు గుచ్చుకున్నాయి. తర్వాత నాకామురా తన సైకిల్ తీసుకుని హిరోషిమా వైపు బయల్దేరారు. నాకామురా హిరోషిమా విధ్వంసాన్ని చూసిన తొలి విలేకరి అయ్యారు. ఆయన డోమీ వార్తా ఏజెన్సీకి ఒకాయామా ఆఫీసు నుంచి మొదటి వార్త డిక్టేట్ చేశారు. '8 గంటల 16 నిమిషాలకు శత్రువులు రెండు విమానాల్లో హిరోషిమాపై ఒక ప్రత్యేక బాంబు వేశారు. హిరోషిమా మొత్తం నాశనం అయిపోయింది. సుమారు లక్షా 70 వేల మంది చనిపోయారు' అని చెప్పారు. ఈ వార్త విన్న డోమీ బ్యూరో చీఫ్, నాకామురాతో అది నిజం కాదేమో అన్నారు. ఒక్క బాంబు వల్ల హిరోషిమాలో అంత మంది చనిపోతారా? నీ రిపోర్టులో మృతుల సంఖ్య మార్చాలని చెప్పారు. ఎందుకంటే సైన్యం దాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేదు. దాంతో కోపం వచ్చిన నాకమూరా టెలిఫోన్లోనే 'సైనికులు



మూరు?లు' అని గట్టిగా అరిచాడు.

## మూడు రోజుల తర్వాత నాగసాకి మీద పడిన 'ఫ్యాట్ మ్యాన్'

1945 ఆగస్టు 9 మధ్యాహ్నం. జపాన్‌లోని మరో నగరం నాగసాకిలో బీ-29 బాంబర్లు రెండో ఆటం బాంబు జారవిడిచాయి. అది కిందకు చేరడానికి 43 సెకన్లు పట్టింది. బాంబు విస్ఫోటనంతో కిలోమీటర్ పరిధిలో ప్రతి వస్తువూ ధ్వంసమైపోయింది. ఉష్ణ కిరణాలు మనుషుల శరీరంలోని ప్రతి నీటిబొట్టునూ ఆవిరి చేశాయి. క్షణంలోనే చాలా మంది చనిపోయారు, జంతువులు మాడిపోయాయి. పేలుడు తీవ్రతకు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇళ్ల అద్దాలు కూడా ముక్కలైపోయాయి. విస్ఫోటనంతో ఎగసిన వెలుగు కొన్ని సెకన్లే ఉన్నా, దానివల్ల ఏర్పడిన వేడి చర్మంపై థర్డ్ డిగ్రీ బర్న్స్ వచ్చేలా కాల్చేసింది. బాంబు పడిన ప్రాంతానికి 500 మీటర్ల దూరంలో షిరోయామా ప్రైమరీ స్కూల్లో కాంక్రీట్ స్తంభాలు తప్ప వేరే ఏం మిగల్లేదు. అక్కడే నిలబడ్డ చియోకో ఇగాషిరా భయంకరమైన పేలుడు శబ్దాన్ని విన్నాడు. అప్పుడు తన వీపు నుంచి కొంత భాగం ఎగిరిపోయినట్టు అతడికి అనిపించింది. ఇగాషిరా వెంటనే కూతురికి తన శరీరాన్ని అడ్డుపెట్టి కవర్ చేశాడు. ఆ సమయంలో ఆమె తలపై వెంట్రుకలన్నీ నిక్కబొడుచుకున్నాయి. కనుబొమల్లో ఒక్క వెంట్రుక కూడా మిగల్లేదు. ఇగాషిరా సాయం కోసం అరవాలని ప్రయత్నించాడు. కానీ తన నోటి నుంచి మాట



రాలేదు.

## క్షణంలో నాగాసాకి నేలమట్టం

బాంబు పడిన కేంద్రానికి కిలోమీటర్ పరిధిలో ప్రతి వస్తువూ వేడికి ఆవిరైపోయింది. అన్నీ కాలి బూడిదైపోయాయి. మైక్రో సెకను లోపలే నాగాసాకీ జైలులోని మూడు భవనాలు నేలమట్టం అయ్యాయి. జైల్లో ఉన్న ఒక్కరు కూడా బతకలేదు. రూట్ నంబర్ 206లో కరెంటుతో నడిచే ట్రామ్ నామరూపాలు లేకుండా పోయింది. నాగసాకీ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో డాక్టర్ తకాషీ నగాయీ తన తరగతిలో ప్రాక్టీస్ చేయించడం కోసం కొన్ని ఎక్స్ రే ఫిల్ములు వెతుకుతున్నారు. అప్పుడే అతడికి చూపు పోగొట్టేంత వెలుగు కనిపించింది. ఆ పేలుడు తీవ్రతతో కిటికీ అద్దాలు పగిలి గది లోపలికొచ్చి పడ్డాయి. ఆ కిటికీల నుంచి గాలి వేగంగా లోపలికొచ్చింది. డాక్టర్ తకాషీ గాల్లో ఎగిరి పడ్డారు. ఆయన ముఖంపై కుడివైపు కోసుకుపోయింది. ముఖమంతా వేడిగా ఉన్న రక్తం కారుతోంది. అంతగా గాయపడ్డా తనకు ఎలాంటి నొప్పి లేకపోవడం ఆయనకు ఆశ్చర్యం కలిగించింది.

## ఒకటిన్నర కిలోమీటర్ దూరం వరకూ



ఆస్పత్రి బయట ఏ వస్తువూ గుర్తించేలా లేదు. అక్కడే ఉన్న సునియో తోమీతా కింద పడిన తన స్నేహితుడు కామోతోను తన భుజాలపై ఎత్తుకోడానికి ప్రయత్నించాడు. కానీ అతడి చేతులకు స్నేహితుడి మాంసం మాత్రమే వచ్చింది. కామోతో మళ్లీ కింద పడిపోయాడు. చనిపోతున్న వారికి, చనిపోయిన వారికి నోటి నుంచి రక్తం వచ్చింది. తోమీతా వాళ్ల మధ్యకు వెళ్లి నీళ్లు అందించాడు. వారికి ఏం కాదని చెప్పే ప్రయత్నం చేశాడు. కానీ కాసేపటికి అతడు, ప్రొఫెసర్ సికీ మాత్రమే ప్రాణాలతో మిగిలారు. ఆయన చుట్టూ సుమారు 20 శవాలు పడున్నాయి. ఎక్కడ చూసినా మంటలు చెలరేగుతున్నాయి. విస్ఫోటనం జరిగిన స్థలం నుంచి సుమారు ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉన్న ఒక టార్పెడో ఫ్యాక్టరీలో మిత్సుయీ తకీనో కూడా స్పృహతప్పి నేలపై పడిపోయింది. ఆమెకు స్పృహ వచ్చినపుడు చుట్టూ జనాల అరుపులు, కేకలు వినిపిస్తున్నాయి. ఆమె పైనంతా శిథిలాలు పడున్నాయి. ఆమె కష్టంగా తన కుడి చేతిని తప్పించగలిగింది, కానీ కింద నేలపై ఆమెకు తడిగా ఏదో తగిలింది. తడిమి చూసినపుడు, నేలపై తన రక్తమే ఉందని, తను రక్తపు మడుగులో ఉన్నానని ఆమెకు తెలిసింది.

**( క్రేక్ కోలీ పుస్తకం 'నాగాసాకీ', జేమ్స్ డెల్‌గా ర్డో పుస్తకం 'న్యూక్లియర్ డాన్', చికాసావు మోరాసామీ పుస్తకం 'ద వైట్ స్కై ఇన్ హిరోషిమా' ఆధారంగా )**



## గర్భిణీలలో కాల్షియం లోపిస్తే..
### ఆ సమస్యలను ఆహ్వానించినట్టే..

ప్రతీ మహిళ జీవితంలో గర్భం దాల్చడం అనేది ఒక కీలక ఘట్టం. మరో జీవికి జన్మనిస్తున్నాన్న సంతోషం ఓవైపు, ఏదో తెలియని భయం మరోవైపు. మహిళల్లో మానసిక ఇబ్బందులకు దారి తీస్తుంటాయి. అందుకు గర్భిణీలుగా ఉన్న సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని చెబుతుంటారు. ముఖ్యంగా తీసుకునే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. తల్లితో పోటు కడుపులో బిడ్డకు కూడా అవసరమైన పోషకాలు అందేలా ఫుడ్ తీసుకోవాలని సూచిస్తుంటారు. గర్భం దాల్చిన సమయంలో మహిళల శరీరంలో విటమిన్స్ లోపం అస్సలు ఉండకూడదు. ముఖ్యంగా క్యాల్షియం లోపం ఉన్నట్లయితే ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని నిపుణులు చెబుతున్నారు. గర్భధారణ సమయంలో కాల్షియం శరీరంలో కీలక పాత్ర పోషిస్తుందని అంటున్నారు. కాల్షియం ఎముకలు, దంతాలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. గర్భధారణ సమయంలో శిశువు ఎముకలు, దంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయి. ఇందుకు కాల్షియం ఎంతో అవసరం. శిశువుకు కాల్షియం తల్లి శరీరం నుంచి లభిస్తుంది. తల్లి శరీరంలో కాల్షియం లోపం ఉంటే పుట్టబోయే బిడ్డపై ప్రభావం పడుతుంది. అంతేకాకుండా గర్భిణీలోనూ ఎముకలు బలహీనంగా మారుతాయి. భవిష్యత్తులో బోలు ఎముకల వ్యాధి వంటి వ్యాధుల ప్రమాదం పెరుగుతుంది. ఇక పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై కూడా కాల్షియం లోపం తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. శిశువు ఎముకలు సరిగ్గా అభివృద్ధి చెందవు. ఇది పుట్టిన తరువాత శిశువులో బలహీనతకు దారితీస్తుంది. అలాగే శిశువు గుండె, కండరాలతో పాటు నరాల అభివృద్ధిపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. బిడ్డ కడుపులో తగినంత కాల్షియం పొందకపోతే.. అది భవిష్యత్తులో చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. గర్భధారణ సమయంలో స్త్రీలకు రోజుకు 1000 నుంచి 1200 %ఎస్త్ర% కాల్షియం అవసరం ఉంటుంది. ఇది పాలు, పెరుగు, జున్ను, ఆకుకూరలు, నువ్వులు, బాదం వంటి ఆహార పదార్థాల ద్వారా లభిస్తుంది. అయితే నువ్వులు వేడి చేసే అవకాశం కూడా ఉంటుంది. కాల్షియం లోపం ఉంటే వైద్యుడి సూచన మేరకు కాల్సియం సప్లిమెంట్స్‌ను తీసుకోవచ్చు.

## మీకు గ్యాస్ సమస్య ఉందా?
### ఈ ఇంటి చిట్కాలతో హాంఫట్..



సరిపడ నీరు తాగని కారణంగా కూడా జీర్ణ సంబంధిత సమస్యలతో పాటు, గ్యాస్ వేధిస్తుందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి కచ్చితంగా సరిపడ నీటిని తీసుకోవాలి. వాతావరణం చల్లగా ఉందని కొందరు నీటిని తాగడం మానేస్తుంటారు. కానీ దాహంతో సంబంధం లేకుండా కచ్చితంగా రోజుకు 2 నుంచి 3 లీటర్ల నీటిని తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఆహారంలో పండ్లు, కూరగాయలను కచ్చితంగా భాగం చేసుకోవాలి. ఇలాంటి ఫుడ్‌ను నిత్యం తీసుకుంటే జీర్ణ సంబంధిత సమస్యలు దరిచేరవు. కడుపు నిత్యం లైట్‌గా ఉంటుంది. త్వరగా జీర్ణమై కడుపు ఉబ్బరం వంటి సమస్య దరిచేరదు. ఇక జీర్ణవ్యవస్థ మెరుగుపడి, గ్యాస్ సమస్యలు తగ్గాలంటే క్రమంతప్పకుండా వ్యాయామం చేయాలని నిపునులు చెబుతున్నారు. వ్యాయామంతో శరీరం ఫిట్‌గా ఉండడమే కాకుండా, జీర్ణ సమస్యలు కూడా దరచేరవు. మనలో చాలా మంది ఆహారం తీసుకునే సమయంలో చేసే తప్పు.. భోజనాన్ని త్వరగా నమిలి మింగేయడం. ఇలా చేయడం వల్ల కూడా జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే ఆహారాన్ని వీలైనంత ఎక్కువసార్లు నమిలి మింగాలి. ఇలా చేస్తే ఆహారం త్వరగా జీర్ణమై గ్యాస్ సమస్య దరిచేరదు. ఒత్తిడి కూడా జీర్ణ సంబంధిత సమస్యకు దారి తీస్తుందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ఒత్తిడిని తగ్గించుకునే పనులు చేయాలి. ఇందుకోసం యోగా, మెడిటేషన్ వంటి వాటిని కచ్చితంగా జీవనశైలిలో ఒక భాగం చేసుకోవాలి. తీసుకునే ఆహారంలో ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉండే ఫుడ్‌ను తీసుకోవడం వల్ల పొట్ట ఆరోగ్యం మెరుగవుతుంది. గ్యాస్ సమస్య నుంచి బయటపడాలంటే కచ్చితంగా పెరుగును ఆహారంలో భాగం చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ప్రతీరోజూ పెరుగును ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల జీర్ణ వ్యవస్థ బలోపేతమవుతుంది. మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలకు చెక్ పెట్టొచ్చు.


## ఈ ఒక్క చిట్కాతో నిగారించే చర్మం మీ సొంతం!



మీరు ఏమి చేసినా, మన చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవడానికి మన ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలి. ఈ మార్పులు ఖచ్చితంగా మన చర్మంపై ప్రభావాన్ని చూపుతాయి. ప్రజెంట్ డేస్‌లో చాలా మంది ఎదుర్కొనే సాధారణ సమస్య నిస్తేజమైన చర్మం. దీని నుంచి బయటపడి మంచి నిగారించే చర్మాన్ని పొందాలని చాలా మంది అనుకుంటారు. అందుకోసం ఏవేవో ప్రయత్నాలు చేసి విఫలం అయి ఉంటారు. కానీ మన ఇంటి పరిసరాల్లో లభించే సహజమైన పుదీనా, నిమ్మరసంతో మన చర్మాన్ని మెరిసేలా చేసుకోవచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఈ రెండింటిని కలిపి రసం తయారు చేసుకుని త్రాగడం వల్ల. కొద్ది రోజుల్లోనే మన చర్మం నిగారింపుగా మారుతుందని చెబుతున్నాయి. పుదీనా, నిమ్మరసం మీ చర్మ ఆరోగ్యాన్ని పెంచడానికి సహాయపడుతాయి. చర్య సమస్యలకే కాదు.. వేసవి వేడి నుండి ఉపశమనం పొందడానికి కూడా ఈ రసం గొప్ప మార్గం. వీటిలో ఉండే పోషకాలు మీరు కోరుకునే మెరిసే చర్మాన్ని అందించడంలో సహాయపడతాయి. మొటిమలు ఉన్నవారికి పుదీనా చాలా మంచిది. పుదీనా ఆకులు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను, సాలిసిలిక్ ఆమ్లాన్ని కూడా కలిగి ఉంటాయి. కాబట్టి మీ ఆహారంలో పుదీనాను చేర్చుకోవడం ద్వారా, మీ చర్మం బిగుతగా మారడంతో పాలు సహజమైన మెరుపును పొందుతుంది. పుదీనా రసం తాగడమే కాకుండా, మీరు పుదీనాను నేరుగా మీ చర్మానికి మాస్క్ రూపంలో కూడా అప్లై చేయవచ్చు. నిమ్మకాయలో మనకు విటమిన్ సి పుష్కలంగా దొరుకుతుంది. ఇది మీ చర్మ ఆరోగ్యానికి అత్యంత అవసరమైన విటమిన్లలో ఒకటి. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (NIH) ప్రకారం, నిమ్మకాయలలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.


వాటిలో సిట్రిక్ యాసిడ్ కూడా ఉంటుంది. ఇది చనిపోయిన చర్మ కణాలను తొలగించడంలో సహాయపడుతుంది. బ్లాక్ హెడ్స్, మొటిమల వంటి చర్మ సమస్యలను వదిలించుకోవడానికి నిమ్మరసం చాలా మంచిది. పుదీనా, నిమ్మరసం రసాన్ని మీరు ఇంట్లోనే ఈజీగా తయారు చేసుకోవచ్చు. మీరు ఇంట్లో తయారు చేసుకోగల సులభమైన జ్యూస్‌లలో ఇది కూడా ఒకటి. దీన్ని తయారు చేయడానికి, ముందుగా మీరు పుదీనా ఆకులు, ఉప్పు, నిమ్మరసం, తేనె, సోంపు గింజలను బ్లెండర్‌లో కొద్దిగా నీటితో రుబ్బుకోవాలి. తరువాత ఐస్ క్యూబ్స్, దోసకాయ ముక్కలు, తులసి ఆకులు ఒక గ్లాసులో వేసుకోవాలి. తయారుచేసిన మిశ్రమాన్ని గ్లాసులో పోసి బాగా కలపండి. ఇప్పుడు మీరు ఈ రుచికరమైన రసాన్ని తాగవచ్చు. ఇలా చేయడం ద్వారా కొన్ని రోజుల్లోనే మీ చర్మం నిగారింపుగా మారుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

## బ్యూటీ పార్లర్లకు వెళ్లే మహిళలు జాగ్రత్త..!



ప్రస్తుత రోజుల్లో చాలా మంది అందంగా కనిపించేందుకు ఆరాటపడుతున్నారు. అందంకోసం రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. కొంత మంది తమ జుట్టు, ముఖ సౌందర్యం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సెలూన్, బ్యూటీ పార్లర్లకు వెళతారు. అలా తరచూగా బ్యూటీ పార్లర్లలో షాంపూ చేయించుకునే వారికి ఇదోక హెచ్చరిక..ఇప్పుడు 'బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సింగ్రోమ్' అనే కొత్త సమస్య ప్రజల్ని భయపెడుతోంది. ఇది మీ మెడ, వీపుపై ఒత్తిడి వల్ల కలిగే తీవ్రమైన ఆరోగ్య సమస్య. చాలా సెలూన్లలో షేవింగ్ చేసిన తర్వాత, లేదంటే హెయిర్ కలర్ వేయించున్న తరువాత అక్కడే హెయిర్ వాష్ చేయించుకుంటారు. ఇందులో వాషింగ్ కోసం ఉపయోగించే బ్యాక్ వాష్ బేసిన్లపై వాలతాము. ఇది మన మెడలను ఇబ్బందికరమైన కోణంలో కుదిస్తుంది. ఇది మెడ నొప్పి, గాయం, చాలా అరుదైన సందర్భాల్లో ప్రాణాంతక స్ట్రోక్‌లకు దారితీస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సింగ్రోమ్‌ను మొదట 1993లో అమెరికన్ న్యూరాలజిస్ట్ మైఖేల్ విన్రాబ్ గుర్తించారు. ఈ సమస్యతో బాధపడే ముందు బ్యూటీ పార్లర్‌లో జుట్టును షాంపూతో శుభ్రం చేసుకున్న రోగులకు తీవ్రమైన స్ట్రోక్‌కు సంబంధించిన లక్షణాలు కనిపిస్తాయని ఆయన కనుగొన్నారు. స్ట్రోక్ అంటే మెదడుకు రక్త ప్రసరణలో అకస్మాత్తుగా అంతరాయం ఏర్పడటం వల్ల కలిగే మెదడు దాడి. ఇది సాధారణంగా రక్తం గడ్డకట్టడం వల్ల వస్తుంది. ఈ సందర్భంలో, ఆక్సిజన్, గ్లూకోజ్, పోషకాలు లేకపోవడం వల్ల మెదడు కణాలు దెబ్బతింటాయి. బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సింగ్రోమ్‌కు ప్రాథమిక కారణం కస్టమర్ తలకు షాంపూతో శుభ్రం చేస్తున్నప్పుడు వాష్‌బేసిన్ అంచున అధిక ఒత్తిడి అని పరిశోధనలు సూచిస్తున్నాయి. బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సింగ్రోమ్ నివారించడానికి ఏం చేయాలి.? : బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సింగ్రోమ్‌ను నివారించడానికి, బ్యాక్‌వాష్ సింక్‌ను ఉపయోగిస్తున్నప్పుడు మీకు నొప్పి, అసౌకర్యం ఎదురైతే, వెంటనే లేచి మీ మెడకు విశ్రాంతి ఇవ్వండి. లేకపోతే, కొంత వ్యాయామం కోసం మీ మెడను కుడి, ఎడమ వైపుకు తిప్పడానికి ప్రయత్నించండి. మీరు మీ జుట్టును కడుక్కోవాల్సిన అవసరం ఉంటే, ఒత్తిడిని తగ్గించడానికి మీ మెడ కింద ఒక టవల్ పెట్టుకోండి. ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది.

## బాడీలో ఈ లక్షణాలు కనిపిస్తే..
### కొలెస్ట్రాల్ పెరిగినట్లే..?




కొలెస్ట్రాల్ స్థాయి పెరిగినప్పుడు, మొదటగా కనిపించే లక్షణం కాళ్ళలో నొప్పి లేదా తిమ్మిరి. నడుస్తున్నప్పుడు లేదా విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు కాళ్ళలో బరువు లేదా తిమ్మిరి ద్వారా దీనిని గుర్తించవచ్చు. చేతులు మరియు కాళ్ళలో తిమ్మిరి, జలదరింపు లేదా చల్లగా అనిపించడం కూడా అధిక కొలెస్ట్రాల్ లక్షణాలు. కొంతమందిలో, పాదాల రంగు కూడా నీలం రంగులో కనిపించడం ప్రారంభమవుతుంది.ఛాతీలో నొప్పి లేదా ఒత్తిడి కూడా పెరిగిన కొలెస్ట్రాల్ ప్రధాన లక్షణం. వాస్తవానికి, కొలెస్ట్రాల్ ధమనులలో పేరుకుపోయినప్పుడు, ఛాతీలో మంట లేదా బిగుతుగా అనిపించడం జరుగుతుంది. ఇది గుండెపోటు లేదా కరోనరీ ఆర్టరీ వ్యాధికి సంకేతం కావచ్చు.మెడ, దవడ లేదా భుజంలో నొప్పి కూడా దీనికి సంకేతం కావచ్చు. శరీరంలో రక్త ప్రవాహం తగ్గినప్పుడు, ఈ భాగాలలో అసాధారణ నొప్పి లేదా దృఢత్వం అనుభూతి కలుగుతుంది. దీనిని ప్రజలు తరచుగా కండరాల నొప్పిగా భావించి విస్మరిస్తారు. తల బరువుగా అనిపించడం లేదా తల తిరుగుతున్నట్లు అనిపించడం కూడా కొలెస్ట్రాల్ పెరిగినట్లు సూచిస్తుంది. మెట్లు ఎక్కేటప్పుడు ఊపిరి ఆడకపోవడం లేదా త్వరగా అలసిపోవడం వంటివి కూడా విస్మరించకూడదు.పసుపు రంగు లేదా కళ్ళ చుట్టూ పసుపు వలయాలు ఏర్పడటం కూడా దాని లక్షణాలు కావచ్చు. ఇది శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి క్షీణిస్తోందనడానికి సంకేతం.మీ శరీరంలో ఇలాంటి మార్పులు గమనించినట్లయితే, వెంటనే మీ వైద్యుడిని సంప్రదించండి. సకాలంలో రోగ నిర్ధారణ, చికిత్స ఈ పరిస్థితి తీవ్రంగా మారకుండా నిరోధించవచ్చు. తల బరువుగా అనిపించడం లేదా తల తిరుగుతున్నట్లు అనిపించడం కూడా కొలెస్ట్రాల్ పెరిగినట్లు సూచిస్తుంది. మెట్లు ఎక్కేటప్పుడు ఊపిరి ఆడకపోవడం లేదా త్వరగా అలసిపోవడం వంటివి కూడా విస్మరించకూడదు.

## జీవితంలో సక్సెస్ సాధించాలనే తపన మీకూ ఉందా?

జీవితంలో విజయం సాధించాలని అందరూ కోరుకుంటారు. కానీ కొందరికే ఇది సాధ్యమవుతుంది. విజయం అంత తేలికగా ఎవరికీ దక్కదు. ఇందుకోసం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవడం, సానుకూల దృక్పథం కలిగి ఉండటం, స్వీయక్రమశిక్షణ, కృషిని పెంపొందించుకోవడం చాలా ముఖ్యం.అదేవిధంగా విజయం కోసం పరితపించేవాళ్లు ప్రతి ఉదయం కొన్ని అలవాట్లను అనుసరించాలి. ఎందుకంటే ఉదయం అలవాట్లు మొత్తం రోజును ప్రభావితం చేస్తాయి. ఉదయం సరైన మార్గంలో ప్రారంభిస్తే మన శక్తిసామర్థ్యాలు, మానసిక స్థితి మెరుగుపడుతాయి. మీరూ జీవితంలో విజయం సాధించాలనుకుంటున్నారా? అయితే మీరూ ఈ అలవాట్లను కొనసాగించండి.విజయవంతమైన వ్యక్తులు ఎల్లప్పుడూ ఉదయాన్నే నిద్రలేస్తారు. ఇలాంటి వారు సాధారణంగా ఉదయం 4:30 నుంచి 6:00 గంటల మధ్య నిద్రలేచి తమ రోజును ప్రారంభిస్తారు. ఇలా ఉదయాన్నే నిద్రలేవడం వల్ల రోజంతా అప్రమత్తంగా ఉంటారు. జడత్వం అనేదే వీరిలో ఉండదు. విజయవంతమైన వ్యక్తులు తమ ఉదయాలను ప్రశాంతంగా గడుపుతారు. వీరు ప్రతి ఉదయం ధ్యానం, శ్వాస వ్యాయామాలను అభ్యసిస్తారు. తద్వారా వారి మనస్సును కేంద్రీకరించి సానుకూలంగా మార్చుకుంటారు. ఈ అలవాటు వారి మనస్సును ప్రశాంతంగా ఉంచుతుంది. రోజంతా దృష్టి కేంద్రీకరించడంలో సహాయపడుతుంది. విజయవంతమైన వ్యక్తులు ఎల్లప్పుడూ చాలా చురుకుగా ఉంటారు. ఎందుకంటే వీరు ఉదయాన్నే నిద్రలేచి యోగా, తేలికపాటి వ్యాయామం వంటి శారీరక శ్రమ చేస్తుంటారు. తద్వారా శరీరాన్ని తాజాగా ఉంచుకోవచ్చు. ఇది రోజంతా చురుకుగా ఉండటానికి సహాయపడుతుంది. విజయవంతమైన వ్యక్తులు ఆరోగ్యకరమైన ఆహారం మాత్రమే తింటారు. వారు ఉదయం పండ్లు, పెరుగు, ఓట్స్, గింజలు వంటి ఆరోగ్యకరమైన, పోషకమైన ఆహారాన్ని తింటారు. ఇది సరైన పోషకాహారాన్ని అందిస్తుంది. రోజంతా మరింత సమర్థవంతంగా పనిచేయడానికి సహాయపడుతుంది. విజయవంతమైన వ్యక్తులు ఎల్లప్పుడూ ఉదయం పూట తమ రోజంతా లక్ష్యాలను నిర్దేశించుకుంటారు. వారు ముందుగా ఏ పనులు చేయాలో, మరింత ఉన్నతంగా ఎదగడానికి ఏ ప్రణాళికలు వేయాలో లక్ష్యాలను నిర్దేశిస్తారు. మీరు కూడా అదే విధంగా లక్ష్యాలను నిర్దేశించుకోవడం ద్వారా దశలవారీగా విజయ శిఖరాలను అధిరోహించవచ్చు. సానుకూల ఆలోచనలు విజయానికి మార్గం సుగమం చేస్తాయి.

విజయవంతమైన వ్యక్తులు ప్రతి ఉదయం తమను తాము ప్రేరేపించుకుంటూ, సానుకూలంగా ఆలోచిస్తూ గడుపుతారు. ఇది వారిని రోజంతా ఉత్సాహంగా ఉంచుతుంది. మీరు కూడా మీ రోజును ఇలా సానుకూలంగా ప్రారంభించవచ్చు. సక్సెస్‌ఫుల్ వ్యక్తులు తమ సమయంలో ఒక్క సెకను కూడా వృధా చేయరు. వీరు తమ సమయాన్ని చక్కగా నిర్వహిస్తారు. సమయం వృధా కాకుండా ఉండటానికి రోజులో ముందుగా ఏ పనులు చేయాలో వారు ముందుగానే నిర్ణయించుకుంటారు. మీరు కూడా ఇదే విధంగా సమయ నిర్వహణ పాఠాన్ని నేర్చుకోవాలి.



# ‘సేవ్ ది టైగర్స్ 3’ ట్రైలర్ విడుదల..

## – నవ్వుల సునామీ పక్కా!



తెలుగు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన వెబ్ సిరీస్ ‘సేవ్ ది టైగర్స్’ మూడో సీజన్‌తో మళ్లీ వచ్చేస్తోంది. ఇప్పటికే రెండు సీజన్లు బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచి, భార్యాబాధితుల కథకు విశేష ఆదరణ తెచ్చిపెట్టాయి. తాజాగా, ఈ సిరీస్ మూడో సీజన్‌కు సంబంధించిన వినోదభరితమైన ట్రైలర్‌ను విడుదల చేశారు. జూన్ 19 నుంచి ఈ సిరీస్ డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ట్రైలర్ ఆద్యంతం నవ్వులు పూయించేలా ఉంది. “పెళ్లి గురించి మనకు చిన్నప్పటి నుంచి అబద్ధాలే చెప్పారు” అంటూ అభినవ్ గోమటం చెప్పే డైలాగ్‌తో ట్రైలర్ మొదలవుతుంది. పెళ్లిళ్లపై తమ గోడు వెళ్లబోసుకుంటున్న ముగ్గురు స్నేహితులు ఘంటా రవి (ప్రియదర్శి), రాహుల్ (అభినవ్ గోమటం), విక్రమ్ (చైతన్య కృష్ణ) సంభాషణలతో కథనం సరదాగా సాగుతుంది. “మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అన్న వాడు నాకు దొరికితేనా” అని విక్రమ్ అనగానే, స్వర్గంలో ఇంద్రుడి పాత్రలో వెన్నెల కిషోర్ ప్రత్యక్షమవడంతో కథ ఫాంటసీ మలుపు తీసుకుంటుంది. ఆ తర్వాత, ముగ్గురు స్నేహితుల జీవితాలు అనూహ్యంగా మారిపోతాయి.

ఘంటా రవి ఎమ్మెల్యేగా, రాహుల్ గొప్ప రచయితగా, విక్రమ్ ఓ పెద్ద కంపెనీకి సీఈవోగా కనిపిస్తారు. ఇది నిజమా లేక మరో ప్రపంచంలో జరుగుతోందా అనే గందరగోళం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ట్రైలర్‌ను బట్టి చూస్తే, ఈసారి ఫాంటసీ అంశాలను జోడించి వినోదాన్ని నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లినట్టు స్పష్టమవుతోంది. ప్రియదర్శి, అభినవ్, చైతన్య కృష్ణతో పాటు పావని గంగిరెడ్డి, జోర్దార్ సుజాత, దేవియాని శర్మ తమ పాత్రలతో మరోసారి అలరించడానికి సిద్ధమయ్యారు. మహి వి. రాఘవ్, ప్రదీప్ అద్వైతం క్రియేటర్లుగా వ్యవహరిస్తున్న ఈ సిరీస్‌కు శ్రీరామ్ ఎరగం దర్శకత్వం వహించారు. ట్రైలర్ చూస్తే కామెడీకి మాత్రం లోటు ఉండదని భరోసా ఇస్తోంది.

# నచ్చని పనికి ‘నో’

## చెప్పడమే నా సక్సెస్: యామీ గౌతమ్

బాలీవుడ్ నటి యామీ గౌతమ్ తన కెరీర్ విజయ రహస్యాన్ని మరోసారి పంచుకున్నారు. తాను నమ్మని పాత్రలు, కథలకు నిర్భయంగా ‘నో’ చెప్పడం నేర్చుకోవడం వల్లే వృత్తిపరంగా ఎదగగలిగానని ఆమె స్పష్టం చేశారు. ఇటీవలే మాతృత్వంలోకి అడుగుపెట్టినప్పటికీ, తన వృత్తిపరమైన నిర్ణయాల్లో ఎలాంటి మార్పు లేదని తెలిపారు. ఇటీవల ఓ ఇంగ్లీష్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో యామీ ఈ విషయాలు వెల్లడించారు. “కెరీర్‌లో నిలదొక్కుకోవాలంటే కొన్నిసార్లు నమ్మకం లేని పనులకు కూడా ‘నో’ చెప్పడం నేర్చుకోవాలి. నా జీవితంలో ఆ మార్పు 2018లో ‘ఊరి’, ‘బాలా’ సినిమాల తర్వాత వచ్చింది. అప్పటి నుంచి నాకు నిజంగా నచ్చిన, నన్ను ప్రభావితం చేసే పాత్రలనే ఎంచుకుంటున్నాను. ఆ తర్వాతే నేను నిర్భయంగా ఉండటం మొదలుపెట్టాను,” అని ఆమె వివరించారు. కేవలం ఉపాధి కోసం లేదా పరిశ్రమలో కనిపించడం కోసం సినిమాలు చేయనని గతంలోనూ యామీ స్పష్టం చేశారు. పనిలేకుండా ఉండటానికైనా సిద్ధమే కానీ, నమ్మకం లేని సినిమా మాత్రం చేయనని ఆమె గట్టిగా చెబుతారు. తనకు అవార్డుల కన్నా ప్రేక్షకుల ప్రేమే ముఖ్యమని యామీ పేర్కొన్నారు. “ప్రేక్షకుల ప్రశంసలకు మించిన పెద్ద అవార్డు మరొకటి లేదు. మిగతావన్నీ క్షణికమైనవి,” అని ఆమె అన్నారు. ఈ ఎంపికల వల్లే ఆమె ‘ఎ థర్స్ డే’, ‘దస్వీ’, ‘ఆర్టికల్ 370’ వంటి విజయవంతమైన, విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.



# రూ.9 కోట్ల బడ్జెట్‌తో రూ.40 కోట్ల వసూళ్లు

## మరాఠీ బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న ‘దేవూల్ బంద్ 2’




మరాఠీ సినీ పరిశ్రమలో మరో చిన్న సినిమా భారీ సంచలనం సృష్టిస్తోంది. ఎలాంటి భారీ అంచనాలు లేకుండా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ‘దేవూల్ బంద్ 2’ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. ప్రముఖ నటుడు, దర్శకుడు ప్రవీణ్ ట్రేడ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో స్నేహల్ ట్రేడ్ మోహన్ జోషి కీలక పాత్రలు పోషించారు. మే 21న విడుదలైన ఈ సినిమా కేవలం తొమ్మిది రోజుల్లోనే సుమారు రూ.40 కోట్ల వసూళ్లు సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. సాధారణంగా మరాఠీ చిత్రాలు పరిమిత బడ్జెట్‌తో తెరకెక్కినా, బలమైన కథా కథనాలతో ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటుంటాయి. అదే కోవలో వచ్చిన ‘దేవూల్ బంద్ 2’ కూడా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. కేవలం రూ.9 కోట్ల వ్యయంతో రూపొందిన ఈ చిత్రం ఇప్పటికే తన బడ్జెట్‌కు నాలుగు రెట్లు పైగా వసూళ్లు రాబట్టింది. అంతేకాకుండా అత్యధిక వసూళ్లు సాధించిన టాప్-10 మరాఠీ చిత్రాల జాబితాలో చోటు సంపాదించడం విశేషంగా మారింది. ఇక సినిమా కథ విషయానికి వస్తే, సంగీత పేగుడే అనే మహిళా రైతు చుట్టూ కథ తిరుగుతుంది. ఈ పాత్రను స్నేహల్ తార్డే ఎంతో సహజంగా పోషించారు. పేదరికం, అప్పులు, కష్టనష్టాలతో నిత్యం పోరాడే సంగీత తన జీవితంలో మార్పు కోసం ప్రతిరోజూ దేవుడిని ప్రార్థిస్తూ ఉంటుంది. అయితే ఎంత మొరపెట్టుకున్నా తన సమస్యలు తీరకపోవడంతో ఆమె తీవ్ర నిరాశకు గురవుతుంది. ఒక రోజు ఆవేదనతో నది ఒడ్డున ఉన్న చీమల పుట్టపై రాయిని విసిరికొడుతుంది. ఆ ఘటన అనంతరం ఆమెకు ఆధ్యాత్మిక గురువు స్వామి సమ్రత్ దర్శనమిస్తారు. ఆ తర్వాత సంగీత జీవితంలో చోటుచేసుకునే మార్పులు, ఆమె ఎదుర్కొనే సంఘటనలు, విశ్వాసం మరియు జీవిత సత్యాల మధ్య జరిగే సంఘర్షణలే సినిమా ప్రధాన కథాంశంగా తెరకెక్కించబడ్డాయి. గ్రామీణ నేపథ్యంలో ఆధ్యాత్మికతను, భావోద్వేగాలను మిళితం చేస్తూ దర్శకుడు ప్రవీణ్ తార్డే కథను ప్రేక్షకులకు చేరవేశారు. ముఖ్యంగా రైతుల సమస్యలు, వారి జీవన పోరాటం, భక్తి మరియు నమ్మకాలపై సినిమా తీసుకున్న దృక్పథం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. అందుకే విడుదలైన మొదటి రోజు నుంచే ఈ చిత్రానికి మంచి మౌత్ పబ్లిసిటీ లభించింది. ఈ సినిమా నిర్మాణానికి సంబంధించిన మరో ఆసక్తికర విషయం కూడా ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

చిత్రీకరణ సమయంలో కీలక సన్నివేశాల కోసం చిత్రబృందం ఏకధాటిగా 33 గంటల పాటు షూటింగ్ నిర్వహించిందని సమాచారం. ఆ కృషి ఇప్పుడు ఫలితాన్ని ఇస్తోందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా చూస్తే, పెద్ద స్టార్లు లేకుండా, పరిమిత బడ్జెట్‌తో రూపొందిన ‘దేవూల్ బంద్ 2’ ప్రస్తుతం మరాఠీ సినీ పరిశ్రమకు కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చింది. బలమైన కథ ఉంటే చిన్న సినిమాలు కూడా భారీ విజయాలు సాధించగలవని మరోసారి ఈ చిత్రం నిరూపించింది.

# వినోదాలు పంచే డాక్టర్ బాబు



శ్రీస్కంద హీరోగా పరిచయమవుతున్న చిత్రం ‘మన డాక్టర్ బాబే’. చలపతి కుమార్ పువ్వల దర్శకుడు. స్కంద మూవీస్ పతాకంపై కృతాక్షి నిర్మిస్తున్నారు. శనివారం దర్శకుల సంఘం అధ్యక్షుడు వి.ఎన్.ఆదిత్య టీజర్‌ను లాంచ్ చేశారు. జంధ్యాల, ఈవీవీ తరహాలో ఆద్యంతం నవ్వించే చిత్రమిదని, ఓ సెన్సిటివ్ పాయింట్‌ను జాగ్రత్తగా డీల్ చేస్తూ ఈ సినిమా తీశారని హీరో శ్రీస్కంద తెలిపారు. వినోదంతో పాటు హృదయాన్ని కదిలించే భావోద్వేగాలుంటాయని, ప్రేక్షకులు కన్నీటి చెమ్మతో థియేటర్ల నుంచి బయటకు వస్తారని దర్శకుడు చలపతి కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# స్టైలిష్‌గా గన్ పట్టుకున్న రాధ్య..

## – చరిత్ర సృష్టిస్తుందంట




రవికుమార్ సీరపు కథ, స్క్రీన్‌ప్లే అందించడంతోపాటు దర్శకత్వం వహిస్తున్న చిత్రం ‘ది రెడ్ బ్యాగ్’ (ఏష్ట్రవ =వఁ ద్యుస్త్ర). టాలీవుడ్ విలన్, హర్యానా యాక్టర్ కబీర్ దుహన్ సింగ్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రంలో పాపులర్ నటి రాశీ కీలక పాత్ర పోషిస్తుంది. రాధ్య, స్నేహా సింగ్, ఆకాంక్ష ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. ఈషాన్ శంకర్, అవినాష్ బాదల్, భార్గవి ప్రసాద్ బెహరా ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీలో వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో పోషిస్తున్న రాధ్య పోస్టర్‌ను రిలీజ్ చేశారని తెలిసిందే. స్టైలిష్, మోడ్రన్ డ్రెస్‌లో ఉన్న రాధ్య ఓ చేతిలో గన్ పెట్టుకోగా.. మరో చేతిలో హ్యాండ్ బ్యాగ్ లాంటి వస్తువును చూడొచ్చు. ఆమె రూల్స్ ఫాలో అయ్యేందుకు లేదు.. చరిత్ర సృష్టించడానికి ఉంది.. అంటూ రిలీజ్ చేసిన లుక్ ది రెడ్ బ్యాగ్ ఎలాంటి ట్విస్టులు, మలుపులతో ఉండబోతుందో సస్పెన్స్ పెడుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. కొన్ని పాత్రలు కేవలం కథకు సపోర్ట్‌గా నిలుస్తాయి. కానీ సావిత్రి మాత్రం మొత్తం ఆటనే మార్చేస్తుంది.. అంటూ రాశీ పాత్రను పరిచయం చేశారని తెలిసిందే. మరోవైపు మేకర్స్ ఇప్పటికే రిలీజ్ చేసిన ది రెడ్ బ్యాగ్ మూవీ ఫ్రీ లుక్‌లో నలుగురు అమ్మాయిలతో రిలీజ్ చేసిన పోస్టర్‌తో బ్యాగ్ చుట్టూ తిరిగే కథాంశంతో సాగే డిఫరెంట్ కాన్సెప్ట్‌తో, యాక్షన్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు చెప్పాడు డైరెక్టర్. నిర్మాత హరికృష్ణ సోమిశెట్టికి డెబ్యూ సినిమానే అయినా భారీ బడ్జెట్‌తో సినిమాను తెరకెక్కిస్తుండటం విశేషం. ఇంతకీ ది రెడ్‌బ్యాగులో ఏముంది.. అనేది టీజర్‌తో ఏమైనా హింట్ ఇస్తారేమో చూడాలి.

# నేను ఇప్పటివరకు చేయని పాత్ర ఇది

## ‘పెద్ది’ గురించి రామ్ చరణ్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన తాజా చిత్రం ‘పెద్ది’లోని పాత్రపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బుచ్చిబాబు దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ స్పోర్ట్స్ డ్రామాలో తాను పోషించిన పాత్ర తన కెరీర్‌లోనే పూర్తి భిన్నమైనదని ఆయన తెలిపారు. ఈ సినిమాతో నటుడిగా ఎన్నో విషయాలు నేర్చుకున్నానని వెల్లడించారు. జూన్ 4న విడుదల కానున్న ‘పెద్ది’ ప్రమోషన్లలో భాగంగా బాలీవుడ్ మీడియాతో చరణ్ మాట్లాడారు. “పెద్ది సినిమాలో నేను చేసిన పాత్ర నా కెరీర్‌లో ఇప్పటివరకు చేయలేదు. ఇది పూర్తిగా భిన్నమైనది. ఈ సినిమాలో చాలా మంది గొప్ప నటులతో కలిసి పనిచేయడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకునే అవకాశం దొరికింది” అని రామ్ చరణ్ వివరించారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ నటన అద్భుతంగా ఉంటుందని చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ నటుడు బొమన్ ఇరానీ, రామ్ చరణ్ గురించి ప్రశంసలు కురిపించారు. ఈ సినిమాలో చరణ్ మూడు రకాల క్రీడలు (కుస్తీ, క్రికెట్, రన్నింగ్) ప్రదర్శించారని, నాలుగో ‘ఆట’గా డ్యాన్స్‌తో అదరగొట్టారని తెలిపారు. గుర్తింపు కోసం ఒక వ్యక్తి ఎంత దూరమైనా వెళ్లగలడని ఈ సినిమా నిరూపిస్తుందని బొమన్ ఇరానీ అన్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కీలక పాత్రలో నటిస్తుండగా, సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ఈ వ్యాఖ్యలు అంచనాలను మరింత పెంచుతున్నాయి.

# చెన్నైలో జరిగే ప్రేమకథ



కిరణ్ అబ్బవరం, శ్రీగౌరిప్రియ జంటగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ‘చెన్నై లవ్‌స్టోరీ’. రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సాయిరాజేష్ కథనందిస్తున్నారు. ఈ సినిమాను జూలైలో విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. చెన్నై నగరం నేపథ్యంలో జరిగే ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇదని, ప్రేమలోని సున్నిత భావోద్వేగాలను ఆవిష్కరిస్తూ అందరినీ మెప్పిస్తుందని, సంగీతానికి కూడా చాలా ప్రాధాన్యత ఉంటుందని మేకర్స్ చెప్పారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కిస్తున్న లవ్‌స్టోరీ ఇదని, కిరణ్ అబ్బవరం పాత్ర నవ్యరీతిలో సాగుతుందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కథ: సాయిరాజేష్, నిర్మాతలు: ఎస్‌కేఎన్, సాయిరాజేష్, రచన-దర్శకత్వం: రవి నంబూరి.

# గరం మసాలా మంచిదే!



ధనియాలు, మిరియాలు, శొంఠి, ఆవాలు, జీలకర్ర, పసుపు, బిర్యానీ ఆకులు.. వీటన్నిటితో కూడిన పోపు డబ్బా డాక్టరు చేతిలోని మందుల సంచి లాంటిది. ప్రతి దినుసుకూ ఔషధ విలువలు ఉన్నాయని చెబుతారు పరిశోధకులు. అన్నీ కలిస్తే.. ఆ శక్తి ఇనుమడిస్తుంది. ఫలితంగా జీర్ణశక్తి పెరుగుతుంది, కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటుంది. బ్లడ్ షుగర్ కూడా అదుపులోకి వస్తుంది. అంతేనా,మలబద్ధకం పరార్. నోటి దుర్వాసన దూరం అవుతుంది. చిగుళ్లు గట్టి పడతాయి. వృద్ధాప్య లక్షణాలు మందగిస్తాయనీ చెబుతున్నారు. కాకపోతే.. అతి సర్వత్ర వర్జయేత్ అనే సూత్రం ఇక్కడ కూడా వర్తిస్తుంది. సాధ్యమైనంత వరకూ తాజాగా నూరిన మసాలాలే ఉత్తమం.

# మెడలో మందిరం

దేవుడికి మెడలోనూ గుడి కడుతున్నారు డిజైనర్లు. 'టెంపుల్ లాకెట్లు' నగల డిజైన్లలో కొత్త ట్రెండ్ ఇప్పుడు. దేవుడి ప్రతిమ ఏదైనా.. దాని చుట్టూ ముచ్చటైన మందిరాన్ని పోలిన నిర్మాణం ఉండటం వీటి ప్రత్యేకత. శిల్ప కళకు దీటుగా నగిషీలు చెక్కుతున్నారు. అందమైన స్తంభాలు, ముచ్చటైన గోపురాలను ఆభరణాల్లో ఆవిష్కరిస్తున్నారు. లక్ష్మి, గణపతి, కృష్ణుడు, శివుడు, వేంకటేశ్వరుడు.. ఇలా రకరకాల దేవతా ప్రతిమలు



ఉంటున్నాయి ఇందులో. ముఖ్యంగా లక్ష్మీదేవికి సంబంధించి బోలెడు డిజైన్లు వస్తున్నాయి. మందిరం ఆకృతుల్లో అయితే లెక్కకు మిక్కిలి వెరైటీలు దొరుకుతున్నాయి. యాంటిక్ ఫినిష్‌తో చోకర్లు, హారాలు, నెక్లెస్‌లు.. ఇలా అన్నిటిలోనూ వస్తున్నాయి. పచ్చలు, కెంపులు, వజ్రాలు, ముత్యాలు పొదిగినవే కాదు.. నగకు ప్రత్యేక లుక్ తీసుకు వచ్చేలా బీడ్స్ తరహాలోనూ టెంపుల్ లాకెట్లు రూపొందుతున్నాయి. కొన్ని మందిరాలు త్రీడీ తరహాలో ఉంటే, కొన్ని అచ్చమైన మండపంలా చదరంగా ఉంటున్నాయి.

# క్రిస్పీ పొటాటో స్నాక్స్‌తో అతిధులను ఆకట్టుకోండి..!



న్యూఢిల్లీ : వారం రోజుల పాటు అటు ఆఫీసు పని ఒత్తిళ్లు, ఇటు ఇంటి పనులు చక్కబెట్టే అతివల అలసట (%ఔవవనివఅ వాఋఎిం%) మాటలతో తీరేది కాదు. వీక్‌డేస్‌లో అవిశ్రాంతంగా పనిచేసే మగువలు, మగానుబావులు వారాంతంలో ఆత్మీయులతో గడపడంతో పాటు ఇష్టమైన ఫుడ్ ఎంజాయ్ చేస్తూ కాస్త సేదతీరాలనుకుంటారు.వీకెండ్‌లో ఫ్రెండ్స్, బంధువులు, అతిధులు తలుపు తడుతుంటారు. వారితో కబుర్లతో సమయం తెలియకపోయినా అతిధుల కోసం ఇష్టమైన వంటకాలు ప్రిపేర్ చేయడంలోనూ చాలా మంది ఆనందం వెతుక్కుంటారు. ఆత్మీయులతో పాటు కుటుంబసభ్యులు ఇష్టమైన డిష్‌లతో రుచిని ఆస్వాదిస్తూనే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని కోరుకుంటారు. ఇక ఏ పార్టీలో అయినా స్నాక్స్ హైలైట్ అవుతుంటాయి.

అందునా పొటాటోలతో చేసే స్నాక్స్ అంటే చిన్నా పెద్దా ఇష్టంగా ఆరగిస్తుంటారు. పొటాటోలతో ఎన్నో రకాల స్నాక్స్ చేసుకోవచ్చు. ఈ వీకెండ్ అలాంటి స్నాక్స్‌తో మీ అతిధులను ఆకట్టుకోండి. చికెన్ లాలిపాప్ తరహాలో శాకాహార రుచులను మేళవిస్తూ ఆలూ లాలిపాప్‌తో అతిధులను మెస్మరైజ్ చేయవచ్చు. ఆలూతో బోలెడన్ని వెరైటీ స్నాక్స్ చేసుకోవచ్చు. అటు అతిధులు, ఇటు మీ పిల్లలూ మీరూ వీకెండ్‌ను క్రేజీ స్నాక్స్‌తో ఎంజాయ్ చేయవచ్చు. ఏడు రకాల రుచులతో అలరించే ఆలూ వెరైటీ స్నాక్స్ ఇవే..

# ఇండియా మొత్తానికి ఫేమస్ అయిన అస్సాంలోకి తేయాకు తోటలు ఎలా వచ్చాయి?

భారతదేశ పటాన్ని జాగ్రత్తగా గమనిస్తే.. ఈశాన్య రాష్ట్రాల్లో మెలితిరిగిన '%ట%' ఆకారంలో ఓ రాష్ట్రం కనిపిస్తుంది. అదే అస్సాం. ఈ రాష్ట్ర నైసర్గిక స్వరూపం వెనుక ఎవరున్నారో తెలియదు కానీ, అస్సాం ఆవిర్భావానికి శతాబ్దం ముందు నుంచే ఈ ప్రాంతం 'టీ'కి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది! పురాణాల్లో అస్సాంను 'ప్రాక్ జ్యోతిషపురం'గా ప్రస్తావించినట్టు కనిపిస్తుంది. ఆ సంగతి అటుంచితే, అస్సాంలో తేయాకు మొక్కలు దాదాపు రెండు శతాబ్దాల కిందట వేళ్లూనుకున్నాయి. ఇక్కడి ప్రకృతి, వాతావరణం, గిరులు తేయాకు పంటకు అనుకూలమని 1823లో రాబర్ట్ బ్రూస్ అనే ఆంగ్లేయుడు భావించాడు. అక్కడక్కడా కొన్ని తేయాకు మొక్కలనూ ఆయన గుర్తించాడట. ఇంకేముంది, ఈ శుభవార్త సహచరుల చెవిలో వేశాడు. ఈస్ట్ ఇండియా కంపెనీ పెద్దలంతా అస్సాంలో తేయాకు పండించాలని నిర్ణయించారు. అలా 1839లో 'అస్సాం టీ కంపెనీ' ప్రారంభమైంది. అక్కడి కొండలు, కోనలు తేయాకు తోటలకు ఆలవాలం అయ్యాయి. దాదాపు 184 ఏండ్లుగా అస్సాంలో తేయాకు సాగు విస్తీర్ణం ఏటికేడూ పెరుగుతూనే వస్తున్నది. ప్రస్తుతం సుమారు 3.04 లక్షల హెక్టార్లలో తేయాకు పండిస్తున్నారు. అస్సాం జనాభాలో సుమారు ఐదోవంతు తేయాకు తోటల మీద ఆధారపడి జీవనం సాగిస్తుండటం విశేషం. ఏటా ఈ రాష్ట్రం నుంచి సుమారు 70 కోట్ల కిలోల తేయాకు ఉత్పత్తి అవుతున్నది. మనదేశం మొత్తం ఉత్పత్తిలో సుమారు 50 శాతం వాటా అస్సాందే కావడం విశేషం. ఇక్కడి నేల స్వభావం, వాతావరణం అస్సాం టీని ప్రత్యేకంగా నిలబెట్టాయి.

# పెళ్లిళ్లు అయినా.. వ్రతాలైనా

# శ్రావణ మాసంలో వెండి ఉంటేనే కిక్కు!




పూజలూ పునస్కారాలు, నోములూ వ్రతాలు, పెండ్లిళ్లూ పేరంటాలు%శా% శుభకార్యం ఏం పెట్టుకోవాలన్నా శ్రావణానికే ఓటేస్తారు మనవాళ్లు. పసుపు దంపు చప్పుళ్లూ, వాయనాల ముచ్చట్లూ ఈ నెలలోనే వినిపిస్తాయి. ఆయా వేడుకలకు మరింత ఘనంగా మలిచే ఉద్దేశంతో అక్కడ వాడే రోలూ రోకళ్ల నుంచి వాయనాల బుట్టల దాకా వెండితో తయారు చేస్తున్నారు డిజైనర్లు.

పెండ్లి ముచ్చట మొదలయ్యేది పసుపు దంచడంతోనే. హల్దీ ఫంక్షన్‌గా పిలుస్తూ ఇప్పుడు దాన్ని ప్రత్యేకంగా జరుపుతున్నారు. ఈ వేడుకకు మరింత శోభను తెచ్చేలా రోలు, రోకళ్లతోపాటు విసురురాయినీ రజతంతో తీర్చిదిద్దుతున్నారు. పూర్తి వెండి రోళ్లతోపాటు, చెక్కవాటికి వెండి రేకులతో డిజైన్ చేసినవీ ఉంటున్నాయి ఇందులో. స్తోమతను, అవసరాన్ని బట్టి చేయించుకునేలా అరచేతిలో పట్టేంతవాటి నుంచి నిజమైన వస్తువులంత పెద్దవాటి వరకూ రూపొందుతున్నాయి.

**నోముల కోసం..** శ్రావణ మాసం చేసే మంగళగౌరీ నోము, వరలక్ష్మీ వ్రతాలు లాంటివాటిలో తాటాకు బుట్టలో వాయనం పెట్టి ఇచ్చే ఆచారమూ కొన్నిచోట్ల ఉంది. ఇప్పుడు తాటాకు స్థానంలో డిజైనర్లు వెండితోనూ బుట్టల్ని అల్లుతున్నారు. అంతేకాదు, చేట వాయనాల కోసం వెండి చేటలనూ తయారు చేస్తున్నారు. అందులోనూ వెదురు అల్లికను పోలి తయారయ్యేవి కొన్నయితే, చేట లోపల లక్ష్మీదేవి, ఏనుగులు



ఉండేవీ, పూలూ తీగల్లాంటి డిజైన్లు ఉన్నవీ మరికొన్ని రకాలు. చేట వాయనంలో పెట్టి ఇచ్చే తాంబూలాలూ, దువ్వెనల్లాంటివీ రజతంతోనే తీరుస్తున్నారు. చేటలను కూడా మన ఇష్టాన్నిబట్టి చిన్నాపెద్దా సైజుల్లో కొనుక్కోవచ్చు.

ఇక, వ్రతాల సందర్భంలో పెట్టుకునే కలశాన్ని కూడా అచ్చంగా వెండితోనే చేస్తున్నారు. ఇంతకుమునుపు ఇందుకోసం అష్టలక్ష్మి చెంబులను వాడేవాళ్లం. ఈ నమూనాలోనూ కొబ్బరికాయ, పూలు, మామిడాకులు కూడా వెండితోనే చేసినవి పూర్ణకలశం రూపంలో దొరుకుతున్నాయి. వీటిలోనూ రాళ్లు, ఎనామిల్ ఉన్నవీ చూడచక్కగా గొలుసులు వేలాడేవీ వస్తున్నాయి. అంతేకాదు, అందమైన డిజైన్లు తీర్చి వాటిమీద బంగారు పోత పోసినవీ ఉంటున్నాయి. ఆయా పేర్లతో వెతికితే వీటిని చేసిపెట్టే ఆన్‌లైన్ జువెలరీ సంస్థలు కనిపిస్తాయి.

కాదంటే వెండి, బంగారు షాపుల్లోనూ లభ్యమవుతున్నాయి. మీ అవసరాన్ని బట్టి నచ్చిన వస్తువులకు రజత పతకాన్ని అలంకరించండి మరి!

# ఈ కాంబినేషన్ వద్దు!




ముద్దపప్పు వాయలో పచ్చిపులుసు చిలకరించుకుంటే రెండు ముద్దలు ఎక్కువ లాగించేస్తాం! మటన్ బిర్యానీకి చికెన్ 65తో దోస్తీ కుదురుతుంది. అలాగని ప్రతి రుచినీ మరింత ఆస్వాదించడానికి సరైన జోడీ ఉంటుందనుకుంటే పొరపాటు. కొన్ని కాంబినేషన్‌లు మన టాలీవుడ్ సినిమాల్లా ఊహించనంతగా బెడిసికొడతాయి. ఈ తరహా జంట పదార్థాలను ఆయుర్వేదం విరుద్ధ ఆహారంగా పేర్కొంటున్నది. మధ్యాహ్న భోజనంలో తిన్న పదార్థాలను బట్టి సాయంత్రం ఏం తినకూడదో కూడా సూచించింది. ఉదాహరణకు లంచ్‌లో వేడివేడి కిచిడీ లాగించేశారే అనుకోండి.. ఆ సాయంత్రం పాలు తాగొద్దని ఆహార నిపుణుల మాట. రకరకాల కూరగాయలతో వండిన కిచిడీ అరగడానికి ఎక్కువ సమయం పడుతుంది. అది పూర్తిస్థాయిలో జీర్ణం కాకముందే చిక్కటి పాలు గుటకేస్తే.. జీవక్రియ మరింత మందగిస్తుందన్నమాట! గుడ్లు, చేపలతో కూడిన వంటకాలు తిన్నప్పుడు బీన్స్‌కు దూరంగా ఉండమని సూచించారు. అంతేకాదు, ఈ వెరైటీలు ఆస్వాదించినప్పుడు గడ్డపెరుగు వేసుకోకపోవడమే మంచిదట. అంతగా కావాలనుకుంటే మజ్జిగతో చివరి వాయ ముగించొచ్చు.

గుడ్ల వంటకాల్లో చీజ్ లేకుండా జాగ్రత్తపడాలి. కొవ్వు పదార్థాలను, ప్రొటీన్ ఆహారాన్ని కలగలిపి చేసే వంటకాల వల్ల జీర్ణశక్తి మందగిస్తుంది. జిహ్వ చాపల్యం కొద్దీ ఇలాంటి వెరైటీలు తరచూ తింటూపోతే అనారోగ్య సమస్యలూ తలెత్తవచ్చు. అందుకే, ఒక్కో పదార్థానికీ నిర్దిష్టమైన జోడీ ఉంటుందని గ్రహించి, రుచిగా వండుకొని తినేయండి.

# బాధలో ఉన్న మగాళ్ల కోసమే ఈ గ్రూప్..

## - ఇక్కడ మీ కష్టాలు చెప్పుకుని ఎంతసేపైనా ఏడవచ్చు



ఏడుపు తన్నుకొస్తుంది. ఏడ్వలేరు. మగవాళ్లు ఏడిస్తే.. సమాజం నవ్వుతుంది మరి. బాధ కలుగుతుంది. ఎవరితోనూ పంచుకోలేరు. పంచుకుంటే.. నలుగురిలో చులకన అయిపోతారు పాపం. ఎంతకాలం ఉద్వేగాల్ని దాచుకోవాలి? దాచుకున్నకొద్దీ గుండె బరువెక్కుతుంది. మెదడు వేడెక్కిపోతుంది. మానసిక సమస్యలకు దారితీస్తుంది. అధిక రక్తపోటు, గుండె సమస్యలు వచ్చినా రావచ్చు. పురుషుల్లో గూడుకట్టుకున్న భావోద్వేగాల భారాన్ని దింపేసి, సాంత్వన చేకూర్చడానికి ఆవిర్భవించిందే.. బిరాదరి. ఇది పురుషులకే ప్రత్యేకమైన సమూహం. సభ్యులు జూమ్ కాల్స్ ద్వారా భావోద్వేగాలను పంచుకుంటారు. ప్రస్తుతం బెంగళూరులోనే సేవలు లభ్యం. తమిళనాడుకు చెందిన సంగీత ఉపాధ్యాయుడు శివేన్ ప్రేమ్, బెంగళూరు నివాసి కల్పేశ్ మోరే.. ఇద్దరి సంకల్పానికి ప్రతి రూపమే బిరాదరి. ఇది పురుషుల కోసం ఏర్పాటు చేసిన వేదిక. ఇప్పటికే మహిళల కోసం జనాన్, గుల్‌నార్ తదితర సంస్థలు పనిచేస్తున్నాయి. పాపం మగాళ్లకే ఒక్క వేదికా లేదు. ఆ లోటు తీర్చడానికే శివేన్, కల్పేశ్ దీన్ని స్థాపించారు. ఇక్కడ పురుషులకే సభ్యత్వం. బిరాదరి మెంబర్స్ ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ ఆన్‌లైన్‌లో సమావేశం అవుతారు. కొంతసేపు ధ్యానం చేస్తారు. ఆ తర్వాత తమ సమస్యలు పంచుకుంటారు. భావోద్వేగాలను స్వేచ్ఛగా వెల్లడిస్తారు. వినేవారూ శ్రద్ధగా వింటారు. ఎలాంటి తీర్పులూ ఇవ్వరు. ఏవైనా స్పందనలు ఉన్నా.. వాటిని చాట్ బాక్స్‌లో పంచుకోవాలి. పద్యం, పాట, ఏదో ఓ కళా ప్రదర్శనతో నాటి సమావేశాన్ని ముగిస్తారు.'ఒక్క సైకియాట్రిస్ట్‌తో తప్ప ఇప్పటివరకు నేను ఎవరితోనూ నా భావాలను పంచుకోలేదు. కానీ, బిరాదరి సమావేశాల్లో మాత్రం మనసు విప్పగలుగుతున్నా. నేను చేసిన తప్పులను చెప్పుకొంటున్నా. ఇతరులు చెప్పిందీ సావధానంగా వింటున్నా' అంటూ తన అనుభవాల్ని వ్యక్తంచేస్తున్నాడు సమీర్ మిశ్రా అనే సభ్యుడు. తను ముంబైలో ఐటీ ఉద్యోగి. ఏడాదిగా బిరాదరితో ప్రయాణం సాగిస్తున్నాడు. కరోనా కాలంలో బిరాదరి జూమ్ కాల్స్‌లో భాగమయ్యే సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉండేది. ఆ తర్వాత కొంత తగ్గిపోయింది. ఇందులోని సభ్యులంతా 21 45 ఏండ్ల వారే.మోరే, ప్రేమ్ చిన్నప్పటినుంచీ తల్లి సమక్షంలోనే ఎక్కువగా గడిపారు. ఏ సమస్య వచ్చినా అమ్మతోనే పంచుకున్నారు. వయసు పెరిగేకొద్దీ పెద్దరికం వచ్చింది. మగవాడు అనే ముద్ర పడింది. తల్లికి, చెల్లికి చెప్పుకొనే పరిస్థితి లేకపోయింది. స్నేహితులతో షేర్ చేసుకోడానికి కూడా నామోషే. దీంతో ఉద్వేగాలన్నీ పోగైపోతున్న భావన కలిగింది. అప్పుడే ఓ వేదిక అవసరం తెలిసొచ్చింది. 'సాధారణంగా పురుషులు తాగడానికో, గాసిప్స్ మాట్లాడుకోడానికో కలుసుకుంటారు. ఈ సమావేశాల్లో కూడా తొలినాళ్లలో కొందరు సభ్యులు చేతిలో గ్లాసుతో స్క్రీన్ మీద ప్రత్యక్షమయ్యేవారు. ఆ తర్వాత, మద్యనిషేధం విధించారు.'నేను ఓ అమ్మాయిని మనసారా ప్రేమించాను. కానీ తను మాత్రం నిట్టనిలువునా ముంచేసి పోయింది' అంటూ ఓ దేవదాసు తన గోడు వెళ్లగక్కుకుంటాడు.మగజాతిని అంతం చేయడానికే పుట్టినట్టు కనిపిస్తుంది' అంటూ ఓ ట్రైనీ మేనేజర్ కన్నీళ్లు పెట్టుకుంటాడు.'ఏమని చెప్పమంటారు బ్రో. మా ఆవిడ నన్ను రోజూ చితకబాదేస్తుంది. అత్తింటివాళ్లకు చెబుదామంటే ఆత్మాభిమానం అడ్డొస్తుంది' అంటాడో సంసారి.భావోద్వేగాలను అణచుకోవడం, వెలివేతకు గురికావడం, ఒంటరితనం, అనుబంధాల సమస్యలు, వృత్తికి సంబంధించిన ఒత్తిళ్లు.. ఇలా బిరాదరి సమావేశాల్లో అనేకం చర్చకు వస్తాయి. ఇది భావోద్వేగాలు పంచుకుని ఓదార్పు పొందే వేదిక మాత్రమే. ఇక్కడ ఎలాంటి చికిత్సా అందించరు. సమావేశాల్లో పాల్గొనేవాళ్లు బిరాదరి నిర్వాహకులకు ఒక సెషన్‌కు రూ. 200 నుంచి రూ. 700 మధ్య చెల్లించాల్సి ఉంటుంది. అయితే రుసుము తప్పనిసరి కాదు. ఇష్టం ఉంటేనే!

# జూన్ 1 న ప్రజావాణి రద్దు


## – కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 31 ( భారత శక్తి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన జూన్ 1 వ తారీఖున ఆసిఫాబాద్ జిల్లాలో ఉన్నందున దానికి గాను సోమవారం రోజున జిల్లా సమీకృత కార్యాలయంలో నిర్వహించే ప్రజా వాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రకటన లో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయము గమనించి సహకరించాలని తెలిపారు.

# ప్రధానోపాధ్యాయులు

## రాచేవాడ్ గంగాప్రసాద్‌కు ఘన వీడ్కోలు




నిర్మల్ జిల్లా ప్రతినిథి, మే 31:భైంసా జడ్పీఎస్ఎస్ (గర్ల్స్) పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాచేవాడ్ గంగాప్రసాద్ పదవీ విరమణ సందర్భంగా పాఠశాల సిబ్బంది హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యారంగంలో ఎన్నో సంవత్సరాలుగా అంకితభావంతో సేవలందించిన గంగాప్రసాద్, ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసి ఆదర్శ ఉపాధ్యాయునిగా, సమర్థ ప్రధానోపాధ్యాయునిగా విశిష్ట సేవలు అందించారని సహచర ఉపాధ్యాయులు కొనియాడారు. ఆయన సేవలు విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు సమాజానికి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, జీవితంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది అని అన్నారు. గంగాప్రసాద్ భవిష్యత్ జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా, ప్రశాంతంగా, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది. ఠాగూర్ పాండు సింగ్.ఎం.ఏ. అజీమ్, ఎస్.ఎ. దేగాం తదితరులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, మే 31 : సంగారెడ్డి పట్టణంలోని 22 వ వార్డు రామ్ నగర్ లో గ్రామైక్య మహిళా సంఘ సభ్యులకు నిర్మలా జగ్గారెడ్డి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. రామ్ నగర్, రామ్ మంధిర్ లోని ఆమె స్వగృహంలో , స్థానిక కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాతిగా ఉందని, ప్రభుత్వ కార్యక్రమం మొదలుపెట్టిన మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మహిళలకు నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తుందని, గత ప్రభుత్వంలో పంపిణీ చేసిన చీరలను పొలాల వద్ద బెదురు కోసం వాడిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూన వనితా సంతోష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అశోక్ రెడ్డి, వార్డు సభ్యులు కల్పన తదితరులు పాల్గొన్నారు.

# కాగితపు లెక్కల్లోనే కొనుగోళ్లు కల్లాల్లో రైతుల కన్నీళ్లు

## – రైతు సమన్వయకర్త దన్నపనేని కిరణ్




ఏటూరు నాగారం/ములుగు జిల్లా ప్రతినిధి, మే 31 (భారత శక్తి): కాంగ్రెస్ నాయకులు కాగితపు లెక్కల్లోనే ధాన్యం కొనుగోళ్లు, కల్లాల్లో మాత్రం రైతుల కన్నీళ్లు తప్ప ఏమీ లేదని ఏటూరు నాగారం మండల బీఆర్ఎస్ రైతు సమన్వయకర్త దన్నపునేని కిరణ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఏటూరునాగారం మండల కాంగ్రెస్ నాయకులు క్షేత్రస్థాయి వాస్తవాలను దాచిపెడుతూ ఆర్భాటపు ప్రకటనలు చేయడం సమంజసం కాదన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు కొనుగోలు కేంద్రాలను స్వయంగా తనిఖీ చేసి, వడ్ల తరలింపుపై యంత్రాంగాన్ని గట్టిగా హెచ్చరించిన తరువాతే చలనం వచ్చిందని, ఈ నిజాన్ని అధికార పక్ష నాయకులు మరువకూడదని హితవు పలికారు. జిల్లా కేంద్రంలో ధర్నాలు రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరిక చేయకుంటే యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లే ఉండేదని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దన్నపనేని కిరణ్ మాట్లాడుతూ, ఎన్నికల వేళ అన్నదాతలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ఈ ప్రభుత్వం సక్రమంగా నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. ఎకరాకు రూ: 15,000/-లు ఇస్తామన్న రైతు భరోసా పెట్టుబడి సాయం ఎప్పుడొస్తుందో తెలియక, కౌలు రైతుల ఆర్థిక సాయంపై స్పష్టత లేక సామాన్య రైతాంగం తీవ్ర గందరగోళంలో ఉందన్నారు. అన్ని రకాల వడ్లకు రూ:500 లు బోనస్ ఇస్తామని నమ్మించి, తీరా అధికారంలోకి వచ్చాక కేవలం సన్న వడ్లకే, అదీ రకరకాల కొర్రీలతో పరిమితం చేయడం సగటు రైతును దగా చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. కల్లాల వద్దకు వస్తారా?.. బహిరంగ చర్చకు సిద్ధమా? ఐకేపీ కేంద్రాల వద్ద కొనుగోళ్లు వేగంగా సాగుతున్నాయన్న కాంగ్రెస్ నాయకుల మాటలను కిరణ్ తీవ్రంగా ఖండించారు. రైతులు కల్లాల వద్దే రాత్రింబవళ్లు జాగారం చేస్తూ అకాల వర్షాలకు భయపడుతున్న వైనం పాలకులకు కనిపించడం లేదా అని నిలదీశారు. కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని భావిస్తే కాంగ్రెస్ నాయకులు తన సవాల్‌ను స్వీకరించాలని పిలుపునిచ్చారు. “అధికార పక్ష నాయకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, నాతో కలిసి నేరుగా కొనుగోలు కేంద్రాలకు రావాలి. క్వింటాకు 5 నుండి 6 కిలోల వరకు ధాన్యం కటింగ్ చేస్తూ మిల్లర్లు రైతుల పొట్ట కొడుతుంటే అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారో అక్కడ రైతుల సమక్షంలోనే తేల్చుకుందాం” అని సవాల్ విసిరారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళు_ంటే దాన్ని దుష్ప్రచారంగా చిత్రీకరించడం తగదని కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు. బీఆర్ఎస్ ఎప్పుడూ అన్నదాతల పక్షానే పోరాడుతుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా రాజకీయ విమర్శలు పక్కన పెట్టి, కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి తరుగు లేకుండా, ప్రతి గింజనూ మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులకు సకాలంలో డబ్బులు అందేలా చూడాలని దన్నపనేని కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఈసెట్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ సంగారెడ్డి విద్యార్థుల ప్రతిభ

## – రాష్ట్ర స్థాయిలో విశిష్ట ర్యాంకులు

సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, మే 31: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, సంగారెడ్డి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ ఈసీఈ విభాగం విద్యార్థులు తెలంగాణ ఈసెట్ ––2026లో రాష్ట్ర స్థాయిలో విశిష్ట ర్యాంకులు సాధించి కళాశాలఖ్యాతిని మరింత పెంచారు. హయ్యర్ ఎడ్యుకేషన్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే ఈసెట్ పరీక్షలో ఈసీఈ విభాగానికి చెందిన ముగ్గురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు.

### ర్యాంకులు సాధించిన విద్యార్థులు:

పుట్టి విష్ణు వర్ధన్ – ఈసీఈ బ్రాంచ్ స్టేట్ ర్యాంక్ 16, ఇంటిగ్రేటెడ్ ర్యాంక్ 34, నక్కా సుశ్విత్ – ఈసీఈ బ్రాంచ్ స్టేట్ ర్యాంక్ 130, ఇంటిగ్రేటెడ్ ర్యాంక్ 315, దోసవారి రోహిత్ – ఈసీఈ బ్రాంచ్ స్టేట్ ర్యాంక్ 189, ఇంటిగ్రేటెడ్ ర్యాంక్ 519, ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి జానకి దేవి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలు మరియు తెలుగు మాధ్యమం నుంచి వచ్చిన విద్యార్థులకు ఇంగ్లీష్ మాధ్యమంలో పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా బోధించడం, వారి భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం, విద్యార్థుల సామర్థ్యాలను వెలికితీసే విధంగా అధ్యాపకులు నిరంతరం కృషి చేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. అలాగే ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ సి.హెచ్. విద్యాసాగర్ నాయకత్వంలో విభాగ అధ్యాపకులు ప్రత్యేక కోచింగ్, అదనపు తరగతులు, సందేహ నివృత్తి కార్యక్రమాలు, మాక్ టెస్టులు నిర్వహిస్తూ విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తున్నారని ఆమె పేర్కొన్నారు.

### ఈ విజయానికి కృషి చేసిన అధ్యాపక బృందంలో:

### డాక్టర్ సి.హెచ్. విద్యాసాగర్,

ఆర్.కె. విద్యాసాగర్,టి. మంజుల –– లెక్చరర్, ఈసీ– బి. గోపాల్ రావు –– లెక్చరర్, ఈసీఈ జి. సదానందం –– లెక్చరర్, ఈసీఈ ఉమాశంకర్ –– లెక్చరర్, ఈసీఈ వారి అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదల, విద్యార్థులపై చూపుతున్న శ్రద్ధే ఈ ఫలితాలకు కారణమనితెలిపారు. అంతేకాకుండా, ప్రతి విద్యా సంవత్సరంలో అకాడమిక్ ఫలితాల్లో కూడా ఈసీఈ విభాగం కళాశాల గౌరవాన్ని నిలబెడుతూ అత్యుత్తమ ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేస్తోందని, రాష్ట్ర స్థాయిలో చెప్పుకునే విధంగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విభాగంగా ఈసీఈ నిలిచిందని ప్రిన్సిపాల్ జానకి దేవి పేర్కొన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు మాట్లాడుతూ తమ విజయానికి ప్రిన్సిపాల్ ప్రోత్సాహం, హెచ్.ఓ.డి. మార్గదర్శకత్వం, అధ్యాపకుల నిరంతర సహకారం, ప్రత్యేక శిక్షణే ప్రధాన కారణమని తెలిపారు. ఈ సందర్భంగా వారు మొత్తం ఈసీఈ అధ్యాపక బృందానికి



కృతజ్ఞతలు తెలియజేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు విజేతలను అభినందిస్తూ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సంగారెడ్డి భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# అంకిత భావంతో పనిచేస్తే తగిన గుర్తింపు

## జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు



సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి, మే 31: ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తే ఎప్పటికీ తగిన గుర్తింపు ఉంటుందని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన గ్రంథాలయ అధికారి వడ్డే శ్యామ్ సుందర్ రెడ్డి పదవి విరమణ వీడ్కోలు సన్మానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 32 సంవత్సరాలుగా గ్రంథాలయ అధికారిగా వృత్తిలో క్రమశిక్షణ, పట్టుదల,సత్ ప్రవర్తన కలిగి, అంకితభావంతో తమ వృత్తిని సజావుగాకొనసాగించారని తెలిపారు. నిబద్ధతతో పనిచేసి అందరి మన్ననలు పొందాడని కొనియాడారు. సూర్యాపేట గ్రంథాలయంలో ఉద్యోగం చేస్తూ రాష్ట్ర ఉత్తమ గ్రంథాలయ అధికారి గ్రహీత అవార్డు అందుకున్నారు. నేడు పదవి విరమణ చేయడం అందరికీ బాధాకరంగానే ఉన్నప్పటికీ ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజమని వారి భావి జీవితం సమాజసేవలో కొనసాగుతూ గడిచిపోవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బాలమ్మ, మనోజ్ కుమార్, రాష్ట్ర ఉద్యోగుల సంఘం నాయకులు వేణుగోపాలచార్యులు,శ్రవణ్ కుమార్,రుకోధర్,రిటైర్డ్ ఉద్యోగులు సురేందర్ రెడ్డి, నాగేశ్వరరావు, రంగారావు కృష్ణారెడ్డి,యాదగిరి రెడ్డి, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో నేడు ‘సమాచార హక్కు చట్టంపై’ అవగాహన సదస్సు



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, మే 31 : సమాచార హక్కు చట్టం-2005 ను మరింత బలోపేతం చేయడానికి, ప్రజల్లో ఈ చట్టం యొక్క గొప్పతనాన్ని, ప్రాధాన్యతను చాటిచెప్పడానికి సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సోమవారం అవగాహన సదస్సును నిర్వహించనున్నారు. అనుక్షణం ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టంపై కనీస అవగాహన కలిగి ఉన్నప్పుడే అవినీతి రహిత సమాజాన్ని నిర్మించగలమని, అందుకోసమే ఈ సదస్సును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు స్వతంత్ర సమాచార హక్కు చట్టం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అంజా గౌడ్, ఉపాధ్యక్షులు గంగారాం తెలిపారు. ఈ సదస్సు వేదికగా సంగారెడ్డి జిల్లా నూతన కమిటీని కూడా అధికారికంగా ప్రకటించనున్నారు. సంగారెడ్డి జిల్లా సమాచార హక్కు చట్టం అధ్యక్షుడిగా రాపాక విజయరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. విజయరాజు నాయకత్వంలో జిల్లా వ్యాప్తంగా చట్టం మరింత బలోపేతం అవుతుందని, సామాన్య ప్రజలకు చట్టం పట్ల నమ్మకం, ధీమా పెరుగుతాయని సాటి సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# పంట వ్యర్థాలను తగలబెట్టవద్దు

## - ఎల్లారెడ్డిపేట ఎస్సై కె.రాహుల్ రెడ్డి.

### -నిర్లక్ష్యపు నిప్పుతో ప్రాణాలకు ఆస్తులకు ప్రమాదం.

భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, మే 31: పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల భూమిలోని సారవంతమైన నేలలు దెబ్బతినడమే కాకుండా, పంటకు మేలు చేసే బ్యాక్టీరియా నశిస్తుందని ఈ మేరకు ఎల్లారెడ్డి పేట మండల ప్రజలకు, రైతులకు యస్ఐ స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ఈ నిప్పు వల్ల ఇతర రైతుల పొలాలు, విద్యుత్ మోటర్లు, స్టార్టర్లు, పైపులైన్లు కాలిపోవడమే కాకుండా, ప్రాణనష్టం జరిగితే సంబంధిత వ్యక్తులపై నాన్-బెయిలబుల్ క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇటీవల వెంకటాపూర్, బొప్పాపూర్, బండలింగంపల్లి, ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులో వరి పొలంలో గడ్డికి నిప్పు పెట్టడం వలన కొంత నష్టం జరిగిందని తెలిపినారు. కావున, రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యర్థాలను తగలబెట్టకుండా, వాటికి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ఎస్సై కోరారు.




# ఎస్ వి బేకరీ ప్రారంభించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, మే 31 : సంగారెడ్డి బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ వి బేకరీని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బేకరీ నిర్వాహకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ, వ్యాపార సంస్థ అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, చీల మలన్న, రఘు, సర్పంచ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో మరింత వేగం పెంచాలి

## -అపరెల్ పార్క్, గోదాముల్లో అనుగుణంగా హమాలీల సంఖ్యను పెంచాలి

## : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, మే 31: జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు, అన్ లోడింగ్, వాహనాలు, ఇతర అంశాలపై సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని అపరెల్ పార్క్ లో పౌర సరఫరాల శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, సహకార శాఖ, మెప్మా, రవాణా శాఖ, కార్మిక శాఖ అధికారులు, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అపరెల్ పార్క్ లో ధాన్యం అన్ లోడింగ్ ను క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, హమాలీల సంఖ్య, గన్ని సంచులు, ఇప్పటివరకు ఎన్ని కొనుగోలు కేంద్రాలు మూసి వేశారు. తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు కావాల్సిన గన్ని సంచులు ముందస్తుగా తెప్పించాలని సూచించారు. కొనుగోళ్ల ప్రక్రియలో వేగం పెంచాలని తెలిపారు. కొనుగోళ్లు తుది దశకు చేరిన కేంద్రాల నుంచి హమాలీలు, వాహనాలను ఇతర కేంద్రాలకు తరలించాలని సూచించారు. ధాన్యం తరలించేందుకు ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సమకూర్చాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు, తరలింపు, అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా చేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సహకార శాఖ అధికారి రామకృష్ణ, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy